



మార్కాపురంలో సూర్యప్రభ వాహనం ముందు నాట్యం చేస్తున్న విద్యార్థినులు

7

వైభవంగా రథసప్తమి వేడుకలు

రథసప్తమి వేడుకలు జిల్లావ్యాప్తంగా మంగళవారం వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే వైష్ణవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. అనేక మంది ఇళ్ల ముందు రథం ముగ్గు వేసి సూర్యభగవానుడికి పొంగలి నైవేద్యం సమర్పించారు. మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సప్తవాహన సేవ, రథోత్సవం నిర్వహించగా వేలాది మంది ప్రజలు తరలివచ్చి తిలకించి తరించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యార్థులకు శుభవార్త

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల

- 43,050 మందికి రూ.40.98 కోట్ల నిధులు
- కళాశాలల ఖాతాలకు జమచేసిన ప్రభుత్వం



ఒంగోలునగరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. 43,050 మందికి సంబంధించి రూ.40,98,23,014 ఇచ్చింది. ఇందులో 11,340 మంది ఎస్సీలకు రూ.12,83,36,691ను వారి ఖాతాకు జమ చేసింది. మిగిలిన ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన నిధులను వారు చదువుతున్న కళాశాలల ఖాతాల్లో వేసింది. ఎంటీఎఫ్ నిధులను మాత్రం విద్యార్థుల ఖాతాలకు జమ చేసింది. ఎస్టీ విద్యార్థులు 1,097మందికి రూ.2,88,75,674, 14,543మంది బీసీ విద్యార్థులకు రూ.10,61,44,667, 10,722 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.10,54,81,839, 2,513 ముస్లిం విద్యార్థులకు రూ.2,11,47,464, 2,750మంది కాపు విద్యార్థులకు రూ.1,94,87,254, 35మంది క్రిస్టియన్ విద్యార్థులకు రూ.3,49,425ను కళాశాలల ఖాతాలకు ప్రభుత్వం జమచేసిందని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్ తెలిపారు.



'మీ ఆఫీసులో ఏం జరుగుతుందో, ఏ ఫైల్స్ ఎటు పోతున్నాయో మీరు తెలుసుకోలేరా. నేను ఆదేశించిన విచారణపై నివేదిక నా వద్దకు రాకుండా ముందే బయటకు ఎలా వెళ్లింది?. ఇలాగేనా జిల్లా అధికారిగా మీరు పనిచేసేది. అనేక శాఖలు ఉన్నా.. మీ శాఖ నుంచి వస్తున్నన్ని సమస్యలు నాకు ఎక్కడా రావడం లేదు. ఇలాగైతే చర్యలు తప్పవు' అంటూ జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడుపై కలెక్టర్ తమీమ్ అన్సారియా మండిపడ్డారు. సాధారణంగా సౌమ్యంగా మాట్లాడే ఆమె.. జిల్లా అధికారులందరి సమక్షంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కారణం ఏమిటన్న విషయంపై పలువురు అధికారులు ఆరా తీస్తున్నారు. డీపీవో వైఖరి తెలిసిన కొందరు మాత్రం ఇక్కడ చేరి ఇన్నిరోజులైనా శాఖాపరంగా పట్టుపెంచుకోకపోతే ఎలా అన్న భావనను వ్యక్తం చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ అన్సారియా

- నాకు చేరక ముందే ఫిర్యాదుదారులకా..!
- డీపీవోపై కలెక్టర్ అన్సారియా ఆగ్రహం
- పలువురు జిల్లా అధికారుల సమక్షంలో తీవ్ర అసహనం వ్యక్తంచేస్తూ హెచ్చరిక
- బాధ్యులపై చర్యలతోపాటు కార్యాలయాన్ని చక్కదిద్దుకోవాలని ఆదేశం
- ఆయనపై ప్రజాప్రతినిధుల్లోనూ అసంతృప్తి

నివేదిక బయటకు ఎలా వెళ్లింది?

అందని నారాయణరెడ్డి ఫైళ్లు

గతంలో ఇక్కడ డీపీవోగా పనిచేసిన జీవీ నారాయణరెడ్డి అప్పటి వైసీపీ కీలక పెద్దలకు సన్నిహితంగా మెలుగుతూ అక్రమాలకు పాల్పడ్డారని కలెక్టర్ అన్సారియాకు ఫిర్యాదులు అందాయి. దీనిపై ఆమె విచారణకు ఆదేశించారు. అందుకు అవసరమైన ఫైళ్లను విచారణాధికారి మూడు నెలల క్రితం డీపీవోను కోరినా ఆయన ఇవ్వకపోవడంతో ఆ విచారణ ముందుకు సాగలేదు. ఈ విషయం కూడా ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇక్కడ పోస్టింగ్ ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించిన కీలక ప్రజాప్రతినిధి కూడా డీపీవో పనితీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా సింగరాయకొండ పంచాయతీపై విచారణ కమిటీ నివేదిక బయటకు వచ్చిన వ్యవహారంపై కార్యాలయ ఏవోకు షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ తీసుకుని తనకు నివేదించాలని, అలాగే కార్యాలయ వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని కలెక్టర్ ఆ సందర్భంగా డీపీవోను హెచ్చరించినట్లు సమాచారం.

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులతో సోమవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ కార్యాలయ పనితీరుపై సీరియస్ అయ్యారు. విచారణ నివేదిక బయటకు వెళ్లడం ఏమిటని డీపీవోను ప్రశ్నించారు. ఆయన తనకేమీ తెలియదని చెప్పడంతో మండిపడ్డారు. ఈ వ్యవహారం మంగళవారం అధికార వర్గాలలో విస్తృత చర్చకు దారితీసింది. కలెక్టర్ అన్సారియా ఇక్కడ బాధ్యతలు స్వీకరించి ఏడు మాసాలు పూర్తికాగా ఇంతవరకూ ఏ ఒక్క జిల్లా అధికారిపైనా ఈ స్థాయిలో మండిపడిన దాఖలాలు లేవు. అసలు కారణం ఏమిటన్న విషయాన్ని పరిశీలిస్తే.. సింగరాయకొండ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదుతో డిసెంబరు ఆఖరు వారంలో విచారణకు కలెక్టర్ త్రిసభ్య కమిటీని నియమించారు. మెప్మా పీడీ రవికుమార్ నేతృత్వంలో నియమించిన కమిటీ ఈ విచారణను నిర్వహించి నివేదికను డీపీవో కార్యాలయంలో అందజేసింది. నెల గడిచినా సదరు నివేదిక కలెక్టర్‌కు అందకపోగా ఫిర్యాదుదారులకు డీపీవో కార్యాలయం నుంచి చేరినట్లు సమాచారం. ఆర్టీఐ యాక్టు ద్వారా పొందిన సదరు ఫిర్యాదుదారులు ఒక రాజకీయ పక్షానికి చెందిన వారు కాగా ఆ నివేదికలో కొన్ని లోపాలు ఉన్నాయంటూ వారు మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే తాను నియమించిన కమిటీ నివేదికను తనకు నివేదించక ముందే బయటి వ్యక్తులకు చేరడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. అదే విషయమై సోమవారం సాయంత్రం వీసీ సందర్భంగా అందరు అధికారుల సమక్షంలోనే డీపీవోను నిలదీశారు. అయితే తనకు ఆ విషయమే తెలియదని డీపీవో చెప్పడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ ఆఫీసులో ఏమి జరుగుతుందో తెలియదా..' అని అడిగారు. ఇలాంటి సమాచారం బయటకుపోతున్నా మిన్నకుండిపోతారా? అని మండిపడినట్లు సమాచారం.

కార్యాలయంలో రాని మార్పు

జిల్లా పంచాయతీ కార్యాలయం పనితీరుపై ఇటు కలెక్టర్‌కు, అటు అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు అనేకసార్లు ఫిర్యాదులు అందడం, దానిపై డీపీవోను కొందరు హెచ్చరించడం కూడా జరిగినట్లు

మిగతా 6వ పేజీలో

బొమ్మ తీసేయడమే!

- సర్వే రాళ్లపై ఉన్న జగన్ చిత్రాలను తొలగించేందుకు రూ.39.96 లక్షలు మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సర్వే రాళ్లపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రాల (ఫొటోల)ను తొలగించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూముల రీసర్వే చేసేందుకు సర్వే రాళ్లపై జగన్ ఫొటోలను చిత్రీకరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ రాళ్లపై ఉన్న ఫొటోలను తొలగించేందుకు జిల్లాకు రూ.39.96 లక్షలు మంజూరు చేసింది. జిల్లావ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో 2,66,421 సర్వే రాళ్లను ఏర్పాటు చేయగా వాటిపై ఉన్న ఫొటోలను తొలగించేందుకు ఒక్కో రాయికి రూ.15 చొప్పున రూ.39.96 లక్షలు మంజూరు చేసింది. సర్వే శాఖ నుంచి అందుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చిన వెంటనే కలెక్టరేట్ నుంచి నిధులను మండలాల వారీగా జమ చేయనున్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశం సమయం మార్పు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత జిల్లాపరిషత్ సమావేశం హాలులో ఈనెల 9వతేదీన నిర్వహించనున్న జడ్పీ సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని సీఈవో బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 10.30 గంటలకు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే వివిధ కారణాలతో మధ్యాహ్నానికి మార్పు చేశారు. అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని సీఈవో కోరారు.



అప్పుడే ఎండల తీవ్రత

- అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- సాధారణం కన్నా నాలుగైదు డిగ్రీలు అధికం

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. మంచు, చలి ఉధృతంగా ఉండాల్సిన సమయంలో ఉదయం నుంచే మండుతోంది. నాలుగైదు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 35 నుంచి 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అంతకు మించి నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉందన్న స్థాయిలో ఎండ తీవ్రత కనిపిస్తోంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా అంతటా వేడి వాతావరణమే కనిపిస్తోంది. రాత్రికి ఉక్కపోత కూడా పెరిగింది. సాధారణంగా ఈ సమయంలో జిల్లాలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. పగటిపూట కూడా చలి వాతావరణమే

మిగతా 6వ పేజీలో

జంగాలపల్లి నుంచి వాటర్‌షెడ్ యాత్ర

- ఇక్కడి నుంచే రాష్ట్రస్థాయి కార్యక్రమం
- జాతీయస్థాయిలో ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి ప్రారంభం
- ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నీటి సంరక్షణ పనులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో డ్వామా ద్వారా అమలయ్యే వాటర్‌షెడ్ పనులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే చెరువులు, కుంటల అభివృద్ధి పనులను గ్రామానికి కనీసం ఒక్కటైనా చేపట్టాలని భావించాయి. రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి సంరక్షణ పనులు భారీగా చేపట్టాలని నిర్ణయించాయి. ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన వాటర్ హెడ్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనున్నాయి. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రచార రథాలను ఏర్పాటు చేసి వాటర్‌షెడ్ పథకం

మిగతా 6వ పేజీలో

ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు

- జిల్లాలో 3,677 మంది క్యాన్సర్ అనుమానితులు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, అధికారులు, వైద్యులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అనుమానితులను గుర్తిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఆమె కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 7,64,400 గృహాలు ఉండగా 1,88,854 ఇళ్లను వైద్యశాఖ సిబ్బంది సందర్శించారన్నారు. జిల్లాలో 18,47,773 మంది జనాభా ఉండగా 5,32,212 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారన్నారు. 3,677 మందిని అనుమానితులుగా గుర్తించినట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులందరూ ఉచితంగా ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రొమ్ము క్యాన్సర్, నోటి, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు యాన్.సి.డి. 3.0 భాగంగా సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలను కూడా ఇంటి వద్దనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, యాన్.సి.డి. నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, డాక్టర్ పద్మజ, డాక్టర్ అనిల్, డాక్టర్ హకీమ్, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, ఎపిడమాలజిస్ట్ డి.విక్టర్‌బాబు, సాగర్ పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం చర్చిసెంటర్‌లో మానవహారం నిర్వహించారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్వో భాస్కర్, ఆర్ఐ కల్యాణి

కొత్త మార్కెట్ బకాయిలపై కార్పొరేషన్ సీరియస్

- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు ఆదాయ వనరులపై దృష్టి సారించారు. మంగళవారం ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో కొరడా ఝుళిపించారు. కొవిడ్ సాకుతో ఐదేళ్లుగా అద్దెలు చెల్లించకపోవడంతో కార్పొరేషన్ ఆదాయానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. నాటి వైసీపీ నేతల అండదండలతో అద్దెలు చెల్లించకపోవడంతో రూ.12కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. అందులో హోల్‌సేల్ దుకాణాల నుంచి రూ.5కోట్ల వరకూ రావాల్సి ఉంది. దీంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూలుకు అధికారులు రంగంలోకి దిగారు. రూ.10లక్షలపైనా బకాయి ఉన్న దుకాణాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా కొందరు వ్యాపారులు అధికారుల తీరును తప్పుబట్టారు. నష్టాల ఊబిలో ఉన్నామని, అద్దెలు చెల్లించడానికి గడువు కావాలని పట్టుబట్టారు. అందుకు కార్పొరేషన్ అధికారులు ససేమిరా అన్నారు. ఇంకా గడువు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. ప్రతి ఒక్కరూ పైసాతో సహా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం అధిక మొత్తంలో బకాయి ఉన్న దుకాణాలకు తాళాలు వేశారు. తక్కువ బకాయి ఉన్న వారికి హెచ్చరికలు జారీచేస్తూ వెంటనే చెల్లించాలని ఆదేశించారు. అయితే దుకాణాలకు తాళాలు వేసే క్రమంలో వ్యాపారుల వైపు నుంచి ఎలాంటి అడ్డగింతలు రాకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ రెవెన్యూ అధికారి విజయ్‌భాస్కర్, ఆర్ఐలు బి.కల్యాణి, కె.క్రాంతితోపాటు శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాజ్జి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఇంకొల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులోని కొణికిరోడ్డులో విఘ్నేశ్వర కోల్డ్ స్టోరేజీ సమీపంలో విద్యుత్ పనులు చేస్తుండగా స్తంభం పైనుంచి కాలుజారి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. దగ్గుబాడు గ్రామానికి చెందిన జీసస్‌బాబు(35) కరెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో విద్యుత్ పనులకు వెళ్లిన జీసస్‌బాబు స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా అదుపుతప్పి జారి కిందపడడంతో గాయాలయ్యాయి. వెంటనే ఒంగోలు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి జయసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సారా స్థావరంపై దాడులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీ స్థావరంపై వేటపాలెం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని వివేకానంద కాలనీ శివారులో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

హైవేతో మారుతున్న పర్చూరు రూపురేఖలు



జాతీయ రహదారి నిర్మాణంతో రూపురేఖలు మారుతున్న పర్చూరు



శరవేగంగా సాగుతున్న హైవే నిర్మాణ పనులు

- కూటమి ప్రభుత్వ హయాంలో శరవేగంగా రోడ్ల అభివృద్ధి
- పలు నిర్మాణాలతో గ్రామాలకు కొత్తకళ

పర్చూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచీ రహదారుల పనులు పరిగెడుతున్నాయి. ఇటు గ్రామీణ సీసీ రోడ్లతోపాటు, ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు సాగుతున్నాయి. దీనికితోడు జాతీయ రహదారుల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. అందులో భాగంగా వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈరోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పర్చూరు మండల పరిధిలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో భాగంగా పర్చూరును అనుసంధానం చేస్తూ కారంచేడు మీదుగా వాడరేవు వరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. పర్చూరు - కారంచేడు మధ్య పనులు చకచకా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంతోపాటు కల్వర్టులు, ఫ్లైవోవర్ బ్రిడ్జి ఏర్పాట్లకు సంబంధించిన పనులు చేపట్టారు. హైవే నిర్మాణంతో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ వంటి ఇరు రాష్ట్రాల మధ్య రవాణాకు సులువు కానుంది. చీరాల ప్రాంతంలో వాడరేవు ఉండడం వల్ల ఇటు పర్యాటన రంగం కూడా అభివృద్ధి చెందనుంది. దీంతో వాణిజ్య వ్యాపారాల సైతం హైవే నిర్మాణంతో మరింత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ప్రస్తుతం చేపడుతున్న హైవే నిర్మాణాలకు సమీపంలో ఉన్న గ్రామాలు నూతన శోభను సంతరించుకునే విధంగా మార్పు చెందుతున్నాయి. హైవే అధికారుల పర్యవేక్షణలో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

మెరుగైన రవాణా వ్యవస్థకు దోహదం

వాడరేవు - పిడుగురాళ్ల వరకు హైవేతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. హైదరాబాద్ నుంచి వాడరేవు రవాణాకు ఉపయోగపడే ముడిసరుకు రవాణాకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటికీ మించి మోటుపల్లి, పెద్దగంజాం, ప్రాంతానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలోనే రైల్వే ట్రాక్ కూడా ఉండడం రవాణాకు దోహదం. సమీపంలోనే విజయవాడ కృష్ణా బ్యారేజీ నుంచి చెన్నై వెళ్లే బకింగ్‌హాం కెనాల్ అభివృద్ధికి ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో ఈహైవే నిర్మాణం మరింత దోహదపడే అవకాశం ఉంది

అప్పుడే ఎండల తీవ్రత

(5వ పేజీ తరువాయి)

ఉంటుంది. అర్ధరాత్రి నుంచి చలితో కూడిన మంచుపడుతూ ఉదయం 9 గంటల వరకూ ఆ ప్రభావం ఉంటుంది. అనంతరం కూడా ఎండ పెద్దగా ఉండదు. శివరాత్రి పండుగ వరకు ఈ తరహా వాతావరణం కొనసాగుతుంది. అనంతరం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా కనిపిస్తోంది. శివరాత్రి ఇంకా 20రోజులు ఉండగా అప్పుడే ఎండల తీవ్రత పెరిగింది.

ఈ వేసవిలో ఎండలు అధికమే..

ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ సంకేతాలు ఇస్తుండగా ఆ ప్రభావం ఇప్పటి నుంచే కనిపిస్తోంది. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో నాలుగైదు రోజులుగా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఒక రకంగా రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలలో జిల్లా ముందు వరుసలో ఉంటుంది. మంగళవారం కూడా అలాగే ఉంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రాష్ట్రంలోనే అత్యధికంగా మర్రిపూడి మండలం జువ్విగుంటలో 36డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఐదు గంటలకు కూడా పెద్దారవీడు మండలంలో 35డిగ్రీలకు పైగా ఉంది. తూర్పుప్రాంతంలోనూ క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. ఒంగోలులో మంగళవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35.10 డిగ్రీలుగా ఉంది. ఇక్కడ ఈనెల 1న 31.7 డిగ్రీలు, 2న 32.7, 3వతేదీన 34.3 నమోదైంది. ఇక మంగళవారం ఏకంగా 35 డిగ్రీలు దాటింది. అలా నాలుగైదు రోజుల్లో నాలుగు డిగ్రీలు పెరిగింది. ఈ సమయంలో ఇలాంటి వాతావరణం ఉండటంతో ఇక వేసవిలో ఏ స్థాయిలో ఎండలు ఉంటాయోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

జంగాలపల్లి నుంచి వాటర్‌షెడ్ యాత్ర

(5వ పేజీ తరువాయి)

అమలు చేసే ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించాయి. ఒక్కో రాష్ట్రానికి ఒక ప్రచార రథాన్ని ఏర్పాటుచేయగా ఢిల్లీలో ఆ కార్యక్రమాన్ని బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి గిరిజ్‌సింగ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. తదనుగుణంగా ఆయా రాష్ట్రాలలో స్థానికంగా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నారు.

పండుగ వాతావరణంలో..

రాష్ట్రంలో ప్రచారరథం కార్యక్రమాన్ని జిల్లా నుంచి చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందుకు కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం మురగమ్మి పంచాయతీలోని జంగాలపల్లిని ఎంపిక చేశారు. అక్కడ వాటర్‌షెడ్ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేసి ఉండగా ఆ ప్రాంతంలో పండుగ వాతావరణంలో ప్రచారరథాన్ని ప్రారంభించేలా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఉపాధి పథకం డైరెక్టర్ షణ్ముక్ తదితరులు పాల్గొనున్నారు. కాగా ఢిల్లీలో కేంద్రమంత్రి ప్రారంభించే కార్యక్రమాన్ని ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం చేసి అనంతరం రాష్ట్రస్థాయి ప్రచార రథాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం.

జీజీహెచ్‌లో సదరమ్ సర్టిఫికెట్‌ల పునఃపరిశీలన



జీజీహెచ్‌లో వైద్య పరీక్షల కోసం వచ్చిన పింఛన్‌దారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సదరమ్ సర్టిఫికెట్‌ల పునఃపరిశీలన కార్యక్రమం మంగళవారం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో ప్రారంభమైంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ముందస్తు నోటీసులు అందుకున్న పలువురు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చెవి, ముక్కు, గొంతు, ఎముకలు, కీళ్లు, కంటి పరీక్షలు, మానసిక రోగులు తదితర సమస్యలకు సంబంధించి ఇప్పటికే సదరమ్ సర్టిఫికెట్‌లు పొంది, ప్రభుత్వ పింఛన్ పొందుతున్నారు. ఈ క్రమంలో వారికి మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి మంజూరైన సర్టిఫికెట్‌లు సరైనవా? కాదా అని పరిశీలించారు. మొదటిరోజు సుమారు మూడు వందల మంది వరకు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోగా, సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున పర్యవేక్షించారు.

కాలువలో బాలుడి మృతదేహం



కాలువ నుంచి వెలికి తీసిన బాలుని మృతదేహం



సందీప్ (ఫైల్)

- అదృశ్యమైన 24గంటల వ్యవధిలో శవమై లభ్యం
- అడుసుమల్లి ఎస్సీ కాలనీలో విషాదం

అడుసుమల్లి (పర్చూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి అదృశ్యమైన బాలుడు 24 గంటల వ్యవధిలో కాలువలో శవమై కన్పించాడు. ఈ ఘటన పర్చూరు మండలం, అడుసుమల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అడుసుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన కుంచాపు సందీప్ (15) స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని చెప్పి టీవీఎస్ వాహనంపై వెళ్లిన సందీప్ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా గంటలో వస్తానని ఫోన్ ద్వారా మెసేజ్ పంపాడు. రాత్రికి రాకపోవడంతో సోమవారం సందీప్ కోసం వెతకగా ఆచూకీ లేకపోవడంతో పర్చూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈక్రమంలో మంగళవారం ఉదయం కాలనీ సమీపంలోని లిఫ్ట్ ఇరిగేషన్ బావి వద్ద బాలుడు తీసుకువెళ్లిన మోపెడ్, చెప్పులు కనపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న బంధువులు బావి పక్కనున్న కాలువలో బాలుని మృతదేహం తేలుతూ ఉండడాన్ని గమనించి బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్సై సురేష్‌రెడ్డి, సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదమా లేక ఇతర కారణాలా అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

ఏడేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి

ఏడేళ్ల కిందట కొద్దిపాటి వివాదంతో సందీప్ తల్లిదండ్రులు కుంచాపు కిషోర్, సుజాత ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో సందీప్ తాత, బాబాయి సంరక్షణలో అడుసుమల్లిలోనే ఉంటూ స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నాడు. ఇటీవల తాత కూడా మృతి చెందారు. ఇప్పుడు సందీప్ కూడా మృతి చెందడంతో ఎస్సీ కాలనీలో విషాదం చోటుచేసుకుంది.

సోషల్ మీడియాలో పోస్టులపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కూటమి నాయకులు

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మాధ్యమాల్లో విభేదాలు సృష్టించేలా పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. సోషల్ మాధ్యమాన్ని వేదికగా చేసుకుని ఓ వ్యక్తి త్వరలో చీరాలకు గొట్టిపాటి ఇన్‌చార్జిగా వస్తున్నట్లు పోస్టు చేశారు. దీంతో ఆగ్రహించిన కూటమి నాయకులు మంగళవారం వేటపాలెంలో ఆందోళన చేపట్టారు. నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని ఎమ్మెల్యే కొండయ్య అభివృద్ధికి పాటుపడుతున్న క్రమంలో విభేదాలు సృష్టించేలా ఉద్దేశపూర్వకంగా పోస్టులు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఎస్సై వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదు చేశారు.

పాలేటి వ్యవహారం సరైనది కాదు

పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా ఎన్టీఆర్ విగ్రహానికి భూమిపూజ నిర్వహించిన పాలేటి తీరు సరైనది కాదని పలువురు టీడీపీ కూటమి నాయకులు అన్నారు. పార్టీ ప్రతిష్టను భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. విభేదాలు సృష్టించేలా వైసీపీ నాయకులతో భూమిపూజ చేయించడం విచారకరమన్నారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పార్టీకి భంగం కలిగిస్తే విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాశీవీరభద్రయ్య, పార్థసారథి, పోతురాజు. మార్కండేయులు, పల్లప్రోలు శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.

బర్లీ రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

పంగులూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రైవేటు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి బర్లీ పొగాకు ధరలు పూర్తిగా తగ్గించి సంక్షోభానికి తెరతీశాయని, ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రైవేటు కంపెనీల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు. కంపెనీల మాటలు నమ్మి రైతులు ఇతర పంటల సాగును వదిలేసి పొగాకు విస్తారంగా సాగు చేశారన్నారు. ఇది కొనసాగితే రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదుం సాహెబ్, రాయిణి కిరణ్, డాక్టర్ మంచాల రమేష్ పాల్గొన్నారు.

పుల్లలచెరువు సచివాలయ సిబ్బందికి నోటీసులు

సచివాలయం-2లో పత్తాలేని సిబ్బంది

ఆగ్రహం వ్యక్తం చేసిన సబ్ కలెక్టరు వెంకట త్రివినాగ్



సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మార్కాపురం సబ్ కలెక్టరు వెంకట త్రివినాగ్

పుల్లలచెరువు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వసేవలు చేయాల్సిన సచివాలయం సిబ్బంది అందుబాటులో లేకపోకపోవడంపై మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పుల్లలచెరువులో ఆయన పర్యటించారు. ముందుగా పుల్లలచెరువు సచివాలయం-2ను తనిఖీ చేశారు. ఆ సమయంలో వీఆర్వో మినహా సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవోను షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఎంపీడీవో వసంతరావు నాయక్, వీఆర్వో కేటేశ్వరరావు వున్నారు.

పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

అవీఇవీ

- బాధితులు, దళిత సంఘాల నేతలపై కౌంటర్ కేసు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): పోలీసుల చుట్టూ తిరిగినా కేసు నమోదు చేయలేదని బాధితులు ఐజీ త్రిపాఠీకి ఫిర్యాదు చేశారు. గత సోమవారం ఒంగోలులో టూటౌన్ పోలీస్‌స్టేషన్ తనిఖీకి వచ్చిన ఐజీకి బాధితురాలి తల్లి, అన్నతో పాటు దళిత సంఘాల నాయకులు కలిసి సమస్య విన్నవించారు. నగరంలోని కేశవరాజుకుంటలో కొంత మంది యువకులు తమ కుమార్తెను వేధిస్తున్నారని, అందుకు సంబంధించి తాలుకా పోలీసులను ఆశ్రయించినా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. దీంతో ఐజీ వెంటనే కేసు నమోదు చేయాలని తాలుకా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు నిందితులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసిన పోలీసులు బాధితులకు ఝలక్ ఇచ్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు మరో ఫిర్యాదు చేశారు. తమపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయిస్తామని బాధితురాలి తల్లి, సోదరుడు, దళిత నాయకులు బెదిరించారని మరో ఫిర్యాదు చేయడంతో మంగళవారం కౌంటర్ కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. బాధితులపై కేసుతో పాటు దళిత నాయకులపై కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

భూముల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరిస్తాం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్



మూలగుంటపాడులో పర్యటిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్

సింగరాయకొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని కొన్ని సర్వే నంబర్‌లలో నిలిచిపోయిన భూముల రిజిస్ట్రేషన్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమస్యపై ఇటీవల గ్రామస్థులు 'మీకోసం'లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె ఆదేశాలతో మంగళవారం మూలగుంటపాడులో వరకుమార్ పర్యటించారు. పంచాయతీ సరిహద్దులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ సమస్యపై గ్రామస్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఆర్‌ఐ ప్రసాద్, టీడీపీ నేతలు సన్నెబోయిన శ్రీనివాసులు, చిగురుపాటి గిరి, నరాల సుధాకర్, మల్లికార్జున పాల్గొన్నారు.

మృతి చెందిన రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి స్వామి, పక్కన టీడీపీ నాయకులు

కొండపి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఏడాది క్రితం మరణించిన దాసరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు కాటంరెడ్డి గురవారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసింది. అందుకు సంబంధించిన పత్రాన్ని మంగళవారం రాత్రి గురవారెడ్డి భార్య వెంకటరత్నానికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తూర్పునాయుడుపాలెంలోని ఆయన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ జిల్లా అధికార మాజీ ప్రతినిధి కొర్రపాటి వసంతరాయుడు, యనమద్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో కేటాయింపులపై నిరసన ప్రదర్శన నేడు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌లో రైతులు, రైతు కూలీలను విస్మరించడాన్ని నిరసిస్తూ బుధవారం ఒంగోలులో నిరసన ప్రదర్శన, బడ్జెట్ కాపీల దహనం చేయడం జరుగుతుందని కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం సంయుక్తకిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ నాయకుల జేసీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. బడ్జెట్‌లో పంటలకు గిట్టుబాటు ధరలు ఊసేలేకుండా పోయిందన్నారు. నిరసన కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పమిడి వెంకటరావు, బి.సుబ్బారావు, కంకణాల ఆంజనేయులు, వి.బాలకోటయ్య, పద్మ, జి.శ్రీనివాసులు, జె.జయంత్‌బాబు, టి.రాము, వి.మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

10నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈనెల 10నుంచి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరక్షలు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. పబ్లిక్ పరీక్షల తరహాలో 100 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లీషు, 13న కాంపోజిట్ కోర్సు పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్‌లాంగ్వేజి పేపర్-1, 15న గణితం, 17న ఫిజికల్ సైన్స్, 18న బయలాజికల్ సైన్స్, 19న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపరు-2, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు, 20న సోషల్ పరీక్ష జరుగుతుంది.

నివేదిక బయటకు ఎలా వెళ్లింది?

(5వ పేజీ తరువాయి)

సమాచారం. ఇక్కడ బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు అవుతున్నా కార్యాలయ పనితీరులో మార్పు రాలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా అంశాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు డీపీవోను అడిగినా.. ఇక్కడ ఎవరూ పనిచేయడం లేదు, ఫైళ్లు తానే రాసుకుంటున్నానని చెప్పడం, ఇతర అధికారుల వద్ద కూడా అలాగే తరుచూ మాట్లాడటం వంటి విషయాలపై చర్చ సాగుతోంది. జిల్లాలో అత్యధికశాతం మంది వైసీపీ సర్పంచ్‌లు ఉండగా ప్రస్తుతం అధికార టీడీపీ ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా డీపీవో వ్యవహరించకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయన్న అభిప్రాయానికి నేతలు వచ్చినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని కొందరు కలెక్టర్ దృష్టికి కూడాతీసుకెళ్లినట్లు సమాచారం.

తైక్వాండోలో చినగంజాం విద్యార్థుల సత్తా

చినగంజాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర తైక్వాండో పోటీలలో విద్యార్థులు సత్తాచాటి, మెడల్స్ సాధించారని సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.హరనాథ్‌బాబు తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో తూర్పుగోదావరి జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన 1వ ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనపరచి పది మెడల్స్ సాధించినట్లు తెలిపారు.









ఓం ఆదిత్యాయ నమః

● వైభవంగా రథసప్తమి వేడుకలు ● సప్తవాహనాలపై విహరించిన చెన్నయ్య
● పులకించిన భక్తజనం ● ఆధ్యాత్మిక శోభలో మార్కాపురం


మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలు మంగళవారం మార్కాపురం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి శ్రీదేవీభూదేవి సమేతంగా వెండిర థంపై భక్తులకు దర్శనమిచ్చారు. సప్తవాహనాలపై వివిధ అలంకారాలలో స్వామి ఊరేగారు. తిరుమల తరహాలో రథ సప్తమి వేడుకలు జరగడంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఉదయం 5:30 గంటలకు సూర్యప్రభ వాహనం అనంతరం శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష వాహనాలపై శ్రీవారు 4 మాడవీధులలో విహరించారు. సాయంత్రం వెండిర థంపై చెన్నకేశవస్వామికి చెన్నకేశవ నామస్మరణల మధ్య రథోత్సవం నిర్వహించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి నగరోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, డీఎస్పీ నాగరాజు, రథసప్తమి సేవా సంఘం అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, కార్యదర్శ ఆలంపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి బొంతల వెంకట సుధీర్ కుమార్, రథసప్తమి సేవా సంఘం ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు పాల్గొన్నారు. డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో సీఐ సుబ్బారావు బందోబస్తు నిర్వహించారు.


శేషవాహనంపై విహరిస్తున్న చెన్నకేశవుడు


హనుమంత వాహనంపై..


గరుడ వాహనంపై..


కల్పవృక్ష వాహనంపై..


సూర్యప్రభ వాహనంపై..


వెంకటేశ్వరస్వామి వేషధారణ


వాహన సేవలో ఎమ్మెల్యే కందుల, ఎస్పీ దామోదర్, సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్, కందుల నందిని

బీసీలకు రుణాల పండుగ

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.24.68 కోట్ల మంజూరు
- లబ్ధి పొందనున్న 1219 మంది
- వైసీపీ హయాంలో సుప్తావస్థలో కార్పొరేషన్లు



గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది రూ.24.68 కోట్లతో 1219 మంది బీసీలకు రాయితీపై రుణాలు మంజూరు చేయడానికి శ్రీకారం చుట్టింది. 2014-18 సంవత్సరాల నడుమ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, బ్రాహ్మణ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వేలాది మందికి రుణాలు మంజూరు చేసింది. చిన్న టిఫిన్ సెంటర్ నుంచి సూపర్‌బజార్ల వరకు ఏర్పాటు చేసుకునే బీసీ ఉపకులాల వారు ఉపాధి పొందడమే కాకుండా ఆర్థికంగా స్థిరపడ్డారు. అదేవిధంగా బలిజ, కాపు, తెలగ, రజక, నాయీబ్రాహ్మణ తదితర కులాల వారిని గ్రూపులుగా చేర్చి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలను మంజూరు చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును ఇచ్చింది.

ఫిబ్రవరి 7వ తేదీలోపు దరఖాస్తుకు అవకాశం

రాయితీ రుణాలకు అర్హులైన వారు ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆయా సచివాలయాలలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మండల, మున్సిపల్ స్థాయిలో స్క్రూటినీ నిర్వహించనున్నారు. 12వ తేదీ నుంచి 14వ తేదీలోపు బ్యాంకర్లు, ఎంపీడీవో, కమిషనర్లు, బీసీ కార్పొరేషన్ అధికారులతో కూడిన కమిటీ రుణం మంజూరుపై నిర్ణయం తీసుకుంటారు. ఇలా తయారయ్యే జాబితాను 15, 16 తేదీలలో కమిటీ నుంచి ఆయా బ్యాంకులకు పంపిస్తారు. వారు వివరాలను పరిశీలిస్తారు. 16 నుంచి 20వ తేదీలోపు ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోలకు, కమిషనర్లకు పంపుతారు. 21న తుది జాబితాను కలెక్టర్‌కు, 23 రాష్ట్ర కార్యాలయానికి పంపుతారు. 24, 25వ తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం అప్రూవల్ చేశాక 26 నుంచి 28వ తేదీల మధ్య లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు డబ్బులు జమవుతాయి.

● అదే ఒరవడితో ముందుకు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల వ్యవధిలోనే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.24.68 కోట్లతో 1219 మందికి రాయితీ రుణాలను పంపిణీ చేయనున్నది. బీసీలకు 1219 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్‌కు 48 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్‌కు 209 యూనిట్లు, బ్రాహ్మణులకు 19 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు 5 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్‌కు 233 యూనిట్లు మంజూరు చేసింది. ఇందులో బేకరీ, చికెన్, మటన్ షాపు, గ్రానైట్ పాలీష్‌మిషన్, లాండరీ షాపు, ఫొటో స్టూడియో, జనరిక్ మెడికల్ దుకాణాలు తదితర 60 రకాల వాటిపై ప్రభుత్వం రుణాలను మంజూరు చేసింది.

● వైసీపీ హయాంలో చిల్లిగవ్వ లేదాయే

2019-24 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల కార్పొరేషన్‌కు ఐదేళ్లపాటు ఒక్క రుణాన్ని కూడా మంజూరు చేయలేదు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంజూరై ఎన్నికల కోడ్‌తో నిలిచిన యూనిట్లను కూడా వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేయలేదు.

వసతి గృహ విద్యార్థులు
ఉత్తమ ఫలితాలు సాధించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆల్ ఇన్ ఒన్ స్టడీమెటీరియల్‌ను అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో వసతి గృహాల్లో చదువుకుంటున్న 2006 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిపబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు రూ.260 విలువైన స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు సంక్షేమ శాఖాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమశాఖల అధికారులు ఎన్.లక్ష్మానాయక్, ఎకం. అంజల, వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డీఈవో కిరణ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, అధికారులు డి. అంకబాబు, ఎం. అరుణ, శ్రీలత, డి. దుర్గలక్ష్మి, టి. ధనలక్ష్మి, వెంకట్రావు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులు
ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి అసంఘటిత రంగ కార్మికుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం ఈ-శ్రమ్ పథకంలో సభ్యత్వనమోదుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమ శాఖలపరిధిలోని అసంఘటిత రంగ కార్మికులందరికీ సభ్యత్వ నమోదు చేయించాలని ఆదేశించారు. నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి కేంద్ర ప్రభుత్వం సామాజికభద్రతతో పాటు అంగవైకల్యం కలిగినా లేదా ప్రమాదవశాత్తు మరణించినా కుటుబానికి రూ.2లక్షలు ఆర్థికభద్రత కల్పిస్తుందని తెలిపారు. జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి పోర్టల్‌లో సభ్యత్వ నమోదుకు సంబంధించిన విధివిధానాలను, అర్హతలను, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, శ్రీనివాసప్రసాద్, సహాయకార్మిక కమిషనర్లు కె.భవాని, ఎం.కోటేశ్వరరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారునికి ఘన సన్మానం


శివారెడ్డిని ఊరేగింపుగా ఈదరకు తీసుకువస్తున్న గ్రామస్థులు

ముండ్లమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఖోఖో క్రీడాకారుడు పోతిరెడ్డి శివారెడ్డిని మంగళవారం రాత్రి స్వగ్రామమైన ఈదరలో ఘనంగా సన్మానించారు. గత నెల 13 నుంచి 20వ వరకు ఢిల్లీలో జరిగిన ప్రపంచ కప్ ఖోఖో పోటీల్లో జాతీయ జట్టు తరపున ఆయన పాల్గొన్నారు. ఇండియా జట్టు ప్రపంచ కప్ సాధించడంలో ఆయన కీలక పాత్ర వహించారు. సొంతూరు వచ్చిన సందర్భంగా ఈదర, పూరిమెట్ల, కొమ్మారం, అయోధ్య నగర్, బొప్పుడివారిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు భారీగా స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టుకొని శివారెడ్డికి స్వాగతం పలికారు. ర్యాలీగా ఈదరకు చేరుకున్న ఆయనకు గ్రామస్థులు పూల స్వాగతం పలికారు. అనంతరం శివారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ప్రకాశం జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి భవనం కాశీ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ వంగల పద్మావతి శ్రీనివాసరెడ్డి, పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పూరిమెట్ల సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండారు రాముడు తదితరులు పాల్గొన్నారు.

డీజేఆర్ ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం

● ఎమ్మెల్యే దామచర్ల
● ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన నాగసత్యలత

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం స్థానిక పీఏజీ కన్వెన్షన్ హాలులో జరిగిన వైద్యశిబిరాన్ని ట్రస్ట్ అధ్యక్షురాలు దామచర్ల నాగసత్యలత ప్రారంభించగా, ఎమ్మెల్యే జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వీధి వ్యాపారులకు భరోసాగా తోపుడు బండ్లు, వేసవిలో గొడుగులు, నిరుపేద చిన్నారులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా దామచర్ల కుటుంబం చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. నాగసత్యలత మాట్లాడుతూ దామచర్ల కుటుంబ రాజకీయాల ద్వారా ప్రజా సేవకే పరిమితం కాకుండా నిరుపదేలకు అన్ని విధాలుగా అండగా ఉండాలన్నదే లక్ష్యమన్నారు. అందుకోసం ఏర్పాటైన డీజీఆర్ ట్రస్ట్ నిరుపేదలకు చేరువై అవసరమైన సహకారం అందించడంతోపాటు, పేదల జీవనోపాధికి, ఆరోగ్యానికి చేయూత ఇవ్వనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో సేవలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ సెంటర్, చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ హాస్పిటల్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి దామచర్ల అనీషాలక్ష్మి, నిడమనూరు పావని, *పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన దోర్నాల విద్యార్థులు

వాలీబాల్ పోటీల్లో స్వర్ణం కైవసం


స్వర్ణ పతకం సాధించిన విద్యార్థులు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో దోర్నాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు షేక్ అర్షద్ బాష, షేక్ రఫీ, షేక్ అబ్దుల్ కపిల్ అండర్-19 విభాగంలో జనవరి 28నుంచి 30వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు నాగమూర్తి, విద్యార్థులను, వారికి శిక్షణ నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు పీ రామానాయక్,హెచ్ రామానాయక్‌లను అభినందించారు.

‘గీత’ మద్యం దుకాణాల
దరఖాస్తులకు నేడు ఆఖరు

● కోర్టు అడ్డంకులు ఏవీ లేవు..
● జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి ఖాజామొహీద్దీన్



ఒంగోలు క్రైం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 17 మద్యం దుకాణాలకు బుధవారంతో దరఖాస్తుల గడువు ముగిస్తుందని ఎక్సైజ్ శాఖ అధికారి ఖాజామోహీద్దీన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రకాశంభవన్‌లో గల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు లైసెన్స్ ఫీజ్‌లో రాయితీ ఇవ్వడంపై కొంతమంది కోర్టును ఆశ్రయించారన్నారు. దానిపై హైకోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి రెండు వారాల తరువాత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని కోరారని, దీంతో యథావిధిగా గీతకార్మికుల దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని స్పష్టం చేశారు. ఈనెల 7న లాటరీ పద్ధతి ద్వారా దుకాణాలు కేటాయిస్తామన్నారు. దుకాణాలు పొందిన వారికి లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీతో పాటు గడిచిన నాలుగు నెలల కాలానికి ఫీజు మినహాయింపు కూడా ఉంటుందని చెప్పారు. ఉదాహరణకు ప్రస్తుతం మార్కెట్‌లో రూ.65 లక్షలు లైసెన్స్ ఫీజు ఉన్న ప్రాంతంలో 50 శాతం ఫీజు మినహాయింపు అంటే రూ.32.50 లక్షలు కాగా దానిలో నాలుగునెలలు లైసెన్సు ఫీజు మినహాయిస్తే రూ.21,66,667 మద్యం దుకాణాదారులు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికి 17 దుకాణాలకు గాను 14 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. బుధవారం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోర్టు స్టే ఇస్తుందని కొంతమంది ఎదురు చూశారని వివరించారు. ఈక్రమంలో బుధవారం దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్లు పెడుతున్నామని ఖాజామోహీద్దీన్ చెప్పారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

● సప్తవాహనాలపై స్వామివారి నగరోత్సవం



గాంధీరోడ్డులో ఊరేగుతున్న సూర్యభగవాన్‌కు నమస్కరిస్తున్న భక్తులు



ఒంగోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో..



సంతనూతలపాడులోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



మద్దిపాడులో పల్లకి మోస్తున్న భక్తులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి పండుగను మంగళవారం ఒంగోలు నగరంతో ఘనంగా నిర్వహించారు. సూర్యభగవానుని పూజతో పాటుగా సప్తవాహన సేవ ఘనంగా జరిగింది. దక్షిణం బజారులోని శ్రీవేంకటేశ్వర బాలభక్త సమాజం ఆధ్వర్యంలో సూర్యప్రభ వాహనం, సర్వభూపాల వాహనం, శేషప్రభ వాహనం, సింహవాహనం, హనుమంత సేవ, గరుడ సేవ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించి గాంధీరోడ్డుతో పాటు ప్రధాన మార్గాలలో నగరోత్సవాన్ని నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అటు స్థానిక కేశవస్వామిపేట శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలోను స్వామి వారి నగరోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సూర్యప్రభ వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆదిత్య హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తలు ఆలూరు సుశీలాదేవి, ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, జైశంకర్ తదితరులు పర్యవేక్షించారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: మద్దిపాడులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వెంకటరమణ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఉంచి మహిళా భక్తులు గ్రామంలో ఊరేగింపు చేశారు. కనుమరులపూడి శివకుమార్, సాతులూరి నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షణ చేశారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళాభక్తులు కోలాటం నిర్వహించారు. తీర్థప్రసాదాలను అందజేసారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: రథసప్తమి పర్వదిన వేడుకలను మంగళవారం చీమకుర్తి పట్టణంలో వైభవంగా జరుపుకున్నారు. విశేషంగా అలంకరించిన వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో గోవిందస్వాములు, భక్తులు నగరోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి సోమా శేషారావు, కోట రామారావు, నూకల రాఘవ, దొంతు సుధాకర్, వాసికొండలు, మాధవ ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ మేయర్ మేమూరి బుజ్జి అధ్యక్షతన జరగనుంది. స్థానిక కార్యాలయంలోని మందిరంలో జరిగే సమావేశానికి టీడీపీ కూటమి, వైసీపీ కార్పొరేటర్లు, అధికారులు హాజరుకానున్నారు. అజెండాలో మొత్తం 29 అంశాలు ఉంచారు. వాటిలో కొన్ని అభివృద్ధి పనులు, ఆంధ్రకేసరి యూనివర్సిటీలో బాలికల హాస్టల్ నిర్మాణానికి నోటిఫికేషన్, ఊరచెరువులోని షాదీఖానా లీజు, అద్దె తదితర అంశాలను పొందుపరిచారు. అలాగే 681 మంది పారిశుధ్య కార్మికుల కొనసాగింపు, ముస్లిం బరియల్ గ్రౌండ్ అభివృద్ధి, దామచర్ల సక్కుబాయమ్మ డిగ్రీ కాలేజీలోని పరివర్తన భవన్‌లో సౌకర్యాల కల్పన, భవన మరమ్మతులు, కొప్పోలులోని అంబేడ్కర్ ఆడిటోరియం అభివృద్ధి పనులు, కార్పొరేషన్ కార్యాలయం నూతన భవన నిర్మాణ టెండర్లు, పలు అంశాలపై చర్చించనున్నారు. అయితే గత కౌన్సిల్‌లో వాయిదా పడిన అంశాలపైనా చర్చించే అవకాశం ఉంది.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఒత్తిడి దూరం



ప్రవచిస్తున్న శివసుబ్రహ్మణ్యశర్మ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీలలితా జ్ఞానపీఠం 73వ వార్షికోత్సవాల కార్యక్రమంలో ఆయన వర్తమాన సమాజంలో భక్తి, ఆధ్యాత్మిక పెంపుదల ఆవశ్యకతను గురించి ప్రవచనం చేశారు. మోక్ష సాధనకు అవసరమైన భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు ఎలా ఉపకరిస్తాయో వివరించారు. భారతం, భాగవత పురాణాలలోని ఘట్టాలను ఆయన విపులంగా ప్రవచనం చేశారు. అనంతరం పీఠం అధ్యక్షురాలు మాతృశ్రీ విజ్ఞానానంద సరస్వతి మాతాజీ, కమిటీ సభ్యులు కలిసి శివసుబ్రహ్మణ్యశర్మను ఘనంగా సత్కరించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్స్ చూపుతున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం వీఐపీరోడ్డులోని శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూలు విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్(క్యాట్) లెవల్-2లో మంచి ప్రతిభను చాటారు. మంగళవారం స్థానిక స్కూలులో జరిగిన కార్యక్రమంలో బ్రాంచి ప్రిన్సిపాల్ అపర్ణశిరీష మాట్లాడుతూ 75 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో నగదు బహుమతిని 13 మంది, మెడల్, సర్టిఫికెట్స్‌కు 37 మంది, 26 మంది మెరిట్ సర్టిఫికెట్స్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను రీజనల్ ఇన్‌చార్జి వై.అనిల్‌కుమార్, కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, బ్రాంచ్ డీన్ వై.శ్రీనివాసరావు అభినందించారు.

త్రోవగుంట హైస్కూలు తనిఖీ

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని త్రోవగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వరరావు తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల గణితం నోట్‌పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను దత్తతతీసుకొని నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అన్ని సబ్జెక్టుల్లో అత్యధికమార్కులు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని టీచర్లను ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు.

పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారాన్ని అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనుబాబు తెలిపారు స్థానిక రిమ్స్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌లో మంగళవారం పది మంది హెచ్ఐవీ బాధితులకు ఈ ప్యాకెట్లను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జోసఫ్, డాక్టర్ శివశ్రీ, సొసైటీ కార్యదర్శి రాఘవ, సభ్యులు పైనం ప్రభాకర్, నాగరాజు, గ్రో ఎన్‌జీవో మేనేజర్ పీరుబాషా పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంతో పాటు ప్రకాశం జిల్లాలో యువతకు కృత్రిమ మేథస్సు, సంబంధిత కొత్త నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయమంత్రి జయంత్‌చౌదరి సమాధానం ఇస్తూ 2015 నుంచి దేశంలో యువతకు కృత్రిమమేధస్సు, సంబంధిత కొత్త నైపుణ్య శిక్షణ అందించేందుకు పీఎం కౌశల్ వికాస్ యోజన ద్వారా పలు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024 డిసెంబరు నాటికి దేశంలో 36,973మంది యువకులు కృత్రిమమేథస్సు కోర్సులలో నమోదు కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పది జిల్లాల్లో 1,982 మంది పేర్లు నమోదుతో రూ. 81.57 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే ప్రకాశం జిల్లాలో ఇంకా ఎవరూ నమోదు కాలేదని మాగుంట ప్రశ్నకు కేంద్ర వివరణ ఇచ్చారు.

జనసేన నాయకుడికి పరామర్శ

మద్దిపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాచవారిపాలెంలో జనసేన పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు కూచిపూడి విజయ్‌ప్రసాద్‌ను మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం మంగళవారం పరామర్శించారు. విజయ్‌ప్రసాద్ నాయనమ్మ సుబ్బులు మంగళవారం వేకువజామున అనారోగ్య సమస్యలతో మృతి చెందగా జనసేన పార్టీ కమిటీ సభ్యులు ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఆరే వెంకటేశ్వర్లు, పొన్నం అయ్యప్ప, రెబ్బవరపు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల పరిశీలన



యంత్రాలను పరిశీలిస్తున్న నిర్మలాకుమారి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట, మంగమూరు, బొడ్డువారిపాలెం, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో మంగళవారం సింగరాయకొండ సబ్‌డివిజన్ వ్యవసాయసంచాలకులు ఇ.నిర్మలాకుమారి కస్టమర్ హైరింగ్ సెంటర్‌లోని యంత్రపరికరాలను తనిఖీ చేశారు.

- బొడ్డువారిపాలెం, పి.తక్కెళపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏవో పావని శనగపంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. రైతులు ఏపీఎఫ్ఆర్ యాప్‌లో నమోదైతే గుర్తింపు నెంబర్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటర్ వితరణ



ప్రింటర్‌ను అందిస్తున్న శకుంతల

మద్దిపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తెల్లబాడు జిల్లా పరిషత్ పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్‌ను మంగళవారం స్థానిక పాఠశాలలో గణిత అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కోమటినేని శకుంతల తన తండ్రి సుబ్బారావు జ్ఞాపకార్థం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సక్రమంగా జరగాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకం లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలపరిషత్ కార్యా లయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బి.విజయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున పని చేయని తాగునీటి బోర్లను బాగు చేయించాలన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం ఇచ్చిన సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డి.రమణమ్మ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నగరంలో కోచ్ రెస్టారెంట్ !

● 24 గంటలూ ఆహార పదార్థాలు అందుబాటులో..





ఆకర్షణీయంగా ఉన్న రెస్టారెంట్, కోచ్‌లో ఏర్పాటు చేసిన సీట్లు

ఒంగోలు నగరం అభివృద్ధిలో మరో అడుగు ముందుకేసింది. పెద్దపెద్ద సిటీ తరహాలో ఇక్కడ కూడా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కోచ్ రెస్టారెంట్ మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణంలో స్టేషన్ మేనేజరు దొండపాటి ఏసుదానం ప్రారంభించారు. రైలు బోగీని రెస్టారెంట్‌గా ఏర్పాటు చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులతోపాటు, ఇటు నగర ప్రజల కోసం ఆహార పదార్థాలు నిత్యం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఒంగోలులోని డీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో ఎక్కువభాగం విద్యార్థులను భాగస్వామ్యం చేయడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంట్లో తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యతపై విద్యార్థులపై ఉందన్నారు. రక్తదానం చేసిన వారిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేసారు. రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ శిబిరంలో 61 మంది రక్తదానం చేశారని చెప్పారు. రహదారి భద్రత మాసోత్సవాలు ఈనెల 15 వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, డాక్టర్ రాఘవ, రెడ్‌క్రాస్ ఏవో సుధాకర్, ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, ఎల్.సురేంద్రప్రసాద్, ఏఎంవీఐలు కె. జయప్రకాష్, ధర్మేంద్ర, భానుప్రకాష్, ఏవోలు డి.సుధాకర్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్ నివాసంలో మంగళవారం గుమ్మళంపాడుకు చెందిన బొడ్డపాటి శేషమ్మకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.1,05343, ఎైనంపాడుకు చెందిన వలేటి రామాంజనేయులకు రూ.35,276 చెక్కులను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

టంగుటూరు రోడ్డులో జంగిల్ క్లియరెన్స్

కొండపి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు రోడ్డులో పొగాకు బోర్డు దాటిన తర్వాత ఇటీవల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సీఐ జి.సోమశేఖర్ రోడ్డుకు ఇరువైలా మంగళవారం జంగిల్ క్లియరెన్స్, మార్జిన్‌లను చదును చేయించారు. ఈసందర్భంగా వాహదారులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రేమ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

11న చలో ఢిల్లీ

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్‌ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని నెల్లూరు డివిజన్ ఎల్ఐసీ ఏజెంట్‌ల యూనియన్ ప్రధానకార్యదర్శి కె.నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎల్ఐసీ ఏజెంట్‌ల మహాసభ జరిగింది. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బెజవాడ శివయ్య, నాయకులు బి.వెంకట్రావు, కె.బాలచందర్, నల్లూరి వెంకట్రావు, ఆర్.రామకోటి, యు.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ.సుబ్బారెడ్డి, ఎస్‌డీ.రహిమాన్, వై.ప్రసాదు, రాంబాబు, కేశవరావు పాల్గొన్నారు.

పృథులగిరి ఆలయ నిధులకు రెక్కలు

పాలకవర్గంలేకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యం

అసంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు



పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

మర్రిపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు ఆలయ అభివృద్ధికి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కృషి చేస్తుండగా.. అధికారులు భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇప్పటికే ఇద్దరు కార్యనిర్వహణాధికారులు బదిలీ అయ్యారు. మూడో ఈవో శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఒక కార్యనిర్వహణాధికారి దేవాలయం సుందరీకరణ పేరుతో అవసరం లేనప్పటికీ రూ.4.09 లక్షలు వెచ్చించి రంగులు వేయించారు. భక్తులు స్వామివారికి నైవేద్యం పెట్టేందుకు చెట్లకింద పొయ్యిలు ఏర్పాటు చేసుకొని పొంగళ్ల పెట్టుకుంటున్నారు. పొంగళ్ల షెడ్డు ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ పట్టించుకోని అధికారులు దేవాలయ సుందరీకరణ పేరుతో అవసరం లేని పనులకు నిధులు ఎలా ఖర్చు పెడతారని నిలదీస్తున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్‌ను తాళ్లూరు మండలంలోని గుంటిగంగ దేవాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో గిద్దలూరు ఎండోమెంట్ పరిధిలో పనిచేస్తున్న రికార్డ్ అసిస్టెంట్‌ను ఇక్కడ నియమించారు. ఆయన గిద్దలూరులో పని చేస్తున్న కాలంలో పలు ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ ఎత్తివేసిన అనంతరం ఆ ఉద్యోగికి రావలసిన జీతభత్యాల బకాయిలను పొదిలి గ్రూప్ ఎండోమెంట్ నుంచి చెల్లించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. గిద్దలూరులో పనిచేసిన వ్యక్తికి అక్కడ కాకుండా ఇక్కడ రెండు లక్షలకుపైగా బకాయిలు చెల్లించాలని ఆదేశాలు ఇవ్వడం ఏమిటని భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. పాలవర్గం లేకపోవడంతోనే అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. వచ్చేనెల 8వతేదీ నుంచి పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో లక్ష్మీనరసింహనికి చెందిన కోట్లాది రూపాయల ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. ఈనేపథ్యంలో నూతన పాలకవర్గం ఏర్పాటుపై మంత్రి స్వామి దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా శ్రీప్రతిభ విద్యాసంస్థల వార్షికోత్సవం

హాజరైన మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్



వేడుకల సభలో ప్రసంగిస్తున్న మంత్రి స్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు విద్య/సంతనూతలపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీ ప్రతిభ, గురుదత్తా విద్యాసంస్థల వార్షికోత్సవం మంగళవారం స్థానిక కళాశాల ప్రాంగణంలో అన్‌స్టాపబుల్ పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ 43 సంవత్సరాల శ్రీప్రతిభ విద్యాసంస్థల ప్రస్థానాన్ని అభినందించారు. పేద పిల్లల పట్ల చైర్మన్ నల్లూరి వెంకటేశర్లు చూపే ఉదారతను కొనియాడారు. ఫీజు రాయితీలు ఇస్తూ వారి ఉన్నతికి కృషి చేస్తున్న వెంకటేశ్వర్లును మంత్రి అభినందించారు. తాను సిఫార్సు చేసిన పేద విద్యార్థులకు ఫీజు రాయితీలు కల్పించి వారి ఉన్నత చదువులకు ఎంతో దోహదపడ్డారని చెప్పారు. శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్ మాట్లాడుతూ శ్రీప్రతిభ విద్యాసంస్థలు అంటే విద్యతో పాటు క్రమశిక్షణకు మారుపేరు అని పేర్కొన్నారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకొని ఈ విద్యాసంస్థను ప్రారంభించి ఉత్తమ ఫలితాలను సాధించామన్నారు. నూతన టెక్నాలజీకి అనుగుణంగా అత్యుత్తమ బోధన అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. తమను ఆదరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ, పి.నాగరాజు, గోపీనాథ్, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఐ.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 2023-24 విద్యాసంవత్సరంలో ఎంసెట్, జేఈఈ మెయిన్స్, ఇంటర్‌లో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ జమున



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు



శింగరాయకొండలో వైద్య సిబ్బంది ర్యాలీ

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున కోరారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జీజీహెచ్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీని సూపరింటెండెంట్ జమున, రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన జీవవన విధానంతో క్యాన్సర్‌ను జయించవచ్చని తెలిపారు. నిరంతర వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం, అలవాట్ల మార్పుతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. జీజీహెచ్ ఏవో అద్దయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్‌కుమార్, తిరుమలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పొంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ఆనంద్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మద్దిపాడు పీహెచ్‌సీలో ఆయన ప్రసంగించారు. 15 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ నిర్వహించాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రజితకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు చైతన్యకృష్ణ మాట్లాడుతూ మంచి ఆహార అలవాట్లు పాటించడంతోపాటు ధూమపానం, మద్యపానం సేవించకుండా ఉండటం వలన క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు ధీరేంద్ర, ఆరోగ్యపర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ, విజయమ్మ, రాజమ్మ, సంపూర్ణ, సీహెచ్‌వోలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



పొగాకు నాణ్యత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

కొండపి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని బోర్డు ఆక్షన్ మేనేజర్ దివి వేణుగోపాల్ రైతులకు సూచించారు. కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని చోడవరం, ముప్పవరం, పైడిపాడు గ్రామాల్లో క్యూరింగ్, రేఖల్లో ఉన్న పొగాకును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడారు. పొగాకు మండెల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, వేలం కేంద్రం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు నంబరు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు నంబరును అందజేయనున్నట్లు ఏవో పి.వెంకట్రావు సూచించారు. మంగళవారం మండలంలోని మాచవరం, రాపర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసే ప్రత్యేక గుర్తింపు నంబరు ద్వారా వ్యవసాయ శాఖ సేవలు సులువుగా పొందవచ్చని చెప్పారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు.

ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి

టంగుటూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా ఈ-పంటలో వివరాలు నమోదు చేయించుకోవాలని ఏవో పి.స్వర్ణలత సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా ఆమె మంగళవారం తూర్పునాయుడుపాలెం, జయవరం గ్రామాల్లో పర్యటించారు. పంటలను పరిశీలించడంతోపాటు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఐ.ప్రావీణ్యం, ఎల్.ప్రైసీరిమాల్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సూర్యనమస్కారాలు చేయిస్తున్న యోగాగురువు శ్రీరామమూర్తి తదితరులు

సూర్య నమస్కారాలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా స్థానిక మామిడిపాలెం చెరువు వద్ద ఉన్న పోలేరమ్మ గుడి వద్ద మంగళవారం యోగా మిత్రబృందం ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు, అసనాలు అనంతరం అమృతాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రతిరోజు యోగాతో పాటు సూర్య నమస్కారాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. దైనందిత జీవితంలో కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొండయ్య, వెంకారెడ్డి, సాంబశివరావు, సీతారాం, జిలానీ, రాజు, జగన్ రత్నం, కృష్ణవేణి, భార్గవి, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

- కేసుల వివరాలు, రికార్డుల పరిశీలన
- సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఆదేశం



పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు స్టేషన్‌లో మొక్కనాటుతున్న ఎస్పీ

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశంలోని పలు పోలీసు స్టేషన్లను ఎస్పీ ఏఆర్ దామోదర్ తనిఖీ చేశారు. ఆయా పోలీసు స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. సాధారణ తనిఖీలలో భాగంగా ఎర్రగొండపాలెం సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళ వారం ఎస్పీ తనిఖీ చేశారు. సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు, ఎస్సై పి.చౌడయ్యలను అడిగి కేసుల స్థితిగతులను తెలుసుకున్నారు. నేర నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలన్నారు. అన్ని రకాల వ్యాపారులు వీధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలో ఉన్న సిబ్బందితో విడిగా మాట్లాడారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలునాటి స్టేషన్ చుట్టూ పచ్చదనాన్ని, మొక్కలను చూసి సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట మార్కాపురం డిఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పుల్లలచెరువు ఎస్సై సంపత్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే చంద్రశేఖర్

సాధారణ తనిఖీలలో భాగంగా ఎర్రగొండపాలెం వచ్చిన జిల్లా ఎస్పీ ఏఆర్ దమోదర్‌ను ఎర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నాయకులతో కలసి మార్యదపూర్వకంగా కలిశారు.

న్యాయం చేయాలని వినతి

ఎర్రగొండపాలెం నడిబొడ్డున సర్వే నెంబరు 58-1లో నకిలీ పత్రాలు సృష్టించి కొందరు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని బాధితులు తిరుమల రావు కుమార్తె ఎస్పీని కలసి వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. రికార్డులు పరిశీలించి రెవెన్యూ శాఖ ద్వారా న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

పుల్లలచెరువు మండలంలోని మానేపల్లిలో ఇటీవల ఎస్సీ యువకుడిపై జరిగిన దాడికి నిరసిస్తూ ఎర్రగొండపాలెం వచ్చిన ఎస్పీ దమోదర్‌ను ఎంఆర్‌పీఎస్ నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. దాడిచేసిన వారిని శిక్షంచాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు.

తర్లుపాడు : తర్లుపాడు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ అకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణను పరిశీలించారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ తర్లుపాడు వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త, నేరెళ్ల విజయ్‌భాస్కర్ పలువురు నాయకులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసారించండి

పెద్దదోర్నాల : అసాంఘిక కార్యక్రమాల కట్టడికి నివారణ చర్యలు పటిష్టం చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. సాధారణ తనీఖీల్లో భాగంగా దోర్నాల పోలీసుస్టేషన్ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పరిసరాలు, గదులు, రికార్డులు, పట్టుబడిన వాహనాలు, పాత క్వార్టర్లు తదితరాలు నిశితంగా పరిశీలించారు. అనంతరం స్టేషనులో పెండింగు కేసులపై ఆరా తీశారు. ప్రధానంగా కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచి ఎస్సై రాఘవేంద్ర, ఎర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ రావు, ఎస్సై మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు : ప్రజలకు భద్రత కల్పించే విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, గదులు, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రికార్డులు, సీడీ ఫైల్స్ జనరల్ డైరీలను సునిశితంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ మహిళలు చిన్నపిల్ల భద్రత విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ నాగరాజు, ఎస్‌బీ సీఐ కె.వి.రాఘవేంద్ర, ఎస్సై అనిల్ కుమార్ తదితరులున్నారు.

కంభం : ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేసేవిధంగా చేపడుతున్న మార్పులు, సంస్కరణలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్‌ఐఒ ఎ.సైమన్‌విక్టర్ తెలిపారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల 55వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యామిత్ర కిట్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సంకల్ప్ 2025 ద్వారా ప్రత్యేక తర్ఫీదు, మనబడి మన భవిష్యత్తు ద్వారా మౌళిక వసతుల కల్పన పలు సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు జరుపుతున్నట్లు తెలిపారు. 2025-26 ఏప్రిల్ 1వ తేది నుంచే ప్రారంభమవుతుందన్నారు. కంభం ఎంపిడిఒ వీరభద్రాచారి మాట్లాడుతూ మార్కులు తక్కువ వచ్చాయని, ఫెయిల్ అయ్యామని ఆందోళన చెందక భవిష్యత్తు కార్యాచరణ చేపట్టాలరు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, విశ్రాంత డిప్యూటి డిఇఒ కె.వెంకటరావు, ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటనారాయణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళిక్రిష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు : ప్రస్తుతం అందబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంచుకోని పోలీసులు నేరనియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. మంగళవారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌ను తనీఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర పరిశోధనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోని కేసులను త్వరగా పరిష్కారించాలన్నారు. మండలంలో 45 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై ఎస్.సంపత్ కుమార్‌ను అభినందించారు.

దోర్నాలలో చోరీ

- 10వేలు నగదు, బ్రాస్‌లెట్, ఉంగరాలు అపహరణ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి నగలు, నగదు చోరీ చేసిన ఘటన మండలకేంద్రం పెద్దదోర్నాలలోని ఇందిరానగర్‌లో మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం, ఇందిరానగర్‌లో నివాసముంటున్న పాల్తి రాజేష్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి విధులకు హాజరయ్యారు. అయితే అదేరోజు ఉదయమే కుమారుడికి వైద్యం కోసం భార్య గుంటూరు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు అర్ధరాత్రి గేటు, బీరువా తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కాగా విధులు పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చిన రాజేష్ తాళం పగుల గొట్టి ఉండడం చూసి ఇంటినంతా పరిశీలించాడు. బీరువా తాళం పగులగొట్టి ఉండడంతో అందులో చూడగా నగదు రూ.10,000లు, రెండు బ్రాస్‌లెట్‌లు, 1 ఉంగరం, చిన్నపిల్లాడికి చెందిన 4ఉంగరాలు, చైన్ అపహరించుకు పోయినట్లు బాధితుడు గుర్తించి పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఎస్సై మహేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కన్నులపండువగా రథోత్సవం

- మార్కాపురంలో ఆకట్టుకున్న చెన్నకేశస్వామి సప్తవాహన సేవ
- పలు ఆలయాల్లో రథసప్తమి వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలో చెన్నకేశవ స్వామికి ఉదయం సప్తవాహన సేవ నిర్వహించగా, సాయంత్రం వెండిరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ తదితరులు రథంలాగి భక్తులను ఉత్సాహ పరిచారు. నాలుగు మాడవీధుల్లో స్వామివారి రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వామివారి సప్తవాహనసేవ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సన్నాయిమేళం, కేరళ వాయిద్యం, పాలకొల్లు బ్యాండ్, నందికొట్కూర్ తీన్మార్, ప్రతిమ సునీల్ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శనలు, శ్రీకృష్ణ గోపికలు, నరసింహ అవతారం, వివిధ భక్తబృందాల కోలాటాలు, నరసరావుపేట కనకతప్పెట్లు, వివిధ భక్తజన కోలాటాలు ఆకట్టుకున్నాయి. పట్టణంలో ధాతృత్వం వెల్లివిరిసింది. పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెయిన్ బజార్, నెహ్రూ బజార్, రాఘవేంద్ర స్వామి గుడివీధి, నాయుడు వీధి, శివాలయం, అయ్యప్ప ఆలయం, ప్రసన్న, పట్టాభి, రామాలయాలు, వాసవీక్లబ్, ఎరువుల దుకాణాల అసోసియేషన్, బృందావన క్షేత్రం తదితర ప్రాంతాలలో అన్నప్రసాదం, అల్పాహారం ఏర్పాటు చేశారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం

స్వామివారికి మంగళవారం మధ్యాహ్నం వేడుకగా శ్రీకచక్ర స్నానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమహావిష్ణువు ప్రధాన ఆయుధమైన శ్రీచక్రానికి అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలు దర్శించుకున్నారు.

సూర్యనారాయణునికి ప్రత్యేక పూజలు

పెద్దారవీడు : రథసప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం సూర్యనారాయణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని దేవరాజుగట్టులో కొండపై వెలసిన సూర్యనారాయణనుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, ఆయన సతీమణి సర్పంచ్ లక్ష్మీదేవి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ యువ నాయకులు ఆనెకాళ్ల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ మండల కమిటీ మాజీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, బీసీ సెల్ జిల్లా నాయకులు గుమ్మా గంగరాజు, మాజీ జడ్పీటీసీ జద్దార రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొదిలి : శ్రీలక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో రథసప్తమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వెంకటేశ్వరస్వామికి సూర్య ప్రభ వాహనసేవ చేశారు. సూర్యప్రభ వాహనంపై పట్టణ పురవీదుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించు కొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

ఎర్రగొండపాలెం రూరల్ : రథసప్తమి సందర్భంగా ఎర్రగొండపాలెంలోని కొప్పుకొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు అఖిల విశ్వగాయత్రి పరివార్ శాంతికుంజ్ హరిద్వార్ పండితులతో చిన్నారులకు విద్యారంభ(అక్షరాభ్యాస), గాయత్రి హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో గణపతిపూజ, పుణ్యాహవచనము, నవగ్రహ మండపారాధన, గోమాత పూజ తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు సేవా సంఘం కమిటి సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

గిద్దలూరు : మండలంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రజలు మంగళవారం తమ ఇళ్ల ముందు రథం ముగ్గు వేసి సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేధ్యం సమర్పించారు. స్థానిక శ్రీకుసుమ హరనాథ మందిరం ఆవరణలో వైభవంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీకుసుమ హరనాథుల లీలాకళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మందిరం అధ్యక్షులు నటుకుల శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి సూర్యప్రభ వాహనసేవ

కంభం : రథసప్తమి సందర్భంగా కంభం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి జరిగిన గుడి ఉత్సవంలో భక్తులు స్వామి, అమ్మవార్లకు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఏవీకే నరసింహాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేనపూజ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మాలకొండ నరసింహరావు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణారావు, కోశాధికారి పి.శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.







పెద్దారవీడులో సూర్యనారాయణుడు, పొదిలిలో వేంకటేశ్వరుని గ్రామోత్సవం, కంభంలో సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వరుడు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వేడుకల్లో కళాకారుల కళారూపం



కేరళకు చెందిన కళాకారుల వాయిద్యప్రదర్శన



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



గిద్దలూరులో కుసుమ హరినాథుల కల్యాణం

మాదిగల హక్కుల కోసం పోరాడిన మంద కృష్ణ

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాదిగల హక్కులకోసం పోరాడిన నేత మంద కృష్ణ అని మేదే అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అన్నారు. మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో మాదిగ మేధావుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగల హక్కుల కోసం రాజకీయాలకు, వర్గాలకు, ప్రాంతాలకు అతీతంగా పోరాడి హక్కులు సాధించాడని కొనియాడారు. మాదిగలను చిన్న చూపు చూస్తున్న వారికి చదువే సమాదానం అని అన్నారు. ప్రతి ఒక్క రు విద్యలో రాణించి అన్ని రంగాల్లో స్థిర పడాలన్నారు. అలా రాణించినప్పుడే మాదిగ లకు గుర్తింపు ఉంటుందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన రిజర్వేషన్ తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏబీసీడీ వర్గీకరణ అంటే ఏమిటి, హక్కులు తదితర వాటిపై మాదిగలకు అవగాహన కల్పించారు. ప్రముఖ న్యాయవాది కత్తి చల మరాజులు మాదిగలు 50 సంవత్సర కాలంలో 23 వేల ఉద్యోగాలు పొందితే 2000 సంవ త్సరం నుండి 2004 సంవత్సరంలోనే 23 వేల పోస్టులు మాదిగలకు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకై హైదరబాద్ లో జరిగే లక్షల డప్పులు వేలగొంతులు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలిపునిచ్చారు. సింగ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం లో చేదూరి లక్ష్మయ్య, గంగయ్య, సుబ్బయ్య, తిరుమలయ్య, రాములు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవపాల్

ఎంఆర్‌పీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ఎర్రగొండపాలెం రూరల్ : ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో చేపట్టనున్న లక్ష డప్పులు వేల గొంతులు మహాప్రదర్శన పోస్టర్‌ను టీడీపీ వై.పాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆవిష్కరించారు. మంగళవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆయన్ను మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహా ప్రదర్శన గూరించి వారితో ఆయన చర్చించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ సీనియర్ నాయకులు మంద భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వినయ్, మండల అధ్యక్షుడు దాసు, చేదూరి వెంకటేస్, చేదూరి రవి,ముండ్ల సురేష్, చేదూరి కిషోర్, విలియం కేరి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఫసల్ బీమాను వర్తింపజేసి ఆదుకోండి

డీఏవో శ్రీనివాసులును కోరిన రైతులు

పొదిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పంటలబీమా పథకం వర్తింపజేసి తమను ఆదుకోవాలని రైతులు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) ఎస్‌శ్రీనివాసులును కోరారు. మంగళవారం మండలంలోని మాదాలవారి పాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. కందిపంట పరిస్థితి ఏమిటని దిగుబడి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. డిసెంబరు నెలలో కురిసిన వర్షాలకు పూత, పిందే రాలిపోయి ఎకరాకు 10 కిలోలు దిగుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కావున రైతులకు బీమా వర్తింపజేయాలని కోరారు. పంట దిగుబడిని అంచవేసి రైతుల నష్టపోయిన మేర కు పంటల బీమాద్వారా నష్టపరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తానని జిల్లా వ్యవసాయా ధికారి శ్రీనివాసులు తెలిపారు. రైతుల సీఎం యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకు పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో షేక్ జైన్‌లాబ్దీన్, ఉద్యాన విస్తరణాధికారి ధనలక్ష్మీ, గ్రామ వ్యవసాయ సహాయకులు సుమన్, గురుబ్రహ్మం రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : మండలంలోని జయరాంపురం గ్రామపరిధిలో సాగైన మిరప పైరును ఉద్యాన వన శాఖాధికారి విష్ణుప్రియ పరిశీలించారు. మిరపలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగులు, తెగుళ్ల నివారణోపాయాలు సూచించారు. ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువులు వేసుకుని భూమి సాంద్రతను పెంచుకోవచ్చన్నారు. వైరస్ నివారణకు వేపనూనె, వేపచెక్క విని యోగించాలన్నారు. కోత సమయంలో, కోత కోసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రాజెక్టు ఆఫీసర్ సిద్దేశ్వర్‌రెడ్డి, రైతుసేవా సిబ్బం ది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్ : మిరపపైరు కోత సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసు కుంటే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఏవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని మాల్యవంతునిపాడు, బొందలపాడు గ్రామాలలో రైతులతో కలిసి మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మిరప కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది నాగవేణి, రమణి, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల :మండలంలోని యడవల్లి, గంటవానిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ గ్రామాల్లో సాగు చేసిన పంటలను ఏవో జవహర్‌లాల్‌నాయక్ పరిశీలించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంభం : కంభం మండలంలోని పలు గ్రామాల రైతులకు ఏవో స్వరూప ఆహారం, పోషకాహార భద్రతపై అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని ఎల్.కోట, రావిపాడు, తురిమెళ్ల గ్రామాలలో శనగ పంటను ఆమె పరిశీలించారు. సాగులో మెళకువలపై అవగాహన కల్పించారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని బోయలపల్లి, వీరభద్రాపురం గ్రామాలలో రైతుల పంటపొలాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కంది, మిరప తదితర పంటలను ఏవో కేవీ. శేషారెడ్డి, హెచ్‌వో పి. ఆదిరెడ్డిలు పరిశీలించారు. రైతులకు పంట సాగులో అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ముందుగా ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో ధనేశ్వర్‌నాయక్, రమేష్, అంజి నాయక్ ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని గొల్లపల్లి, దూపాడు గ్రామాల్లో ఏవో ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన మిరప, వరి పంటలను వ్యవసాయశాఖ ఏవో, సిబ్బంది రైతులతో కలిసి పరిశీలించారు. మిరపలో తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు.

రథసప్తమిని విజయవంతం చేయడంపై హర్షం

మార్కాపురం, ఫిబ్ర వరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్క రించుకుని మంగళవారం పట్టణంలో నిర్వహించిన సప్తవాహన సేవను అధికార యంత్రాంగం సమిష్టిగా పనిచేసి విజయవంతం చేసింది. ముఖ్యంగా మున్సిపల్, పోలీసు యంత్రాంగాలు నిరంతర పర్యవేక్షణను కొనసాగిస్తూ భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేకువజామున 4.00 గంటల నుంచి రాత్రి 11.00 గంటల వరకు నిర్విరామంగా శ్రమించారు. మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు పరిశీలించారు.

పోలీసుల సేవలు బేష్

మున్సిపాలిటీ తర్వాత పోలీసుశాఖ పనితీరు పట్ల ప్రతి ఒక్కరూ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో నాలుగు మాడవీధులను తమ ఆధీనంలోకి తీసుకొని వాహనసేవకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. రాత్రి 6.30 నుంచి 9.00 గంటల వరకు జరిగిన వెండి రథోత్సవం సమయంలో వేలాది మంది భక్తులు మాడవీధుల్లో చేరినా ఎక్కడా చిన్నపాటి ఇబ్బంది తలెత్తకుండా పోలీసులు పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్, భక్తుల అలజడులను గమనిస్తూ అందుకనుగుణంగా క్రమబద్ధీకరించారు. డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, సీఐ పి.సుబ్బారావులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు పర్యవేక్షణ చేపట్టారు.

చిత్తడి నేలల సంరక్షణ ఎంతో అవసరం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంభం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జంగంగుంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చిత్తడి నేలల దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను, వృత్తలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేయడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో క్లస్టర్ కోఆర్డినేటర్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ చిత్తడి నేలలు జీవవైవిధ్యాన్ని కాపాడడానికి తోడ్పడుతుందని, అలాంటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

గర్భిణీకి రక్తదానం

గిద్దలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణి అత్యవసర పరిస్థితిలో ఉండగా చంద్రశేఖర్ అనే దాత ద్వారా రక్తదానం చేయించి ఆదుకున్నట్లు మేమున్నాము సేవా సమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి తెలిపారు.

వివరాలు తెలుసుకొని సమస్యను పరిష్కరించండి



మాట్లాడుతున్న అన్నా రాంబాబు

పొదిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో సల్లూరు గ్రామంలో మృతుని దహన సంస్కారాల విషయంలో తలెత్తిన సమస్య పూర్తి వివరాలు తెలుసుకొని మాట్లాడి ఉంటే బాగుండేదని మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సమస్య పూర్తి విషయం తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదన్నారు. పరిష్కారం కోసం అధికారులను పంపామని చెబుతున్నారని వారందరు ఒకవైపు కొమ్ముకాశా రన్నారు. పగలంతా సమస్య పరిష్కరించకుండా రాత్రి 9గంటలకు అనాధశవంలా తీసుకెళ్ళడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపి నాయకులపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. దురుసుగా మాట్లాడితే చరిత్రహీనులుగా మిగిలిపోతున్నారు. సల్లూరు గ్రామ సమస్యను పరిష్కరించేందకు ఎమ్మెల్యే ముందుకు వస్తే తాము సహకరిం చేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. ఈసమావేశంలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, జి శ్రీను, చెన్నారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

నేడు పీసీపల్లికి కలెక్టర్, ఎమ్మెల్యే రాక

పీసీపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిలు బుధవారం పీసీపల్లిలో పర్యటిస్తున్నట్టు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. మండలంలోని నేరేడుపల్లి, జంగాలపల్లి గ్రామాల్లో నిర్మించిన తారురోడ్డు, సిమెంట్‌రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జంగాలపల్లిలో జరిగే వాటర్‌షెడ్ యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

దొనకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నేత చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం దొనకొండలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలుపర్చాలన్నారు. సుప్రీకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పగిడిపోగు షాలేంకుమారి, కార్యదర్శిగా ఎండ్లూరి నాగేంద్రమ్మ, ఉపాధ్యక్షురాలిగా వడ్లమూడి రాజేశ్వరి, కోశాధికారిగా నూనె దీన, సభ్యులుగా పారి బంగారమ్మ, కర్నాటి రమణ, దూపాటి రమణ, మల్లెల రమాదేవి, ఎం.అంజలీదేవి, పి .సునీత, సందు గోవిందమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రైతు సమాచార కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం తురకపాలెం, దారంవారి పాలెం, మన్నేపల్లిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రబీలో సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తద్వారా 14 అంకెల యూనిక్ నంబర్ వస్తుందని చెప్పారు. ఈ యూనిక్ నంబర్ ద్వారా వ్యవసాయ అనుబంధశాఖల పథకాల అమలుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ నాగమల్లేశ్వరి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ముండ్లమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురంలో మంగళవారం బెల్టుషాపుపై పోలీసులు దాడిచేశారు. దర్శి ఎక్సైజ్ పోలీసులకు అందిన సమాచారంతో దాడిచేసి పది మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఆయన హెచ్చరించారు.

ప్రైవేటు టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి లోకేష్‌ను సోమవారం అమరావతిలో కోరినట్లు యూనియన్ నాయకుడు రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు చట్ట ప్రకారం సిబ్బందికి కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు కూడా కల్పించటం లేదని మంత్రికి వివరించామన్నారు. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ సమయంలో యాజమాన్యం నుంచి గాని, ప్రభుత్వం నుంచి గాని ఎలాంటి సహాయం లభించటం లేదని పేర్కొన్నట్టు చెప్పారు. వీరికి న్యాయం చేయాలని మంత్రి లోకేష్‌ను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తమతోపాటు రాష్ట్ర నాయకులు అంగేవర్కర్, బట్టు శ్యాంప్రసాద్‌తో, వివిధ జిల్లాల నాయులు పాల్గొన్నట్లు రషీద్ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

దర్శి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం దర్శి కొండను తవ్వుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకుసంబంధించి దర్శి సీఐ వై.రామరావు మంగళవారం వివరాలు వెల్లడించారు. దర్శి పట్టణానికి చెందిన వెంకటప్రసాద్, పసుపులేటి వెంకటేశ్వర్లు, వై.నారాయణరెడ్డి, సయ్యద్ చినకాశీం, షేక్ నూర్‌బాషాలు శివరాజ్‌నగర్ సమీపంలో సాయిబాబా ఆశ్రమం పక్కన కొండను తవ్వారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన దర్శి ఎస్ఐ ఎం.మురళి ఆధ్వర్యంలో ఘటనాస్థలానికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఒత్తిడి దూరం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ప్రముఖ వాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి అగస్త్యరాజు శివసుబ్రహ్మణ్య శర్మ పేర్కొన్నారు. స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీలలితా జ్ఞానపీఠంలో వర్తమాన సమాజంలో భక్తి, ఆధ్యాత్మిక పెంపుదల ఆవశ్యకతను గురించి ప్రవచనం చేశారు.

వసతి గృహాలకు మహర్దశ

- సంక్షేమాన్ని గాలికొదిలేసిన గత వైసీపీ పాలకులు
- ప్రత్యేక దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం
- రూ.19 లక్షలతో ఎస్సీ బాలుర హాస్టల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం
- విద్యార్థులకు తీరనున్న ఇబ్బందులు


దొనకొండ ఎస్సీ బాలుర-1 వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులు

దొనకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల అభివృద్ధిపై టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులోభాగంగా ఇక్కడ చదువుకునే విద్యార్థులకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సంకల్పించారు. ఈక్రమంలో అధునాతన సౌకర్యాల రూపకల్పనకు శ్రీకారం చుట్టారు.


దొనకొండ ఎస్సీ బాలుర-1 వసతి గృహంలో జరుగుతున్న టాయిలెట్స్ మరమ్మతులు

గత వైసీపీ ప్రభుత్వం వసతి గృహాల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో అందులో చదువుకునే విద్యార్థులు పూర్తి అసౌకర్యాల మధ్య ఇబ్బందులు పడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరునెలల కాలంలోనే వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల ఇబ్బందులను గుర్తించింది. వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయటంతో పనులు ప్రారంభించారు. అందులోభాగంగానే దొనకొండలోని ఎస్సీ బాలుర-1 వసతి గృహం అభివృద్ధికి మహర్దశ కల్గింది. ఎస్సీ బాలుర-1 వసతిగృహంలో రూ.19 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. అధునాతన టాయిలెట్స్, బాత్‌రూమ్స్, విద్యుదీకరణ, స్టడీ ప్లాట్‌ఫారమ్, వాషింగ్ ప్లాట్‌ఫారమ్, పూర్తి పెయింటింగ్, ఆర్వో ప్లాంట్, కిటికీలు, తలుపులు, దోమలు రాకుండా మెష్‌లు, ప్రధాన గేట్ నుంచి లోపలివరకు టైల్స్‌తో దారి ఏర్పాటు, తదితర పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూసిన తల్లిదండ్రులు టీడీపీ కూటమి ప్రభుత్వం పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. తద్వార వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

విద్యార్థులకు చక్కటి వాతావరణం

మంత్రూనాయక్, సంక్షేమాధికారి, ఎస్సీ బాలుర-1 వసతి గృహం

గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థుల విద్యాభివృద్ధి చక్కగా కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహంలో మంచి వాతావరణం కల్పిస్తున్నది. ఇప్పటివరకు అసౌకర్యాలతో కొంతమేర విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఇకపై పూర్తి సౌకర్యాలతో చక్కగా చదువుకునే అవకాశం కలిగింది. వసతి గృహంలో పూర్తి సౌకర్యాలకు ప్రభుత్వం తీసుకున్న చొరవ పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరి అభివృద్ధికి సహకరించాలి

- నిధులు మంజూరుచేసి చేయూతనివ్వాలి
- మంత్రి లోకేష్, ఆర్టీసీ ఎండీ, సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కనిగిరి అభివృద్ధికి నిధులు మంజూరుచేసి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. మంగళవారం అమరావతిలో పలువురిని కలిసి ఈమేరకు విన్నవించారు. మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కనిగిరిలో ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుతో పాటు పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాలని కోరారు. కనిగిరిలో రిలయన్స్ బయోగ్యాస్ ఏర్పాటు ప్రారంభానికి ఎమ్మెల్యే ఆహ్వానించారు. లోకేష్ సానుకూలంగా స్పందించి కార్యక్రమానికి వస్తానని హామీ ఇచ్చినట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు.


రిలయన్స్ బయోగ్యాస్ ప్రారంభానికి మంత్రి లోకేష్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కూడా కలిసి కనిగిరిలో విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా బస్సులను నడపాలని కోరారు. ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇళ్లకు చేరేందుకు, డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే, ఇతర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రత్యేకంగా వారి సమయాల్లో ప్రత్యేక బస్సులను నడిపేందుకు బస్సులను కేటాయించాలని కోరారు.

సీఎస్ విజయానందన్‌ను కూడా కలిసి నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ ఏర్పాటులో భూమిని కోల్పోయిన రైతులకు నష్టపరిహారం కింద రావాల్సిన రూ.12కోట్లు నిధులను విడుదలచేసి ఆదుకోవాలని డాక్టర్ ఉగ్ర కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రులతో పాటు ఇతర ప్రముఖులను కలిసి విన్నవించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- కోలాహలంగా సప్తవాహనాల నగర ఊరేగింపు

కనిగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలు మంగళవారం కనిగిరిలో వైభవంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సప్తరథాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. సూర్యప్రభ, చినశేష, పెద్దశేష, గరుడ, హనుమంత, సర్వభూపాల, చంద్ర వాహన రథాలపై సూర్యభగవానుడు పురప్రజలకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామి వార్లకు పారువేట పోసి దూప, దీప నైవేద్యాలు సమర్పించి మంగళహారతులిచ్చారు. స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ మహిళా భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారస్తులు కొలిపర్తి మారుతి, పెసల సత్యనారాయణ, సొల్లేటి నారాయణ, గర్రె సత్యప్రసాద్ మిత్రబృందం, నల్లపాటి కేశవులు, తదితరులు ఊరేగింపు కార్యక్రమంలో అవసరమైన సామగ్రిని అందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ నాయకులు గోనుగుంట పవన్‌కుమార్, కమిటీ సభ్యులు విశేష సేవలందించారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.


సప్తరథాలతో కనిగిరిలో నిర్వహిస్తున్న ఊరేగింపు

పామూరులో..

పామూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన వేణుగోపాలస్వామికి పల్లకి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం సత్యబాబు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీచేశారు. కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కేవీ రమణయ్య, మెంటా నరసింహారావు, పిడుగు శ్రీనివాసులు, వరికూటి హనుమంతరావు, వాయినేని రాఘవ, జమకాల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సింగిల్‌విండో మాజీ చైర్మన్ బొయిళ్ల నారాయణరెడ్డి, వరికూటి చిరంజీవిలు మంగళవారం దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.


ఊరేగిపుంలో పాల్గొన్న మహిళలు

మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్‌కు నోచుకోని దర్శి

- మంత్రి దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- సానుకూలంగా స్పందించిన అధికారులు
- త్వరలో ఏర్పాటయ్యే అవకాశాలు?

దర్శి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆవిషయాన్ని పక్కనపెట్టింది. అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు, రాష్ట్ర అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. వారుకూడా సానుకూలంగా స్పందించి అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, తొలి విడతలో రాష్ట్రం మొత్తం మీద కుప్పం, కొండపల్లి నగర పంచాయతీలను మాత్రమే మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేశారు. దర్శి నగర పంచా యతీకి ఈ జాబితాలో చోటు దక్కలేదు. ప్రతి సంవత్స రం దర్శి నగర పంచాయతీకి రూ.4 కోట్ల వార్షికాదా యం వస్తుంది. సుమారు 40వేల మంది జనాభా ఉన్నారు.


దర్శి నగర పంచాయతీ కార్యాలయం

దీంతో ఖచ్చితంగా మున్సిపాలిటీ అవుతుందని కొంతకాలంగా దర్శి పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి నగర పంచాయతీగానే కొనసాగి స్తూ కొన్ని పోస్టులు మంజూరు చేశారు. త్వరలో మున్సి పాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అధి కారులు తెలిపారు.

నగర పంచాయతీకి 3 పోస్టులు మంజూరు

దర్శి నగర పంచాయతీకి ఎట్టకేలకు మూడు ప్రధాన పోస్టులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదేళ్లుగా సిబ్బంది నియామకం జరగక ఇబ్బంది పడుతున్న నగర పంచాయతీలను టీడీపీ కూటమి ప్రభుత్వం గుర్తించి కీలక పోస్టులను మంజూరు చేసింది. దర్శి నగర పంచాయతీకి కమిషనర్, మేనేజరు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేశారు. ఇంకా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్ పోస్టులు మంజూరు చేయాల్సి ఉంది. వారితో పాటు వార్డు సచివాలయ పోస్టులను నగర పంచాయతీకి బదిలీ చేయాల్సి ఉంది.

గత వైసీపీ ప్రభుత్వం 2020 జనవరిలో దర్శి మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసింది. అయితే, గత ఐదేళ్ల కాలంలో ఒక్క పోస్టు కూడా మంజూరుకాలేదు. ఇప్పటివరకు డిప్యుటేషన్ మీద పలువురు అధికారులు తాత్కాలికంగా విధులు నిర్వహి స్తున్నారు. దీంతో నగర పంచాయతీలో అభివృద్ధి పను లు పూర్తిస్థాయిలో జరగటం లేదు. ఈ సమస్యను గుర్తించిన టీడీపీ కూటమి ప్రభుత్వం కీలకమైన పోస్టులను మంజూరు చేసింది మిగిలిన పోస్టులు కూడా త్వరలో మంజూరవుతాయని అధికారులు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సుపాస్‌లు పంపిణీ

దర్శి, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. వారికి అన్నిరకాల మౌలిక సదుపాలయాలను సమకూరుస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో 35 మంది విభిన్న ప్రతిభావంతులకు మంగళవారం సాయంత్రం దర్శిలో ఆమె ఉచిత బస్సుపాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిరంగాల్లో విభిన్న ప్రతిభావంతులు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్టీసీ పొదిలి డిపో మేనేజర్ శంకరావు, రాష్ట్ర దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షుడు వెంకట్రావు, దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.


విభిన్న ప్రతిభా వంతులకు ఉచిత బస్సుపాస్‌లు అందజేసిన డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి, పాల్గొన్న పొదిలి ఆర్‌టీసీ డిపో మేనేజర్ శంకరరావు

పురోగతిలేని 'అమృతం'

- అడుగుముందుకు పడని పనులు
- కలగా మిగిలిన ఇంటింటి కొళాయి పథకం

దర్శి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు సంవృద్ధిగా అందించేందుకు మంజూరైన అమృత్ పథకం అడుగు ముందుకు పడలేదు. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ళ క్రితం దర్శికి ఈ పథకాన్ని మంజూరుచేస్తూ రూ.121 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకం అమలు పట్ల శ్రద్ధ చూపలేదు. టెండర్లు ఖరారు చేసినప్పటికీ పనులు ప్రారంభించలేదు.

2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా అమృత్ పథకంలో కదలిక వస్తుందని భావించినప్పటికీ ఇంకా ఎలాంటి పురోగతి లేదు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా టెండర్లు ఖరారు చేసినందున వాటిని రద్దుచేసి మళ్లీ టెండర్లు పిలవాలనే ఆలోచనలో ఉన్నారు.

దర్శి నగర పంచాయతీలో సుమారు 40వేల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం ద్వారా పూర్తిస్థాయిలో మంచి నీరు అందటం లేదు. అమృత్ పథకం కింద పులిపాడు చెరువును మంచినీటి చెరువుగా మార్చి దర్శి పట్టణంలోని అన్ని కుటుంబాలకు కొళాయిలు ఏర్పాటుచేసి స్వచ్ఛమైన నీరు అందించాలనే సంకల్పం అమలుకు నోచుకోలేదు. ఉన్నతాధికారులు ప్రజల అవసరాలను గుర్తించి ఇంటింటి కొళాయి పథకం నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రామాపురంలో 'పొలం పిలుస్తోంది'

దొనకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసి ప్రత్యేక ఫార్మర్ ఐడీ కార్డులు అందజేస్తామని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రామాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ నెంబర్ మాదిరి ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారన్నారు. గ్రామాల్లో రైతులు వ్యవసాయ సిబ్బందితో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం గురించి రైతులకు వివరించారు.

రైతులు ఆధార్ నెంబర్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్‌తో నమోదు చేయించుకోవాలన్నారు. తద్వార ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పీఎం కిసాన్, అన్నదాత సు ఖీభవ, పంటల బీమా, పంటల నష్టపరిహారం, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీ ద్వారా వ్యవసాయ పనిముట్లు తదితర ప్రయోజనాలు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో మార్కాపురం ఉద్యానశాఖ అధికారి రమేష్, వ్యవసాయ సహాయకుడు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మస్తానయ్యకు నివాళి


మస్తానయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

పామూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంత వరప్రసాదిని వెలిగొండ ప్రాజెక్టు సాధనతోనే మస్తానయ్యకు నిజమైన నివాళులు అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పేర్కొన్నారు. స్థానిక జీవైఆర్ భవన్‌లో మంగళవారం పాలపర్తి మస్తాన్‌రావు అధ్యక్షతన నీరుకట్టు మస్తానయ్య 26వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక కందుకూరు రోడ్డులోని మస్తానయ్య స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో నారాయణ మాట్లాడుతూ నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం మస్తానయ్య చివరివరకు పేదల పక్షాన అండగా నిలబడి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. మస్తానయ్య ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, కె.ప్రభాకర్, రాగిపాటి సూరిబాబు, ఆకుల మోహన్‌రావు, ఇర్రి వెంకటరెడ్డి, పి.రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాగా మస్తానయ్య కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ నీరుకట్టు బాలమ్మ, నీరుకట్టు నాయబ్‌రసూల్, ఇండ్ల నరసింహారావు, చాంద్‌బాషా, పి.రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు


తాళ్లూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ తాటికొండ, వైద్యులు మస్తాన్‌బీ, రాజేష్‌యాదవ్

తాళ్లూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యసిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు సోకితే తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే అధికారుల, పాలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

తాళ్లూరులో ర్యాలీ

వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తాళ్లూరులో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైద్యులు డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బీ, రాజేష్‌యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, మన్నేపల్లి సమర, పిన్నిక రమేష్, ఐ.శ్రీనివాసరెడ్డి ,కె.రామయ్య, నుసుం ఆదినారాయణరెడ్డి, సోము శ్రీను, తిమోతి, చెంచయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రవి, వైద్యశాఖ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకారం

తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నందున మండల పరిషత్ నిధులతో నిర్మింపచేస్తామన్నారు. గతంలో ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టర్ ఖాదర్‌మస్తాన్‌బీ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇన్వర్టర్ ఏర్పాటుచేయాలన్నారు. మంచినీటి బోరు లేకపోవడంతో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లి ఆమె సహకారంతో నిధులు సమకూర్చి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 5 ఫిబ్రవరి 2025





నమో నమః

రథసప్తమి సందర్భంగా రాజధాని గ్రామం వెంకటపాలెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. భక్తులు గోవింద నామ స్మరణతో ఊరేగింపులో పాల్గొన్నారు.

ప్రభల పనులు ప్రారంభం

- ఊరంతా ఏకమై పోటాపోటీగా నిర్మాణం
- 90 అడుగులకు పైగా ఎత్తులో 20 వరకు కొండకు రాక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభల పండుగగా పేరొందిన, కోటప్పకొండ తిరునాళ్లకు భారీ విద్యుత్ ప్రభల నిర్మాణ పనులు గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. పల్లెల్లో పోటాపోటీగా ప్రభలను నిర్మిస్తున్నారు. 90 అడుగులకుపైగా ఎత్తులో ప్రభలు రూపుదిద్దుకుంటున్నాయి. తిరునాళ్ళకు 15 నుంచి 20 వరకు భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తాయని అంచనా. గ్రామ ప్రతిష్ఠ కోసం అందంగా ప్రభలను నిర్మించడంలో పోటీ ఉంటుంది. ఊరంతా కలసి కట్టుగా ప్రభల పనుల్లో పాల్గొంటు న్నారు. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడ తాయి. ఈ ప్రభలలో పోస కూర్పు, మండపాలు, టిక్కీలు, విద్యుత్, బాల ప్రభలు ఉంటాయి. నరసరావుపేట మండలం లోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని, చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం, యడవల్లి, కోమటినేనివారి పాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు, బొప్పూడి గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం గ్రామస్తులు చేపట్టారు.



గురవాయపాలెంలో జరుగుతున్న ప్రభ పనులు

జీవనశైలి మార్పుతోనే క్యాన్సర్ నివారణ

క్యాన్సర్ దినోత్సవంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక క్యాన్సర్ నుంచి ప్రజలు తప్పించుకోవాలంటే జీవనశైలిలో మార్పులు రావాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాపట్లలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, అధికారులు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. దురవ్యసనాలకు దూరంగా ఉండి క్యాన్సర్ ముప్పును నిరోధిద్దామంటూ విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నాదాలు చేశారు. అనంతరం పాతబస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి ప్రజల ఆహార అలవాట్లలో మార్పు అవసరమన్నారు. చెడు వ్యసనాలు మానాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడే క్యాన్సర్ వ్యాధిని అరికట్టగలమన్నారు. క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలై క్యాన్సర్‌కు గురికావద్దన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని, శారీరక శ్రమ ఎంతో ఉపయుక్తమన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్డీవో పి.గ్లోరియా, పీడీలు ఉమా, పద్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నారాయణభట్టు, ఎన్‌సీడీసీడీ డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి



బాపట్లలోని పాతబస్టాండ్ ఆవరణలో విద్యార్థుల మానవహారం

కౌలు రుణాలు.. తీసికట్టు

- వార్షిక పద్దులో ఘనంగా లక్ష్యాలు
- అరకొరగానే బ్యాంకుల నుంచి రుణాలు





కౌలు రైతుల కష్టాలు తీరుస్తాం.. రుణాలు అందిస్తాం.. అప్పుల ఊబి నుంచి గట్టెక్కిస్తాం.. అని అటు అధికారులు, ఇటు పాలకుల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఈ ఏడాది బ్యాంకుల నుంచి కౌలు రైతులకు అందిన రుణాలే ఇందుకు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. వార్షిక పద్దులో 95 శాతం లక్ష్యాలు సాధించినట్లు అటు అధికారులు, ఇటు బ్యాంకర్లు ప్రకటిస్తున్నాయి. అయితే అందు లో కౌలు రైతుల వాటా చూస్తే తీసికట్టుగా ఉంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలో ప్రకటించిన వార్షిక పద్దులో మెజార్టీ వాటాపై భారీగా ఆశలు పెట్టు కోగా కౌలురైతులకు నిరాశే ఎదురైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యామని కూటమి ప్రభుత్వంలో పరిస్థితిలో మార్పు రాలేదనే ఆవేదన కౌలు రైతుల్లో నెలకొంది. రుణాల విషయంలో ఎప్పుడూ చెప్పే సాకులతో అధికారులు సరిపెడుతున్నారు. ప్రభుత్వం మారినా కౌలు రైతుల పరిస్థితిలో మార్పు లేదనడానికి అధికారులు ప్రకటించిన గణాంకాలే సంకేతంగా ఉన్నాయి. అంతిమంగా కౌలు రైతులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి సేద్యం చేసి అప్పుల పాలవుతున్నారు.

- సాకులతో యథావిధిగా సరిపెట్టిన అధికారులు
- సీసీఆర్‌సీ కార్డులున్నా బ్యాంకర్ల నుంచి చిన్నచూపు
- అధిక వడ్డీలతో అప్పుల పాలైన కౌలు రైతులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన వేల కోట్ల రుణ పద్దులో కౌలు రైతులను ఉదారంగా ఆదుకుంటామనే హామీలు గుప్పించారు. దీంతో రుణాల విషయంలో తమకు న్యాయం జరుగుతుందని కౌలు రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు ఆర్థిక సంవత్సరంలో అందించిన రుణాలు అంతా కలిపి రూ.50 కోట్లకు మించలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా వార్షిక పద్దులో తమ వాటా గణనీయంగా పెరుగుతుందని ఆశించారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా వార్షిక రుణ పద్దులో వందశాతం లక్ష్యాలను చేరుకున్నట్లు బ్యాంకులు ఘనంగా ప్రకటిస్తాయి. అయితే వీటిలో కౌలు రైతుల వాటా ఎంతంటే ఈ ఏడాది కూడా బేలచూపులు చూడాల్సిన పరిస్థితే ఉంది. ప్రారంభంలో చెప్పినట్లు రుణాలలో కౌలు రైతులకు కేటాయించిన శాతం మేరకు వారికి ప్రయోజనం చేకూరలేదు.

వేల కోట్ల వార్షిక పద్దు.. అయినా నిరాశే..

ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి వార్షిక రుణ పద్దును అధికారులు ప్రకటిస్తారు. ఇందులో మెజారిటీ వాటా సేద్యానికే దక్కుతుంది. కానీ ఆ రుణ ఫలాలు అందుకోవడంలో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఎక్కువ శాతం సర్దుబాటులే తప్ప రైతుల చేతికి వచ్చే రుణాల శాతం బహుస్వల్పం అని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బాపట్ల జిల్లాలో వ్యవసాయ అనుబంధ రుణాలకు రూ.10,053 కోట్ల ఇవ్వనున్నట్లు వార్షిక పద్దులో తెలిపారు. ఇందులో పంట రుణాల వాటా రూ.6,321 కోట్లను నిర్దేశించగా ఇప్పటికి రూ.5,800 కోట్లు అందించారు. గుంటూరు జిల్లాలో వ్యవసాయానుబంధ రంగాల వాటాగా రూ.13,613 కోట్లను ప్రకటించగా, పంట రుణాలకు రూ.8,560 కోట్లు కేటాయించారు. పల్నాడు జిల్లాలో రూ.13,210 కోట్లుగా పేర్కొనగా, పంట రుణాలు (మిగతా 6వ పేజీలో)

సీసీఆర్‌సీ కార్డులు ఘనంగా జారీ..

వైసీపీ ఐదేళ్ల పాలనతో పోలిస్తే సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్)ల జారీ విషయంలో ఈ ఆర్థిక సంవత్సరంలో పురోగతి ఉంది. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు కార్డులను కౌలు రైతులకు అందించారు. బాపట్ల జిల్లాలో 1,06,300 సీసీఆర్‌సీ పత్రాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించగా 95 శాతం చేరుకున్నారు. గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడు జిల్లాలో 68,000 కార్డులకు 90 శాతం లక్ష్యాలను చేరుకోగలిగారు. ఈ కార్డులు జారీ చేసిన వారి సంఖ్యలో సగం మందికి అయినా రుణాలు అందించాలనే లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ప్రభుత్వం పెట్టుకుంది. కానీ ముగింపుకొచ్చేసరికి రుణాలు అందుకున్న వారి గణాంకాలు మరీ దిగదుడుపుగా ఉన్నాయి.



రూ.520 కోట్లకు రూ.100 కోట్లే..

ఈ ఏడాది ఆరంభంలో వార్షిక పద్దు ప్రకటనకు.. ఇప్పటి వరకు కౌలు రైతులకు అందించిన రుణాల గణాంకాలను పరిశీలిస్తే ఎంత తీసికట్టుగా ఉన్నాయో అర్థమవుతుంది. బాపట్ల జిల్లాలో రూ.200 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.170 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.150 కోట్ల రుణాలను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టింది. కానీ బాపట్ల జిల్లాలో రూ.40 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.32 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.28 కోట్లకే పరిమితమైంది. ఈ స్వల్ప మొత్తాలలో కూడా ఒక్క సీసీఆర్‌సీ కార్డులే కాకుండా జేఎల్‌జీ, రైతుమిత్ర గ్రూపులు కలిసి ఉండడం కౌలు రైతులపై ఉన్న శీతకన్నుకు అద్దం పడుతోంది.

చీరాలలో.. విగ్రహ రగడ

రోజురోజుకూ నిప్పురాజుకుంటున్న వివాదం

పసుపు నీళ్లతో శుద్ధి.. కలెక్టర్‌కు టీడీపీ కౌన్సిలర్ల ఫిర్యాదు

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చీరాలలో విగ్రహ రాజకీయ రగడ కూటమి నాయకుల మధ్య చిచ్చు రేపుతోంది. విగ్రహ నిర్మాణాన్ని వేదికగా చేసుకుని కయ్యానికి కాలు దువ్వుకుంటున్నారు. ఇటీవల మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని కౌన్సిల్ అంగీకారంతో కలెక్టర్‌కు సిఫారసుకు పంపాలని కోరుతూ అజెండాలో 6వ అంశంగా అధికారులు పొందుపరిచారు. ఈ నెల 1న జరిగిన అత్యవసర సమావేశంలో ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొనిగల జైసన్‌బాబు అనుమతించారు. దీంతో ఇన్‌చార్జి చైర్మన్ సంతకంతో కూడిన పత్రం అందుకున్న పాలేటి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హడావుడిగా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, వైసీపీ కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, బత్తుల అనిల్ సైతం హాజరయ్యారు.

ఆగ్రహించిన కూటమి నేతలు

ఈ విషయం తెలిసిన కూటమి నేతలు మంగళవారం పట్టణంలో నిరసన చేపట్టారు. శంకుస్థాపన జరిగిన ప్రదేశంలో పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహ రాజకీయాలు చేయడంలో పాలేటి దిట్ట అన్నారు. ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరిపాలన జరుగుతుంటే ఓర్వలేని పాలేటి.. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం ఉండగా ఉద్దేశ పూర్వకంగానే గడియార స్తంభం కూడలిలో శంకుస్థాపన చేసి విభేదాలు సృష్టిస్తున్నారని మండి పడ్డారు. పార్టీ అధిష్ఠానం దృష్టికి పాలేటి వ్యవహారాన్ని తీసుకువెళతామన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

స్థానికంగా జరుగుతున్న వ్యవహారంపై టీడీపీ కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, సల్లూరి సత్యానందం, సూరగాని లక్ష్మి, పొత్తూరి సుబ్బయ్య, మల్లెల లలిత కలెక్టర్ వెంకటమురళిని కలిసి ఫిర్యాదు చేశారు. గడియార స్తంభం కూడలిలో కాకుండా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు సమీపంలో విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఉద్దేశపూర్వకంగానే పాలేటి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. విషయంపై న్యాయపరమైన విచారణ జరపాలని కోరారు. విగ్రహ రాజకీయంతో చీరాలలో వివాదాలు రేగడంతో ఇటు పోలీసుల్లో అటు ప్రజల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన వాతావరణం నెలకొంది.



కలెక్టర్ వెంకటమురళికి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవు

మున్సిపల్ అజెండాలో విగ్రహం విషయమై అంశాన్ని పొందుపరిచారని, అందులో కలెక్టర్ దృష్టికి మాత్రమే తీసుకు వెళుతున్నట్లు మాత్రమే ఉందని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేయాలంటే కమిటీ అనుమతి తప్పనిసరన్నారు. అనుమతులు వచ్చాకే నిర్మాణాలు జరుగుతాయని, భిన్నంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.



పసుపు నీళ్లతో శుద్ధి చేస్తున్న కూటమి నాయకులు

నేటితో ముగియనున్న గడువు

గీత కార్మికులకు 12 మద్యం దుకాణాలు

దరఖాస్తుల స్వీకరణ నేటి వరకే.. 7న లాటరీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మొత్తం మద్యం షాపుల్లో పదిశాతం అంటే 12 దుకాణాలను గీత కార్మిక కులాలకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు గడువు బుధవారంతో ముగియనుంది. ఇప్పటి వరకు 12 షాపులకు 20 దరఖాస్తులు వచ్చాయి. షాపుల కేటాయింపు సహేతుకంగా లేదని ప్రక్రియపై స్టే విధించాలని కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ తీర్పు ఎలా ఉండబోతుందోనన్న అనుమానంతో దరఖాస్తు చేసుకోవడానికి ఆశావహులు పెద్దగా ఆసక్తి చూపలేదు. కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ మంగళవారం హైకోర్టు నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో బుధవారం భారీగా దరఖాస్తులు రావచ్చని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తోంది. దరఖాస్తు రుసుం రెండు లక్షలుగా ఉండడంతో రిస్క్ తీసుకోవడం ఇష్టం లేక ఆశావహులు హైకోర్టు నిర్ణయం కోసం వేచి ఉన్నారు. కేసు విచారణ రెండు వారాలకు వాయిదా వేయడంతో అప్పటికి 12 మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. బుధవారంతో దరఖాస్తులకు గడువు ముగుస్తుండడంతో ఈ నెల 7న కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ చేపట్టి మద్యం షాపులను కేటాయించనున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.విజయ బాపట్లలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు, అసిస్టెంట్ ఈఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈఎస్, ఏఈఎస్‌లతో సమీక్ష నిర్వహిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కె. విజయ

భీమలింగేశ్వరుడికి సూర్యాభిషేకం

1అరుదైన ఘట్టాన్ని చూసి తరించిన భక్తులు

పంగులూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పంగులూరులోని శ్రీపార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సూర్యకిరణాలు స్వామివారి విగ్రహాన్ని తాకాయి. ఈ అరుదైన ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి చూసి తరించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. రథసప్తమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాస శుద్ధ సప్తమి, రథసప్తమి రోజున స్వామివారి విగ్రహాన్ని ఆదిత్య కిరణాలు తాకడం అద్భుతమని ఆలయ అర్చకుడు స్వామి తెలిపారు. వారం రోజులు ఉదయం 7 గంటల పది నిమిషాలకు సూర్యకిరణాలు నందీశ్వరుని తాకుతూ భీమలింగేశ్వరస్వామిపై ప్రసరిస్తాయన్నారు.



స్వామివారి విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ విజయలక్ష్మి, పక్కనే జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

మార్టూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతూ ప్రభుత్వం కల్పించిన ఉపాధి పనులను ఉపయోగించుకొని సద్వినియోగపరచుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏవీ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మార్టూరులో మండలంలో ఉపాధి పనులు 2023-2024కి సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్‌పై మండల కాంపెక్స్ వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి ఎంపీడీవో వై.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 1476 పనులుకు రూ.15కోట్ల25లక్షల 52వేల 604 విలువైన పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. వాటికి సంబంధించి ప్రజావేదికను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఆడిట్‌లో బయటపడిన కొన్ని అవకతవకలను భవిష్యత్‌లో జరగకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్ మాట్లాడుతూ ఈ ఆడిట్‌లో రూ.కోటి28లక్షల విలువైన పనులలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. వాటిలో రూ.14లక్షల63వేలు రికవరీకి ప్రయత్నించగా, అందులో రూ.4లక్షల53 వేలు వసూలయ్యాయన్నారు. ఉదయంనుంచి కోలలపూడి, బొబ్బేపల్లి, రాజుగారిపాలెం తదితర గ్రామాలకు సంబంధించి ప్రజావేదికలో వివరాలను సోషల్ ఆడిట్ బృందం వెల్లడించారు. మిగిలిన గ్రామాలకు సంబంధించి రాత్రి 8గంటలకు కార్యక్రమాలను పూర్తి చేశారు. కార్యక్రమంలో జూనియర్ క్వాలిటీ కంట్రోలు అధికారి సతీష్, ఏపీడీ కోటయ్య నాయక్, ఎంపీపీ భూక్యా శాంతిబాయి, ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ రవికుమార్, ఫీల్డు అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇక బొమ్మ తీసేయడమే!

- సర్వే రాళ్లపై ఉన్న జగన్ చిత్రాలను తొలగించేందుకు నిధులు మంజూరు
- జిల్లాకు రూ.39.96 లక్షలు మంజూరు



ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్వే రాళ్లపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రాల(ఫొటోల)ను తొలగించేందుకు (యరైజ్) చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూముల రీసర్వే చేసేందుకు సర్వే రాళ్లపై జగన్ ఫొటోలను చిత్రీకరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చాక ఆ రాళ్లపై ఉన్న ఫొటోలను తొలగించేందుకు జిల్లాకు రూ.39.96 లక్షలను మంజూరుచేసింది. జిల్లావ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వంలో 2,66,421 సర్వే రాళ్లను ఏర్పాటు చేయగా వాటిపై ఉన్న ఫొటోలను తొలగించేందుకు ఒక్కొక్క రాయికి రూ.15 చొప్పున రూ.39.96 లక్షలు మంజూరుచేసింది. సర్వే శాఖ నుంచి అందుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చిన వెంటనే కలెక్టరేట్ నుంచి నిధులను మండలాల వారీగా జమ చేయనున్నారు.

జంగాలపల్లి నుంచి వాటర్‌షెడ్ యాత్ర

- రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఇక్కడి నుంచే
- జాతీయ స్థాయిలో ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి ప్రారంభం
- ప్రత్యక్ష ప్రసారం

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నీటి సంరక్షణ పనులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో డ్వామా ద్వారా అమలు జరిగే వాటర్‌షెడ్ పనులపై ప్రజల్లో విస్తృత అవగాహనపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే చెరువులు, కుంటల అభివృద్ధి పనులను గ్రామానికి కనీసం ఒక్కటైనా చేపట్టాలని నిర్ణయించగా రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి సంరక్షణ పనులు భారీగా చేపట్టాలని నిర్ణయించారు. ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన వాటర్ హెడ్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనుండగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ప్రచార రథాలను ఏర్పాటు చేసి వాటర్‌షెడ్ పథకం అమలు చేసే ప్రాంతాలలో విస్తృత ప్రచారం చేయనున్నారు. ఒక్కొక్క రాష్ట్రానికి ఒక ప్రచార రథాన్ని ఏర్పాటుచేయగా ఢిల్లీలో ఆ కార్యక్రమాన్ని బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి గిరిజ్‌సింగ్ లాంచనంగా ప్రారంభిస్తారు. తదనుగుణంగా ఆయా రాష్ట్రాలలో స్థానికంగా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్నారు.

పండుగ వాతావరణంలో..

కాగా రాష్ట్రంలో ప్రచారరథం కార్యక్రమాన్ని జిల్లా నుంచి చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందుకు కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం మురగమ్మి పంచాయతీలోని జంగాలపల్లిని ఎంపిక చేశారు. అక్కడ వాటర్‌షెడ్ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేసి ఉండగా ఆ ప్రాంతంలో పండుగ వాతావరణంలో ప్రచారరథాన్ని ప్రారంభించేలా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఉపాధి పథకం డైరెక్టర్ షణ్ముక్ తదితరులు పాల్గొనున్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ హాజరవుతారని సమాచారం ఉన్న ఆఖరు నిమిషంలో ఆయన పర్యటన రద్దయింది. కాగా ఢిల్లీలో కేంద్రమంత్రి ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ప్రత్యక్ష ప్రసారం నిర్వహించిన అనంతరం రాష్ట్రస్థాయి ప్రచార రథాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం.

కౌలు రుణాలు.. తీసికట్టు

(5వ పేజీ తరువాయి)

రూ.8,306 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాలలో ఇప్పటికే 90 శాతం చేరుకున్నట్లు బ్యాంకర్లు చెబుతున్నారు. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నందున అప్పటికి వంద శాతం లక్ష్యాలను చేరుకుంటామనే ధీమాను బ్యాంకర్లు వ్యక్తం చేస్తున్నాయి. ఇన్ని వేల కోట్ల పద్దులో కౌలు రైతులకు దక్కిన వాటా పరిశీలిస్తే విస్తుపోవాల్సిందే.

ప్రణాళికా లోపం.. నిబంధనల శాపం

సీసీఆర్‌సీ కార్డుల కాల వ్యవధి పదకొండు నెలలే. వీటి జారీని మే నుంచి ఏప్రిల్ వరకు మాత్రమే ఇస్తారు. ఇవి కౌలు రైతులకు అందేసరికే జూలై, ఆగస్టు నెలలు వస్తున్నాయి. అప్పటికే ఇచ్చిన వ్యవధిలో రెండు నెలలు గడిచిపోతుంది. బ్యాంకర్లు పెట్టే నిబంధనలకు అటువైపు కన్నెత్తి చూడాలంటేనే రైతులు భయపడాల్సిన పరిస్థితి. ఇక భూ యజమానులకు అవగాహన లేక కౌలు చేసుకునే రైతులకు రుణాలు అందించడానికి సుముఖత వ్యక్తం చేయడంలేదు. పైగా వారే రుణాలు తీసుకోవడం కూడా కౌలు రైతులకు ప్రతిబంధకంగా మారుతోంది. ఇదే కాకుండా ఏటికేడు కౌలు చేసుకునే రైతులు మారుతుండడంతో వారు కట్టకపోతే ఆ మొత్తం తమ నెత్తిన పడుతుందనే భయంతో యజమానులు వెనుకంజ వేస్తున్నారు. ఇవేకాకుండా అధికారుల వైపు నుంచి రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి కొరవడింది. ఆర్థిక సంవత్సరం ముగింపులో హడావిడిగా భూ యజమానులకు అవగాహన సదస్సులు నిర్వహించడం లాంటి మొక్కుబడి కార్యక్రమాలతో సరిపెడుతున్నారు. నిజానికి సేద్యం రుణ పద్దులో పదిశాతం కౌలు రైతుల వాటాగా ఉండాలనే డిమాండ్‌ను రైతు సంఘాలు ఎప్పటి నుంచో చేస్తున్నాయి. కానీ ప్రసుతం తీసికట్టుగా నిర్దేశించుకున్న పదుల కోట్ల రుణాలే రైతుల చెంతకు చేరని దయనీయ పరిస్థితి కనబడుతోంది. ఇక పదిశాతం వాటా ఎప్పటికి దక్కేను అని కౌలు రైతులు వాపోతున్నారు.

అన్నగారి సంతకు ఆలనాపాలనా కరువు

- నాడు రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేక గుర్తింపు
- వైసీపీ పాలనలో రైతుల స్థానంలో దళారుల హవా
- ఇష్టారాజ్యంగా ధరలు, అమ్మకాలు
- గత్యంతరం లేక కొనుగోలు చేస్తున్న ప్రజలు
- కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా గాడిన పడని వైనం

అద్దంకి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాలలో దశాబ్ద కాలం కిందట ప్రత్యేక గుర్తింపు పొందిన అద్దంకిలోని అన్నగారి సంత ప్రస్తుతం మినుకు మినుకు మంటూ ఉంది. పదేళ్ల కాలం కిందట ప్రారంభించిన సంత తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత కాలం ఒక వెలుగు వెలిగిన అన్నగారి సంత వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారి సంతను రాజన్న సంతగా మార్పు చేశారు. అప్పటి వరకు రైతులే నేరుగా అమ్మకాలు చేసుకోగా క్రమేమీ దళారులు రంగ ప్రవేశం చేశారు. తరువాత వచ్చిన మార్కెట్ కమిటీ పాలకవర్గాలు సంత నిర్వహణపై పెద్దగా శ్రద్ధ తీసుకోకపోవడంతో రోజు రోజుకు దిగజారుతూ వచ్చింది. ధరలపై నియంత్రణ లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్‌లో ధరలకు సంతలో ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం రాకతో నాటి పూర్వ వైభవం వస్తుందని ప్రజలు ఆశించారు. అయితే రాజన్న సంత కాస్తా అన్నగారి సంతగా మార్పు జరిగిందే కానీ నిర్వహణలో మాత్రం మార్పు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా ఇంకా మార్కెట్ కమిటీ పాలక మండలి నియామకం జరగకపోవడంతో సంత నిర్వహణ ఆలనా పాలనా పట్టించుకునే వారు లేకుండా పోయారు. మార్కెట్ యార్డు తరఫున అధికారికంగా నిర్వహణ లేకపోవడంతో అధికారులు పట్టించుకునే అవకాశం లేకుండా పోయింది.



అద్దంకిలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న సంతలో కొనుగోలు చేస్తున్న ప్రజలు

గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో 2015 జూలై 5వ తేదీ అప్పటి అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్ నాగినేని రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎన్టీఆర్ పేరుతో అన్నగారి సంతగా నామకరణం చేసి ప్రారంభించారు. ప్రతి ఆదివారం అద్దంకిలోని నిర్వహించే సంతకు అద్దంకి ప్రాంతంలో రైతులు సాగు చేసే అన్ని రకాల కూరగాయలను నేరుగా తెచ్చుకొని విక్రయించుకునేలా ఏర్పాటు చేశారు. అదే సమయంలో స్థానికంగా పండని కూరగాయలను మాత్రం మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి అమ్మకాలు చేసే వారు. అనంతరం అద్దంకి మార్కెట్ కమిటీ పరిధిలో ఉన్న మేదరమెట్లలో బుధవారం, పంగులూరులో శుక్రవారం సంతలు ఏర్పాటు చేసి నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పంగులూరులో సంతను మూసి వేశారు. ఇక అద్దంకి, మేదరమెట్లలో కూడా రైతుల స్థానంలో వ్యాపారులు రంగప్రవేశం చేసి వ్యాపారాలు నిర్వహించడం ప్రారంభించారు. అనంతరం వచ్చిన పాలకమండళ్లు సంత నిర్వహణపై శ్రద్ధ పెట్టకపోగా నీరు గార్చే ప్రయత్నాలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇంకా పాలక మండలి నియమించకపోవడం, సంత నిర్వహణపై ఎలాంటి ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో నాటి వ్యాపారులే ప్రస్తుతం కూడా అమ్మకాలు చేస్తున్నారు. అతి కొద్ది మంది రైతులు మాత్రమే సంతలో అమ్మకాలు చేస్తున్నారు. ధరల విషయానికి వస్తే బయట మార్కెట్‌లో కూరగాయల ధరలకు సంతలో ధరలకు పెద్దగా వ్యత్యాసం ఉండటం లేదన్న అభి ప్రాయం వ్యక్తం అవుతుంది. దీంతో ఎక్కువ ధరలు చెల్లించాల్సి రావడంతో ప్రజల జేబులకు చిల్లులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అన్నగారి సంతకు పూర్వవైభవం వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రద్దీగా ఉన్న అన్నగారి సంత

యాంత్రీకరణ పద్ధతులతో వ్యవసాయం లాభసాటి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అధునిక వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతు డ్రోన్‌లా ద్వారా రసాయనిక ఎరువులు, పురుగుమందులు పిచికారీ ద్వారా సాగుఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. మండలంలో రాయితీపై డ్రోన్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ మాట్లాడుతూ రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు ప్రత్యేక సంఖ్యలు కేటాయిస్తామని, ప్రతి రైతు తమ ఆధారాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ పంట నమోదును ఈనెల 10వ తేదీతో ముగుస్తుందని, పంటలు సాగు చేసిన రైతులు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ వీరశంకర్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

పంగులూరు : పంట మార్పిడి విధానంతోనే శనగలో ఎండు తెగులు నివారణ సాధ్యపడుతుందని మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో రైతులు సాగు చేసిన మిరప, శనగ, మొక్కజొన్నను పరిశీలించారు. శనగ విత్తే దశలో ఆ పంటకు ఆశించే పురుగులు, శిలీంద్రాల తెగుళ్లను నివారించేందుకు త్రైకోడెర్మావిరిడితో విత్తన శుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, రైతు సేవా కేంద్రం అధికారి సునీత, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల, : మొక్కజొన్నలో మోము పురుగు రాకుండా సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని అనమనమూరు, ఎర్రబాలెం గ్రామాలలో మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులవాడకం, పంటలకు నీటి తడుల గురించి సమగ్రంగా వివరించారు.

చినగంజాం : రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సాగులో ఉన్న గెనిసగడ్డ, వేరుశనగ, వరి తదితర పంటలను వ్యవయాధికారులు పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని అన్నారు. పీఎం కిసాన్‌కి సంబంధించిన రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ డబ్బులు జమకాకపోతే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రేవతి, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసుకోవాలన్నా, నష్టపరిహారం అందాలన్న ఈక్రాప్ తప్పని సరిఅని వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పొలంపొలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చింతగుంటపాలెం, పెద్దివారిపాలెం గ్రామాల్లోని శనగ పైర్లను వ్యవసాయాధికారులు రైతులతో కలసి పరిశీలించారు. ప్రస్తుతం పూతదశలో ఉన్న శనగకు తుప్పు తెగులుతో పాటు, ఎండు తెగు లు వచ్చే అవకాశం అధికంగా ఉందని దీని నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి. పడమర పెద్దివారిపాలెం గ్రామాలలో మిరప పొలాలను వ్యవసాయ అధికారి మేరమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ మిరపలో నల్లతామర పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సుదర్శన్ తదితర రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శనగలో పూతరాలడాన్ని నివారించుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెంలో సాగులో ఉన్న శనగను ఆయన పరిశీలించారు. శనగలో పూత రాలకుండా ప్లానోఫిక్స్, కంటాప్లస్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ వెంకటస్వామి, అలెగ్జాండర్, రైతులు పాల్గొన్నారు.



తూర్పు కొప్పెరపాడులో శనగను పరిశీలిస్తున్న మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు



దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్వో భాస్కర్, ఆర్ఐ కల్యాణి

కొత్త మార్కెట్ బకాయిలపై కార్పొరేషన్ కొరడా

- అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు
- రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఫ్రిబవరి 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు ఆదాయ వనరులపై దృష్టిసారించారు. ఈ మేరకు మంగళవారం ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో కొరఢా ఝుళిపించారు. గత ఐదేళ్లలో కొవిడ్ సాకుగా చూపి అద్దెలు చెల్లించకపోవడంతో కార్పొరేషన్ ఆదాయానికి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. నాటి వైసీపీ నేతల అండదండలతో అద్దెలు చెల్లించకపోవడంతో రూ.12కోట్లు బకాయిలు ఉన్నాయి. అందులో హోల్‌సేల్ దుకాణాల నుంచి రూ.5కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. దీంతో దీర్ఘకాలింగా పెండింగ్ ఉన్న బకాయిల వసూళ్లపై అధికారులు రంగంలోకి దిగారు. రూ.10లక్షలు నుంచి ఆపై బాకీ ఉన్న దుకాణాలకు తాళాలు వేశారు. దీంతో కొందరు వ్యాపారులు అధికారుల తీరును తప్పుబట్టారు. నష్టాల ఊబిలో ఉన్నామని, అద్దెలు చెల్లించడానికి గడువు కావాలంటూ పట్టుబట్టారు. అయితే కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల ఒక్క పైసా కూడా చెల్లించలేదు.. ఇంకా గడువు ఇవ్వడం కుదరదంటూ తేల్చిచెప్పారు. ప్రతి ఒక్కరు పైసాతో సహా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంలో రెవెన్యూ ఉద్యోగులు, వ్యాపారుల మధ్య కొద్దిసేపు చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేదు. ఈ మేరకు అధిక మొత్తంలో బకాయి ఉన్న దుకాణాలకు తాళాలు వేయగా, తక్కువ బకాయి ఉన్న వారికి హెచ్చరికలు జారీచేస్తే వెంటనే చెల్లించాలని ఆదేశించారు. అయితే దుకాణాలకు తాళాలు వేసే క్రమంలో వ్యాపారులవైపు నుంచి ఎలాంటి అడ్డగింతలు రాకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి విజయ్ భాస్కర్, ఆర్‌ఐలు బి.కళ్యాణి, కే.క్రాంతితోపాటు శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి పాల్గొన్నారు.

జడ్పీ సర్వసభ్య సమావేశంలో సమయం మార్పు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పాత జిల్లాపరిషత్ సమావేశం హాల్‌లో ఈనెల 9వతేదీన నిర్వహించనున్న జడ్పీ సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా పరిషత్ సీఈవో బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించాలని నిర్ణయించారు. అయితే మధ్యాహ్నంకు సమావేశాన్ని మార్పు చేసినందున అధికారులందరూ గమనించాలని కోరారు. సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

నివేదిక బయటకెలా వెళ్లింది..?

- నాకు చేరక ముందే ఫిర్యాదుదారులకా..!
- డీపీవోపై కలెక్టర్ అన్సారియా సీరియస్
- పలువురు జిల్లా అధికారుల సమక్షంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరిక
- బాధ్యులపై చర్యలతో పాటు కార్యాలయాన్ని చక్కదిద్దుకోవాలని ఆదేశం
- ప్రజాప్రతినిధుల్లోనూ అసంతృప్తి

'మీ ఆఫీసులో ఏం జరుగుతుందో, ఏ ఫైల్స్ ఎటు పోతున్నాయో మీరు తెలుసుకోలేరా, నేను ఆదేశించిన విచారణ నివేదిక నా దగ్గరకు రాకుండా ముందే బయటకు ఎలా వెళ్లింది. ఇలాగేనా జిల్లా అధికారి పనిచేసేది, ఇన్ని డిపార్ట్‌మెంట్లు జిల్లాలో ఉన్నాయి మీ శాఖ నుంచి వస్తునన్ని సమస్యలు నాకు ఎక్కడా రావడం లేదు. ఇలాగైతే చర్యలు తప్పవు' అంటూ జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడుపై కలెక్టర్ తమీమ్ అన్సారియా మండిపడటం జిల్లా అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సౌమ్యంగా మాట్లాడే కలెక్టర్ అన్సారియా జిల్లా అధికారులు అందరి సమక్షంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కారణం ఏమిటన్న విషయంపై పలువురు అధికారులు ఆరా తీస్తున్నారు. ఆయన వైఖరి తెలిసిన కొందరు మాత్రం ఇక్కడ చేరి ఇన్నిరోజులైనా శాఖాపరంగా పట్టు పెంచుకోకపోతే ఎలా అన్న భావన వ్యక్తం చేస్తున్నారు.

ఒంగోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారులతో సోమవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ కార్యాలయ పనితీరుపై సీరియస్ అయ్యారు. విచారణ నివేదిక బయటకు వెళ్లడం ఏమిటని డీపీవోను ప్రశ్నించారు. ఆయన తనకేమీ తెలియదని చెప్పడంతో మండిపడ్డారు. ఈ వ్యవహారం మంగళవారం అధికార వర్గాలలో విస్తృత చర్చకు దారితీసింది. కలెక్టర్ అన్సారియా ఇక్కడ బాధ్యతలు స్వీకరించి ఏడు మాసాలు పూర్తి కాగా ఇంతవరకు జిల్లా అధికారి ఎవరిపైనా ఈ స్థాయిలో మండిపడిన దాఖలాలు లేవని పలువురు అంటున్నారు. అసలు కారణం ఏమిటన్న విషయం పరిశీలిస్తే.. సింగరాయకొండ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదుతో డిసెంబరు ఆఖరు వారంలో విచారణకు కలెక్టర్ త్రిసభ్య కమిటీని నియమించారు. మెప్మా పీడీ రవికుమార్ నేతృత్వంలో నియమించిన కమిటీ ఈ విచారణను నిర్వహించి నివేదికను డీపీవో కార్యాలయంలో అందజేశారు. నెల రోజులు గడిచినా సదరు నివేదిక కలెక్టర్‌కు చేరకపోగా ఫిర్యాదుదారులకు డీపీవో కార్యాలయం నుంచి చేరినట్లు సమాచారం. ఆర్టీఐ యాక్టు ద్వారా పొందిన సదరు ఫిర్యాదుదారులు ఒక రాజకీయ పక్షానికి చెందిన వారు కాగా ఆ నివేదికలో కొన్ని లోపాలు ఉన్నాయంటూ వారు మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే తాను నియమించిన కమిటీ నివేదికను తనకు నివేదించక ముందే బయటి వ్యక్తులకు చేరడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ అదే విషయాన్ని సోమవారం సాయంత్రం వీసీ సందర్భంగా అందరూ అధికారుల సమక్షంలోనే డీపీవోను అలా ఎలా బయటకు వచ్చిందని ప్రశ్నించారు. తనకు ఆ విషయమే తెలియదని డీపీవో చెప్పడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ మీ ఆఫీసులో ఏమి జరుగుతుందో తెలియదా.. అని అడిగారు. ఇలాంటి సమాచారం బయటకు పోతున్నా అప్రమత్తత లేకుండా ఉంటారా? అని మండిపడినట్లు సమాచారం.



వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ అన్సారీయా

కార్యాలయంలో రాని మార్పు

ఈ ఒక్క అంశంలోనే కాక జిల్లా పంచాయతీ కార్యాలయం పనితీరుపై ఇటు కలెక్టర్‌కు, అటు అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు అనేకసార్లు ఫిర్యాదులు అందడం, దానిపై డీపీవోను కొందరు హెచ్చరించడం కూడా జరిగినట్లు సమాచారం. ఇక్కడ బాధ్యతలు చేపట్టి మూడు, నాలుగు నెలలు అవుతున్నా కార్యాలయంలో పని పద్ధతులలో మార్పు రాలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా అంశాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అడిగినా.. ఇక్కడ ఎవరు పనిచేయడం లేదు, ఫైళ్లు తానే రాసుకుంటున్నానని చెప్పడం, ఇతర అధికారుల వద్ద కూడా తరుచూ మాట్లాడటం వంటి విషయాలపై చ ర్చ సాగుతోంది. జిల్లాలో అత్యధికశాతం మంది వైసీపీ సర్పంచ్‌లు ఉండగా ప్రస్తుతం అధికార టీడీపీ ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా డీపీవో వ్యవహరించకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని నేతలు చర్చించుకోవడమే కాక కలెక్టర్ దృష్టికి కూడా కొందరు తీసుకెళ్లినట్లు సమాచారం.

అందని నారాయణరెడ్డి ఫైళ్లు

గతంలో ఇక్కడ డీపీవోగా పనిచేసిన జీవీ నారాయణరెడ్డి అప్పటి వైసీపీ కీలక పెద్దలకు సన్నిహితంగా మెలుగుతూ అక్రమాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ విచారణకు ఆదేశించగా అందుకు అవసరమైన ఫైళ్లను విచారణాధికారి మూడు నెలల క్రితం కోరినా ప్రస్తుత డీపీవో ఇవ్వకపోవడంతో ఆ విచారణ ముందుకు సాగలేదు. ఈ విషయం కూడా ప్రజాప్రతినిధుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా ఇక్కడ పోస్టింగ్ ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించిన కీలక ప్రజాప్రతినిధి కూడా డీపీవో తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. సింగరాయకొండ పంచాయతీపై విచారణ కమిటీ నివేదిక బయటకు వచ్చిన వ్యవహారంపై కార్యాలయ ఏవోకు షోకాజ్ నోటీసు ఇచ్చి వివరణ తీసుకుని తనకు నివేదించాలని, అలాగే కార్యాలయ వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని కలెక్టర్ ఆ సందర్భంగా డీపీవోను హెచ్చరించినట్లు సమాచారం.

హైవేతో మారుతున్న పర్చూరు రూపురేఖలు



జాతీయ రహదారి నిర్మాణంతో రూపురేఖలు మారుతున్న పర్చూరు



శరవేగంగా సాగుతున్న హైవే నిర్మాణ పనులు

- కూటమి ప్రభుత్వ హయాంలో శరవేగంగా రోడ్ల అభివృద్ధి
- పలు నిర్మాణాలతో గ్రామాలకు కొత్తకళ

పర్చూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచీ రహదారుల అభివృద్ధికి మహర్దశ పట్టింది. ఇటు గ్రామీణ సీసీ రోడ్లతోపాటు, ఆర్అండ్బీ రోడ్ల మరమ్మతులు సాగుతున్నాయి. దీనికితోడు జాతీయ రహదారుల నిర్మాణాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. అందులో భాగంగా వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈరోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. పర్చూరు మండల పరిధిలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. అందులో భాగంగా పర్చూరును అనుసంధానం చేస్తూ కారంచేడు మీదుగా వాడరేవు వరకు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. పర్చూరు - కారంచేడు మధ్య పనులు చకచకా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంతోపాటు కల్వర్టులు, ఫ్లైవోవనఖ బ్రిడ్జి ఏర్పాట్లకు సంబంధించిన పనులు చేపట్టారు. హైవే నిర్మాణంతో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ వంటి ఇరు రాష్ట్రాల మధ్య రవాణాకు సులువు కానుంది. చీరాల ప్రాంతంలో వాడరేవు ఉండడం వల్ల ఇటు పర్యాటన రంగం కూడా అభివృద్ధి చెందనుంది. దీంతో వాణిజ్య వ్యాపారాల సైతం హైవే నిర్మాణంతో మరింత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ప్రస్తుతం చేపడుతున్న హైవే నిర్మాణాలకు సమీపంలో ఉన్న గ్రామాలు నూతన శోభను సంతరించుకునే విధంగా మార్పు చెందుతున్నాయి. హైవే అధికారుల పర్యవేక్షణలో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

మెరుగైన రవాణా వ్యవస్థకు దోహదం

వాడరేవు - పిడుగురాళ్ల వరకు హైవేతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. హైదరాబాద్ నుంచి వాడరేవు రవాణాకు ఉపయోగపడే ముడిసరుకు రవాణాకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటికీ మించి మోటుపల్లి, పెద్దగంజాం, ప్రాంతానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలోనే రైల్వే ట్రాక్ కూడా ఉండడం రవాణాకు దోహదం. సమీపంలోనే విజయవాడ కృష్ణా బ్యారేజీ నుంచి చెన్నై వెళ్లే బకింగ్హాం కెనాల్ అభివృద్ధికి ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో ఈహైవే నిర్మాణం మరింత దోహదపడే అవకాశం ఉంది



ట్రైనీ డీఎస్పీ అభిషేక్ను అభినందిస్తున్న సీఐ శ్రీనివాసరావు

చీరాల వన్టౌన్లో ట్రైనీ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్టౌన్ పోలీస్ స్టేషన్లో ట్రైనీ డీఎస్పీగా మంగళవారం అభిషేక్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఐ శ్రీనివాసరావు అతనిని అభినందిస్తూ స్వాగతించారు. ప్రజాస్వామ్యంలో బాధితులకు అండగా ఉండి న్యాయ సమస్యల పరిష్కారానికి పోలీసు వ్యవస్థ పాటుపడుతుందని సీఐ తెలిపారు. అలాగే ట్రైనీ డీఎస్పీ కూడా విధుల్లో విజయవతంగా పని చేయాలని ఆకాంక్షించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి ఆయన్ని పరిచయం చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ హరనాథ్బాబు

తైక్వాండోలో చినగంజాం విద్యార్థుల సత్తా

చినగంజాం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర తైక్వాండో పోటీలలో విద్యార్థులు సత్తాచాటి, మెడల్స్ సాధించారని సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.హరనాథ్బాబు తెలిపారు. కాకినాడ జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో తూర్పుగోదావరి జిల్లా యూత్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగిన 1వ ఎన్టీఆర్ మెమోరియల్ ఏపీ రాష్ట్ర తైక్వాండో చాంపియన్షిప్-2025 పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనపరచి పది మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం హైస్కూల్లో హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం అభినందన సభ జరిగింది. రాష్ట్ర తైక్వాండో పోటీలలో పాఠశాలకు చెందిన కే.దుర్గా హర్షిత రెడ్డి 42 కేజీల క్యాడిట్ విభాగంలో సిల్వర్ మెడల్, కే.రక్షితారెడ్డి 40.5 కేజీల క్యాడిట్ విభాగంలో సిల్వర్ మెడల్, సబ్జూనియర్ విభాగంలో జి.స్నిగ్ధశ్రీ 38.2 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఎం.జనని 25.6 కేజీల విభాగంలో, సీహెచ్ అవిత్ 32.8 కేజీల విభాగంలో, ఎల్వీ గీతిక 28.3 కేజీల విభాగంలో, బి.అమృత 27.3 కేజీల విభాగంలో, డి.దేవాదిత్య 20.6 కేజీల విభాగంలో బి.మహాలక్ష్మి 24 కేజీల విభాగంలో, పి.అక్షిత 17 కేజీల విభాగంలో కాంస్య మెడల్స్ సాధించినట్లు హరనాథ్బాబు తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ హరనాథ్ బాబు, హెచ్ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, తైక్వాండో కోచ్లు షేక్ సుల్తాన్, వాటుపల్లి సుబ్రమణ్యం అభినందించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

బల్లికురవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తక్షణమే గ్రామాలలో నిరుపయెగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన యాప్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలానే గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాలలో ఎక్కడ రోడ్ల వెంబడి చెత్త కనిపంచకుండా చర్యలు చేపట్టాలన్నారు. రిక్షాల ద్వారా చెత్తను చెత్త సంపద కేంద్రాలను తరలించాలన్నారు. కొన్ని గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని వెంటనే అందరూ అప్రమత్తంగా గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఇంకొల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులోని కొణికిరోడ్డులో విఘ్నేశ్వర కోల్డ్స్టోరేజీ సమీపంలో విద్యుత్ పనులు చేస్తుండగా స్తంభం పైనుంచి కాలుజారి కిందపడి వ్యక్తి మృతి చెందాడు. దగ్గుబాడు గ్రామానికి చెందిన జీసస్బాబు(35) కరెంట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో విద్యుత్ పనులకు వెళ్లిన జీసస్బాబు స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా అదుపుతప్పి జారి కిందపడడంతో గాయాలయ్యాయి. వెంటనే ఒంగోలు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి జయసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. జీసస్బాబుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



రీసర్వేలో పాల్గొన్న ఆర్డీవో చంద్రశేఖర్నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ

రీ-సర్వేతో పారదర్శకమైన సేవలు

ఆర్డీవో చంద్రశేఖర్నాయుడు

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ-సర్వేతో రైతులకు పారదర్శకమైన సేవలు అందించాలని ఆర్డీవో చంద్రశేఖర్నాయుడు అన్నారు. కొంతకాలంగా మండల పరిధిలోని చీరాలనగర్ గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో పర్యవేక్షించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడారు. కొలతలలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాలువలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



కొత్తపాలెంలో మురుగు కాలువలను ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదుపై పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎవరైనా మురికి కాలువలను ఆక్రమించి వాటిపై గృహ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో కె.కుసుమకుమారి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కొత్తపాలెంలో ఒక వ్యక్తి ప్రభుత్వ మురికి కాలువను ఆక్రమించి తన సొంత అవసరానికి వాడుకుంటున్నారని గ్రామ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో, ఈవోపీఆర్డీ సుమతి కాలువను పరిశీలించారు. తక్షణమే ఎగువ భాగంలో కాలువ ఎలా ఉందో అలా ఆక్రమణలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో ఆదేశించారు. పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి మార్జిన్లను ఆక్రమించుకుంటు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎంపీడీవో అన్నారు.

ఈఈఎంటీ మెయిన్స్లో మెరిసిన విద్యార్థి



శశాంక్ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆన్లైన్ ద్వారా నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్ (ఈఈఎంటీ) పరీక్షల్లో ఈపూరుపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పాలెపు శశాంక్ ఉత్తమంగా రాణించాడు. ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించాడు. దీంతో మంగళవారం ప్రధానోపాధ్యాయిని సుధావాణి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈనెల 8వ తేదీన విజయవాడలో జరిగే బహుమతుల ప్రధానోత్సవంలో శశాంక్ క్యాష్ప్రైజ్ అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బర్లీ రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

పంగులూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రైవేటు కంపెనీలు సిండికేట్గా ఏర్పడి బర్లీ పొగాకు ధరలు పూర్తిగా తగ్గించి సంక్షోభానికి తెరతీశాయని, ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రైవేటు కంపెనీల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పొగాకు రైతులను ఆదుకోవాలన్నారు. కంపెనీల మాటలు నమ్మి రైతులు ఇతర పంటల సాగును వదిలేసి పొగాకు విస్తారంగా సాగు చేశారన్నారు. ఇది కొనసాగితే రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదుంసాహెబ్, రాయిణి కిరణ్, డాక్టర్ మంచాల రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

తం సూర్యం ప్రణమామ్యహం

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి వేడుకలను మంగళవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా చీరాలనగర్లోని సూర్యభగవాన్ ఆలయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.



గజ వాహనంపై ఊరేగుతున్న వీరరాఘవస్వామి

రథసప్తమిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని వీరరాఘవస్వామి ఆయలంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా వీరరాఘవస్వామిని గజ వాహనంపై పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి సేవలో తరించారు. పుర వీధులలో జరిపిన నగరోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శింగరకొండలో పూజలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రథ సప్తమి పూజలు వైభవంగా జరిగాయి. వేదపండితులు, పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోధుమ రవ్వ తో పొంగలి చేసి నైవేద్యం సమర్పించారు. ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. మంగళవారం కూడా కావటం తో శింగరకొండ కు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రసన్నాంజనేయస్వామి ని దర్శించుకున్నారు.



సూర్యభగవాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

పర్చూరు : రథ సప్తమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. చిక్కుడు కాయలతో రథాన్ని తయా రు చేసి పూజలు చేశారు. జిల్లేడు ఆకులు, రేగుపండ్లు, చిక్కుడు ఆకులతో స్నానాలు ఆచరించారు.

యద్దనపూడి : రథసప్తమి సందర్భంగా యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానంలో భక్తులు పూజలు చేశారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష ఆదిత్య ఆరాధన, విష్ణుచాలీసా ఆదిత్య హృదయ పారాయణాలు చేశారు. మార్టూరు పడమర బజారులోని శ్రీ రుక్మాబాయి పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. ఇసుకదర్శి శ్రీపాండురంగస్వామి దేవస్థానంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇళ్లవద్ద తలపై జిల్లేడు, చిక్కుడు ఆకులు పెట్టుకొని స్నానాలను ఆచరించారు.

చినగంజాం : రథసప్తమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రసాదాలను నివేదించారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న పురోహితులు



చెన్నకేశవస్వామి ధ్వజ స్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

సోషల్ మీడియాలో పోస్టులపై చర్యలు తీసుకోవాలి

వేటపాలెం (చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో విభేదాలు సృష్టించేలా పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. సోషల్ మాధ్యమాన్ని వేదికగా చేసుకుని ఓ వ్యక్తి త్వరలో చీరాలకు గొట్టిపాటి ఇన్చార్జిగా వస్తున్నట్లు పోస్టు చేశారు. దీంతో ఆగ్రహించిన కూటమి నాయకులు మంగళవారం వేటపాలెంలో ఆందోళన చేపట్టారు. నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని ఎమ్మెల్యే కొండయ్య అభివృద్ధికి పాటుపడుతున్న క్రమంలో విభేదాలు సృష్టించేలా ఉద్దేశపూర్వకంగా పోస్టులు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు ఎస్సై వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదు చేశారు.

పాలేటి వ్యవహారం సరైనది కాదు

పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా ఎన్టీఆర్ విగ్రహానికి భూమిపూజ నిర్వహించిన పాలేటి తీరు సరైనది కాదని పలువురు టీడీపీ కూటమి నాయకులు అన్నారు. పార్టీ ప్రతిష్టను భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. విభేదాలు సృష్టించేలా వైసీపీ నాయకులతో భూమిపూజ చేయించడం విచారకరమన్నారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పార్టీకు భంగం కలిగిస్తే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నాశీవీరభద్రయ్య, పార్థసారథి, పోతురాజు, మార్కండేయులు, పల్లప్రోలు శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కూటమి నాయకులు

కాలువలో బాలుడి మృతదేహం

- అదృశ్యమైన 24గంటల వ్యవధిలో శవమై లభ్యం
- అడుసుమల్లి ఎస్సీ కాలనీలో విషాదం

అడుసుమల్లి (పర్చూరు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి అదృశ్యమైన బాలుడు 24 గంటల వ్యవధిలో కాలువలో శవమై కన్పించాడు. ఈ ఘటన పర్చూరు మండలం, అడుసుమల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం వెలుగుచూసింది. కుంటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అడుసుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన కుంచాపు సందీప్ (15) స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని చెప్పి టీవీఎస్ వాహనంపై వెళ్లిన సందీప్ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా గంటలో వస్తానని ఫోన్ ద్వారా మెసేజ్ పంపాడు. రాత్రికి రాకపోవడంతో సోమవారం సందీప్ కోసం వెతకగా ఆచూకీ లేకపోవడంతో పర్చూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం కాలనీ సమీపంలోని లిఫ్ట్ ఇరిగేషన్ బావి వద్ద బాలుడు తీసుకువెళ్లిన మోపెడ్, చెప్పులు కనపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న బంధువులు బావి పక్కనున్న కాలువలో బాలుని మృతదేహం తేలుతూ ఉండడాన్ని గమనించి బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్సై సురేష్రెడ్డి, సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టంకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదమా లేక ఇతర కారణాలాల అన్నది విచారణలో తేలాల్సి ఉంది.



సందీప్ (ఫైల్)



కాలువ నుంచి వెలికి తీసిన బాలుని మృతదేహం

ఏడేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి

ఏడేళ్ల కిందట కొద్దిపాటి వివాదంతో సందీప్ తల్లిదండ్రులు కుంచాపు కిషోర్, సుజాత ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో సందీప్ తాత, బాబాయి సంరక్షణలో అడుసుమల్లిలోనే ఉంటూ స్థానిక పాఠశాలలో చదువుకుంటున్నాడు. ఇటీవల తాత కూడా మృతి చెందారు. ఇప్పుడు సందీప్ కూడా మృతి చెందడంతో ఎస్సీ కాలనీలో విషాదం చోటుచేసుకుంది.

సారా స్థావరంపై దాడులు



పట్టుబడిన నిందితులతో వేటపాలెం పోలీసులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీ స్థావరంపై వేటపాలెం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని వివేకానంద కాలనీలో కాలనీ శివారులో దాడులు నిర్వహించి 10 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. దాడుల్లో స్టేషన్ సిబ్బది పాల్గొన్నారు.

కాపు, బలిజ సంక్షేమ సేన మండల అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణ

చినగంజాం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన ఘంటా లక్ష్మీనారాయణ కాపు, బలిజ సంక్షేమ సేన చినగంజాం మండల అధ్యక్షుడిగా నియమితులైనారు. కాపు, బలిజ సంక్షేమ సేన ఎగ్జిక్యూటవ్ కమిటీ తీర్మానం ప్రకారం లక్ష్మీనారాయణను ఎంపిక చేసి, నియామకపత్రాన్ని అందజేసినట్లు సేన బాపట్ల జిల్లా అధ్యక్షులు తరణి గోపాల కృష్ణ మంగళవారం తెలిపారు. సంక్షేమ సేన సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాపు, బలిజ సంక్షేమ సేన అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన గోపాలకృష్ణకు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీనారాయణకు సోపిరాల గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

240 మందికి వైద్య పరీక్షలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మవరంలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం సర్పంచ్ రామిరెడ్డి శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్, గుండె, కంటి సంబంధింత సమస్యలకు పరీక్షలను కిమ్స్ ఆసుపత్రి వైద్యులు చేశారు. 240 మంది రోగులుకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రోగులను డాక్టర్ రామాంజనేయులు, విజయలక్ష్మి పరీక్షించారు. ఫిజియోథెరపీ డాక్టర్ కట్టా సాయితేజా, పీఆర్వో కాలేషా పాల్గొన్నారు.



తమ్మవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న కిమ్స్ వైద్యులు



నీరు-చెట్టు బిల్లులకు బ్రేక్!

సీఎఫ్ఎంఎస్ ఆగిపోవడంతో అప్‌లోడ్ కాని బిల్లులు

- వివరాలు 6లో..



సప్తసప్త మహాసప్త!!

- ఏడు వాహనాలపై విహరించిన వైకుంఠనాథుడు
- పెంచలకోనకు పోటెత్తిన భక్తజనం
- నగరంలో రంగనాథుడి వైభోగం

రాపూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ సప్తమి రోజున జగతికి వెలుగులు పంచే దినకరుడి పండుగ రథసప్తమి పర్వదినాన్ని పెంచలకోన క్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒకేరోజు పెంచలోరు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు సూర్యుడి నులివెచ్చని కిరణాల స్పర్శతో ప్రారంభమైన వాహన సేవలు రాత్రి 8 గంటలకు చల్లని చందమామ వెలుగులతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం సూర్యప్రభ వాహనంపై తొలుత దర్శనం ఇచ్చిన లక్ష్మీనృసింహుడు ఆ తర్వాత 8 గంటలకు శేష వాహనం, 10 గంటలకు సింహ వాహనం, మధ్యాహ్నం 12 గంటలకు స్వర్ణ గరుడుడిపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు హనుమంత సేవ, 6 గంటలకు అశ్వవాహనాలపై స్వామివారు కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. మధ్యాహ్నం వాహన సేవల్లో అలసిపోయిన స్వామివారిని చక్రస్నానంతో సేదతీరారు. ఒకేరోజు పెంచులోరు ఏడు వాహనాలపై కనువిందు చేయడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం యాత్రికులను ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీనృసింహుడు

పెంచలకోనలో సింహవాహనంపై ఊరేగుతున్న నృసింహ స్వామి

● వైభవంగా రథోత్సవం


శేష వాహనంపై...


స్వర్ణ గరుడుడిపై..


హనుమంతుడిపై..


అశ్వవాహనంపై ఊరేగుతూ..


నెల్లూరులో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు


కోనలో చల్లని చంద్రుడిపై కొలువుదీరి..


కోనేరులో చక్రస్నాన ఘట్టం


చుండి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు బరువును పరిశీలిస్తున్న విజయ్ భాస్కర్‌రెడ్డి

గుడ్డు సైజు తగ్గిందేంటి!?

ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా!?

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆరా

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి వలేటివారిపాలెం మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. మాలకొండ, అయ్యవారిపల్లె, చుండి, వలేటివారిపాలెం, పోకూరు, చెర్లోపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, రేషన్ ఎండీయూ వాహనాలను ఆయన తనిఖీలు చేశారు. చుండి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్ల సైజు, బరువు తేడా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుడ్డు 45 నుంచి 55 గ్రాములలోపు బరువు ఉండాలని, అధికారుల ద్వారా కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి 50 గ్రాముల బరువు కలిగిన గుడ్లను సరఫరా చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న పౌష్టికాహారంపై గర్భవతులు, బాలింతలు, పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మాతృశ్రీ పథకం కింద గర్భవతులకు మూడు విడతలుగా రూ.5 వేలు అందజేస్తోందని, అలాగే ఆడపిల్ల పుడితే రూ.6 వేలు ఇస్తోందని ఇవన్నీ అందుతున్నాయా అని గర్భవతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలలను పరిశీలించి భోజనం రుచి చూశారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సక్రమంగా అందుతోందా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ వెంట డ్వామా పీడీ గంగాభవాని, డీఎస్‌ఓ అంకయ్య ఏసీడీపీఓ అనూరాధ, డిప్యూటీ డీఈఓ జానకీరామ్, సీడీపీఓ శర్మిష్ఠ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు (హరనాథపురం) : నగరంలోని బీసీ బాలికల హాస్టల్‌ను విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట తయారీని పరిశీలించిన ఆయన, వంట ఎలా ఉందని, మెనూ అమలవుతోందా అంటూ విద్యార్థులతో మాట్లాడారు.

వైసీపీ హయాంలో పేదల ఇళ్ల మాటున జరిగిన దోపిడీ లెక్క తేలింది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు అక్రమాలను నిగ్గు తేల్చారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నెల్లూరు జిల్లాలో సుమారు రూ.110 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు నిర్ధారించారు. ఇందులో గృహనిర్మాణ శాఖ అధికారులు కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. బాధ్యులుగా ఏఈ స్థాయి నుంచి పీడీ స్థాయి అధికారుల వరకూ చేరుస్తూ తయారు చేసిన నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఈ నివేదిక ఇప్పుడు ప్రభుత్వ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తదుపరి ఎటువంటి చర్యలు తీసుకుంటుందన్నదానిపై హౌసింగ్ శాఖలో టెన్షన్ నెలకొంది.

'హౌసింగ్' స్కాం..

రూ.110 కోట్లు

- పేదల ఇళ్ల మాటున భారీగా అక్రమాలు
- విచారణ పూర్తి చేసిన విజిలెన్స్ అధికారులు
- ఏఈల నుంచి పీడీల వరకూ బాధ్యులుగా గుర్తింపు

కూటమి ప్రభుత్వానికి చేరిన నివేదిక

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ ఇళ్లు పేరుతో చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో భారీగా అక్రమాలు జరిగాయి. ఆప్షన్-3 కింద లబ్ధిదారులకు కాంట్రాక్టర్లే ఇళ్లు నిర్మించి ఇచ్చేలా జిల్లాలో వేల ఇళ్లను వారికి అప్పగించారు. ఈ అప్పగింతలో ఒక పద్ధతి అంటూ లేకుండా వ్యవహరించారు. ఎటువంటి అనుభవం, గ్యారెంటీలు లేకుండా ఇష్టమొచ్చిన రీతిలో వారికి నచ్చిన వారికి నచ్చినన్ని ఇళ్లను హౌసింగ్ అధికారులు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మించకపోయినా వారికి సిమెంటు, స్టీలు, ఇసుక వంటి మెటీరియల్ సరఫరా చేయడమే గాక ఏకంగా బిల్లులు కూడా చెల్లించేశారు. ఉన్నతాధికారులకు మాత్రం ఇళ్లు నిర్మించినట్లు ప్రోగ్రెస్ రిపోర్టులు వస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం ఇళ్లు కనిపించడం లేదంటే నాడు దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు.


● ప్రభుత్వ ఆదేశాలతో

ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ విభాగం.. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించింది. అదే సమయంలో చెల్లించిన బిల్లులను సరిపోల్చింది. ఈ క్రమంలో భారీ అవినీతి వెలుగుచూసింది. నిర్మించిన ఇళ్ల స్థితికి, చెల్లించిన బిల్లులకు పొంతన లేదని గుర్తించి, అది ఎంత స్థాయిలో ఉందన్నది లెక్కలు వేసింది. ఈ నేపథ్యంలోనే సుమారు రూ.110 కోట్ల వరకూ ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. ముందుగా తాము గుర్తించిన తేడాలకు సమాధానం చెప్పాలంటూ హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చారు. వారంతా వివరణ ఇచ్చారు. ఆ వివరణలను పరిగణలోకి తీసుకొని ఎవరెవరు ఈ అక్రమాలకు బాధ్యులన్నది నిర్ధారించారు. అప్పట్లో జిల్లాలో పనిచేసిన అతికొద్దిమంది మినహాయిస్తే మిగిలిన వారంతా ఈ అక్రమాలకు బాధ్యులని విజిలెన్స్ అధికారులు తేల్చినట్లు సమాచారం. ఈ నివేదికను చూసిన ఓ జిల్లా ఉన్నతాధికారి ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. విచారణ పూర్తి నివేదికను తయారు చేసిన విజిలెన్స్ అధికారులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

● ఇప్పుడూ వారే..!

ప్రభుత్వం మారింది.. విధానాలు మారాయి.. మరోవైపు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా నిగ్గు తేలుతున్నాయి.. కానీ జిల్లాలో పనిచేస్తున్న హౌసింగ్ అధికారులు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వంలో ఎవరైతే జిల్లాలో కీలకంగా వ్యవహరించి నాటి అక్రమాలకు సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారో.. వారే ఇప్పుడూ అక్కడ కీలకంగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఇటీవల జరిగిన బదిలీల్లో అన్ని శాఖల్లో స్థానచలనాలు జరిగాయి. కానీ హౌసింగ్ శాఖలో మాత్రం ఒకరిద్దరు మినహాయిస్తే మిగిలిన వారంతా జిల్లాలోనే సర్దుకున్నారు. పేదల ఇళ్ల సొమ్ముతో పడుగుపాడు వద్ద మూడంతస్థుల భవనం నిర్మించుకున్నారన్న ఆరోపణలు ఉన్న అధికారే ఇప్పుడు నెల్లూరులో కీలక స్థానంలో పనిచేస్తున్నారు. గతంలో కావలిలో పనిచేసిన ఓ అధికారి పక్క జిల్లాకు బదిలీ అయినట్లే అయి మళ్లీ జిల్లాకు వచ్చేశారు. ఓ ఈఈ, డీఈలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరినీ సిండికేట్ చేసి ఎలాగైనా విజిలెన్స్ విచారణ నుంచి తప్పించుకోవాలని అనేక మార్గాల్లో లాబీయింగ్ చేస్తున్నట్లు హౌసింగ్ శాఖలో ప్రచారం నడుస్తోంది. మరోవైపు కట్టిన ఇళ్ల నాణ్యతపై విచారణ జరిగితే ఇంకెన్ని రూ.కోట్లు కుంభకోణం బయటపడుతుందోనన్న ప్రచారం జరుగుతోంది.

కందుకూరుకు 15న సీఎం రాక?



కందుకూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 15వ తేదీన కందుకూరుకు రానున్నారు. ఆ రోజు కందుకూరులో జరిగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారని మంగళవారం అధికారులకు సమాచారం అందింది. అలాగే పలు అభివృద్ధి పనులకూ చంద్రబాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే, రెండు మూడురోజుల్లో సీఎం పాల్గొనే కార్యక్రమ వివరాలపై స్పష్టత వస్తుందని తెలిపారు.

300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రైతులకు ఇబ్బందులు రానీయకుండా ఏర్పాట్లు
- సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
- మిల్లర్ల సమావేశంలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ఆయన మిల్లర్లతో జాయింట్ కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. గత ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటకు ఈ నెల రెండో వారం నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 523 రైతు సేవా కేంద్రాలకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి విషయంలోనూ రైతులకు ఇబ్బంది లేకుండా గోతాలు, హమాలీలు, రవాణా సదుపాయాలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒకవేళ రైతులే సమకూర్చుకుంటే అందుకు సంబంధించి నగదును చెల్లించనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో 8520879979 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ఆ నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ డీఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ మధ్యాహ్న భోజనం

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేకం
- పరీక్షల ప్రారంభం వరకు అమలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజ న పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్ష ల సమయంలో ప్రత్యేకంగా తరగతుల నిర్వహణ నేపథ్యంలో విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న తమ ఇంటికి భోజనానికి వెళ్లి తిరిగి రావడం కష్టతరంగా మారుతుందని ప్రభుత్వం గుర్తించింది. దీంతో సెలవుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయా లని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఉత్తమ ఫలితాల సాధన కు అవకాశం లభిస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం పలువురు విద్యార్థులు సెలవు రోజున భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి రావ డం లేదని, ఇకపై ఆ సమస్య ఉండబోదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

● 25వేల మందికి ప్రయోజనం

సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం వల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 25వేల మందికిపైగా టెన్త్ విద్యార్థులకు ప్రయోజనం కలుగనుంది. ఈ కార్యక్రమాన్ని పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యే మార్చి 17వతేదీ వరకు కొనసాగించనున్నారు. అప్పటి వరకు మొత్తం 11 సెలవులు వస్తుండగా వీటిలో 7 ఆదివారాలు, రెండు రెండో శనివారాలు, ఈ నెల 26 మహా శివరాత్రి, మార్చి 14న హోలీ పండుగ ఉన్నాయి.

ఉత్తమ ఫలితాలకు అవకాశం

ప్రభుత్వ నిర్ణయంతో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిం చేందుకు మరింత అవకాశం లభించింది. ఇప్పటికే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి తరగతులు నిర్వహిస్తుండగా, సెలవు రోజుల్లో సైతం నిర్వహిస్తున్న తరగతులకు మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వచ్చింది. జిల్లాలోని హెచ్‌ఎంలు, ఎంఈవోలు, డిప్యూటీ ఈవోలు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించాము.

- డాక్టర్ ఆర్ బాలాజీరావు, డీఈవో




మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

18 ఆలయాల పునఃనిర్మాణానికి

రూ.38 కోట్ల మంజూరు

- శివరాత్రికి ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు
- మంత్రి ఆనం వెల్లడి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 ప్రసిద్ధ ఆలయాల పునఃనిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం రథసప్తమి సందర్భంగా మూలస్థానేశ్వరాలయంలోని సూర్య భగవాన్ ఆలయంలో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలస్థానేశ్వరుడిని, భువనేశ్వరీ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి ఆనం మాట్లాడుతూ రాబోయే శివరాత్రికి భక్తులు ఇబ్బంది పడకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. మూలాపేట శివాలయానికి తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని, రథసప్తమికి తమ కుటుంబమే ఉభయకర్తలుగా వ్యవహరిస్తోందన్నారు. నగర ఎమ్మెల్యే, మంత్రి పొంగూరు నారాయణతో చర్చించి మూలస్థానేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు వేళాయే!

- జూన్ వరకు పెళ్లిళ్లు
- కళకళలాడనున్న మార్కెట్

మాఘమాసం వచ్చేసింది. సుమూహూర్తాల మూటను మోసుకొచ్చేసింది. నిశ్చితార్థమయిన వారి ఇంట పెళ్లి సందడి తెచ్చేసింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈమాసానికి ఎంతో ప్రాధాన్యముందని ప్రగాఢంగా ప్రజలు విశ్వసిస్తారు. అందుకే మాఘమాసం వివాహాది శుభకార్యాలకు పెట్టింది పేరు. పెళ్లిళ్లు, అక్షరా భ్యాసాలు, నామకరణాలు లాంటివి ఈ రోజుల్లోనే చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు. పెళ్లిళ్లయితే అన్నీ ఇన్నీ కాదు. ఈ సారి కూడా జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సంఖ్య గణనీయంగానే ఉంది. ముందుగానే కల్యాణమండపాలు బుక్కయిపోయాయి. పేరున్న పురోహితులంతా బిజీబిజీనే. కేటరింగ్ నుంచి బాజాభజంత్రీల వారివరకూ అందరూ ఒప్పందాలు కుదుర్చేసుకున్నారు. నాలుగేళ్ల తర్వాత వరుస నెలల్లో శుభ కార్యాలు జరపుకొనేందుకు అవకాశం వచ్చిందంటున్నారు. ఈ క్రమంలో మాఘ మాసంలో పెళ్లిళ్లకు హడావుడి మొదలైపోయింది.



- వివరాలు 6లో..

బిలకూట క్షేత్రంలో ప్రసన్నుడి విహారం



కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వైకానస ఆగమన శాస్త్రప్రకారం ఆలయ అర్చకులు సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఆలయ ప్రదక్షిణ చేపట్టారు. గ్రీన్‌సిటీ ఆఫ్ హైదరాబాద్ కంపెనీ నిర్వాహకులు కొండ్రాజు సుబ్బరాజు, వెంకటరమణమ్మ దంపతులు సూర్యప్రభ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా కోగంటి వేణుగోపాల కృష్ణమా చార్యులు ఆదిత్య హృదయమ్ ప్రవచనం భక్తులకు వినిపించారు. రాత్రి జరిగిన చంద్రప్రభ వాహన ఉత్సవ ఉభయకర్తలుగా కావలి చేరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి పద్మావతి దంపతులు వ్యవహరించారు. ఉత్సవాల్లో కోలాటం, భజన, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)



వేదగిరిపై రథసప్తమి వేడుకలు

రథసప్తమి పర్వదినం సందర్భంగా వేదగిరి క్షేత్రంలో మంగళవారం సప్తవాహన సేవలు నిర్వహించారు. ముందుగా విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేతంగా నరసింహ స్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తదుపరి శేష వాహనం, హనుమంత, గరుడ, సింహ, హంస వాహనాలపై శ్రీవారి ఊరేగారు. చివరిగా రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తుల పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కోనేరులో స్వామి వారి చక్రస్నానం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈవో గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



హంస వాహనంపై ఊరేగుతునన రంగనాథుడు



సింహ వాహనంపై...



పెద్ద శేషవాహనసేవంపై



చల్లని చంద్రుడిపై చక్కని రంగడు

సప్త వాహనాల్లో రంగడి వైభోగం

- వైభవంగా రథసప్తమి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం నెల్లూరులోని తల్పగిరి రంగనాథ స్వామి ఏడు వాహనాలపై భక్తులకు కనువిందు చేశారు. ఉదయం సూర్య ప్రభ వాహనంపై శ్రీవారు కాంతులీనారు. అనంతరం స్వర్ణ గరుడ, సింహ, హంస, బంగారు తిరుచ్చి, పెద్ద శేషవాహనం, రాత్రి చంద్ర ప్రభ వాహనంపై తల్పగిరీశుడు దర్శనమిచ్చారు. విశేష పూజలు, తిరుమంజన సేవలు జరిగాయి. గోవింద.. రంగనాథ నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. పెంచలకోన, వేదగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లోనూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు సప్తవాహన సేవలు జరిగాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీమన్నారాయణుని దర్శించుకున్నారు. జిల్లాలోని వైష్ణవాలయాలు, మూలస్థానేశ్వరాలయంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.



బంగారు తిరుచ్చి



సత్కారం పొందిన విశ్రాంత పోలీసులతో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ సింధుప్రియ, అధికారులు

పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ చేస్తున్న అధికారులకు మంగళవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆత్మీయ వీడ్కోలు పలికారు. నగరంలోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. కావలి 1వ టౌను పోలీసు స్టేషన్‌లో పని చేసిన ఎస్‌ఐ ఎం అంబేడ్కర్, వీసీఆర్‌లో పనిచేసిన ఏఎస్‌ఐ సీహెచ్ వీ కృష్ణయ్య, బిట్రగుంటలో విధులు నిర్వహించే ఏఎస్‌ఐ సీహెచ్ సుధాకర్‌రెడ్డి, దగదర్తిలో విధులు నిర్వహించే ఏఎస్‌ఐ టీ మోహన్‌రావు, గూడూరు 1వ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించే హోమ్‌గార్డు కే శ్రీని వాసులును ఎస్పీ సత్కరించారు. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎటువంటి అవసరమైనా తనను సంప్రదించాలని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ఎస్ బీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి, ఆర్‌ఐలు రాజా రావు, పౌల్‌రాజు, హరిబాబు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

20 సీసాల మద్యం స్వాధీనం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ ఎక్సైజ్ సీఐ ప్రసన్న లక్ష్మి మంగళవారం తెలిపారు. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద 180 ఎంఎల్ 20 బాటిళ్లను తీసుకెళ్తున్న ఉప్పు చెత్తమ్మను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ఆకస్మిక దాడుల్లో ఎస్‌ఐలు శకుంతలాదేవి, మనీర్ అహ్మద్ పాల్గొన్నట్లు తెలిపారు.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టి.... తల్లిదండ్రుల సహకారంతో 'పిట్ట కొంచెం -కూత ఘనం' అన్నట్లుగా ఐదేళ్ల వయసు నుంచే స్కేటింగ్‌లో సాధన మొదలు పెట్టాడు. కుందూరు నాగదర్శన్(6). తండ్రి రాజేష్‌కు స్కేటింగ్‌పై ఉన్న మక్కువ తో ఆయనతోపాటు రింక్‌కు వెళ్లేవాడు. స్కేటింగ్‌లో తనకు కూడా శిక్షణ ఇప్పిం చాలని తండ్రిని కోరగా, వెంటనే ఆ క్రీడలో ఓనమాలకు శ్రీకారం చుట్టారాయన. చిన్న వయసు నుంచే క్రీడాసాధన చేస్తూ సీనియర్లను సైతం ఆకట్టుకోవడంతో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ నిర్వాహకులు ఆ బాలుడిని మరింత ప్రోత్సహిం చారు. దీంతో ఆ క్రీడలో మంచి పట్టు సాధించాడు. ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకాలు సాధించి ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డు అందుకున్నాడు. ఈ క్రమంలో నాగదర్శన్‌పై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

- నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి)



- ఐదేళ్ల వయసు నుంచే శిక్షణ
- జాతీయస్థాయిలో పతకాలు
- ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డులు

స్కేటింగ్‌లో మేటి నాగదర్శన్

టాలెంట్

● తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

నెల్లూరు నేతాజీనగర్‌కి చెందిన కుందూరు రాజేష్-శివజ్యోతి దంపతుల కుమారుడు నాగదర్శన్. ఇథాకా ఇంటర్నేషన్ స్కూలులో ప్రస్తుతం గ్రేడ్-1 చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సా హంతో స్కేటింగే ప్రాణంగా ప్రతిరోజూ సీనియర్లతో కలిసి సాధన చేస్తున్నాడు. అతడిలోని క్రీడా ప్రతిభను గుర్తించిన సీనియర్లు మరింత ఉత్తమ శిక్షణ అందిస్తే ఉన్నతంగా రాణిస్తాడని సూచించారు. దీంతో 2023లో తల్లి దండ్రులతోపాటు తాత నాగేశ్వరరావు చొరవ తీసుకుని అసోసియేషన్ ద్వారా చిల్డ్రన్స్ పార్కులోని స్కేటింగ్ రింక్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు కృషిచేశారు. అక్కడే ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఆ బాలుడిలోని క్రీడాప్రతిభ ను గుర్తించిన అసోసియేషన్ నిర్వాహకులు పలు పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

● ఎన్నో పతకాలు సొంతం


జిల్లాస్థాయిలో సబ్‌జూనియర్ విభాగంలో రోలర్ స్కేటింగ్‌లో సత్తాచాటి, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. 2024లో కాకినాడలో జరిగిన ఏపీ ఓపెన్ రోలర్ స్కేటింగ్‌లో రెండు బంగారు పతకాలు సాధించాడు. అనంతరం అదే ఏడాది కాకినాడలోనే జరిగిన 36వ ఆర్‌ఎస్ఎఫ్‌ఐ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్‌లో బంగారుపతకం సాధించి, జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. మైసూర్‌లో జరిగిన 63వ జాతీయ పోటీల్లో సత్తాచాటి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. అతిచిన్న వయసులోనే పతకాలు సాధిస్తున్న నాగదర్శన్‌లోని క్రీడా ప్రతిభను గుర్తించిన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ఈ ఏడాది రిపబ్లిక్ దినోత్సవం నాడు ఉత్తమ క్రీడాకారుడిగా ఎంపిక చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.



కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న క్రీడాకారుడు నాగదర్శన్

● అంతర్జాతీయ స్కేటింగ్‌లో రాణించాలని..

ఈ సందర్భంగా చిన్నారి నాగదర్శన్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్కేటింగ్‌లో పత కాలు సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని తెలిపాడు. అసోసియేషన్‌తోపాటు సీనియర్ క్రీడాకారుల సహకారంతో మరింత ఉత్తమ శిక్షణ పొంది జిల్లా కీర్తిని ఇనుమడింప చేస్తా నని చెప్పాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ పతకాలు సాధిస్తున్నానని వివరించాడు. ఇదే స్ఫూర్తితో చదువులోనూ ఉత్తమంగా రాణిస్తూనే క్రీడల్లో కూడా సత్తా చాటుతానని పేర్కొన్నాడు.



సూర్యభగవానుడికి నీరాజనాలు అర్పిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

ఆదిత్యునికి దత్తపీఠాధిపతి పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో రథసప్తమి సందర్భంగా సూర్య భగవానుడికి దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థస్వామిజీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి సచ్చిదానంద స్వామి తలపై అఖండ జ్యోతి, చేతుల్లో దీపాలతో ఆదిత్యునికి నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా ఆలయం లో సౌర హోమం, కార్యసిద్ధి ఆంజనేయస్వామికి వెన్నతో అలంకారం జరిగాయి. పీఠాధిపతి దత్త క్షేత్ర యాత్రను ముగించుకుని కడపకు తరలి వెళ్లారు. వేడుకలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.

ద్వారకాపీఠం సంస్థాపన మహోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆదిశంకరాచార్యులు గుజరాత్‌లో స్థాపించిన పశ్చిమామ్నాయ ద్వారకా పీఠం సంస్థాపన మహోత్సవాలు నగరంలోని పొగతోట ఆదిశంకర ధ్యాన మందిరంలో మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమాన్ని చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకరా ధ్యాన మందిరం ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. ధ్యాన మందిరం మేనేజర్ సమయానందనాథ స్వామి ద్వారకా పీఠం విశేషాలు తెలిపారు. ద్వారకా క్షేత్రం, కృష్ణతత్వంపై పద్య కవి డాక్టర్ సింగరాజు శివరామకృష్ణ రావు శర్మ ప్రసంగించారు. సురభి మహాలక్ష్మి బృందం సౌందర్యలహరి గానం చేసింది.

నీరు-చెట్టు బిల్లులకు బ్రేక్!

- సీఎఫ్ఎంఎస్ ఆగిపోవడంతో అప్‌లోడ్ కాని బిల్లులు
- కాంట్రాక్టర్లలో ఆందోళన
- సీఈ దృష్టికి తీసుకెళ్లాం : ఇరిగేషన్ ఎస్ఈ

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నాడు వైసీపీ ప్రభుత్వం, నేడు అధికారుల రూపంలో నీరు-చెట్టు బిల్లులకు గ్రహణం వెంటాడుతోంది. జనవరి నెలాఖరులోపు నీరు-చెట్టు బిల్లులన్నీ అప్‌లోడ్ చేయాలని కూటమి ప్రభుత్వం నవంబరులోనే ఆదేశించింది. అయితే ఆ గడువులోపు చాలా బిల్లులు అప్‌లోడ్ జరగలేదు. ఇప్పుడు సీఎఫ్ఎంఎస్ హెడ్ క్లోజ్ అవడంతో బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు వీల్లేకుండా పోయింది. మళ్లీ ఎప్పుడు అవకాశం ఇస్తారు? ఇంకెప్పుడు అప్‌లోడ్ చేస్తారు? అని నీరు-చెట్టు బాధితులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి జిల్లాలో 2433 నీరు-చెట్టు పనులకు సంబంధించి రూ.191.29 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే అప్పట్లో నీరు-చెట్టు పనులపై అనేక రకాల ఎంక్వయిరీలు వేసి బిల్లులు చెల్లింపులో జాప్యం చేశారు. చివరకు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించడంతో కొన్ని బిల్లులకు మోక్షం కలిగింది. ఇంకా కొన్ని కేసులు కోర్టులో పెండింగ్ ఉండగా, మరికొంత మంది కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇంతలో ప్రభుత్వం మారడం, కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో నీరు-చెట్టు బిల్లులను పూర్తిగా చెల్లించాలని నిర్ణయించింది. ఇందుకుగానూ బడ్జెట్‌ను కూడా కేటాయించింది. ఈ బిల్లులను టాప్ ప్రియారిటీ కింద తీసుకొని వేగంగా అప్‌లోడ్ చేయాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించిచంది. అయితే ఎప్పుడో జరిగిన పనులు కావడంతో కొన్ని ఎంబుక్‌లు కనిపించకపోవడం, అప్పట్లో పనులు చేయించిన అధికారులు బదిలీ అవడంతో జాప్యం జరిగింది. మరికొంత మంది అధికారులు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనులు చేసిన కాంట్రా క్టర్లు ఇరిగేషన్ కార్యాలయాల చుట్టూ తిరగడం మొదలుపెట్టారు. నీరు-చెట్టు బిల్లుల అప్‌లోడ్‌లో జరుగుతున్న జాప్యంపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి' కూడా కథనాలు ప్రచురించింది. ఆ తర్వాత ఇరిగేషన్ అధికారులు కొంత కదిలినప్పటికీ ఈలోపు సీఎఫ్ఎంఎస్ హెడ్ క్లోజ్ అయిపోయింది. జిల్లాలో ఇంకా సుమారు రూ.20 కోట్లకు సంబం ధించిన 700లకుపైగా బిల్లులు పెండింగ్ ఉన్నాయని అంచనా. వీటన్నింటినీ అప్‌లోడ్ చేయాలంటే మరికొంత సమయం అవసరమవుతుంది. ఈ విషయంలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని ప్రభుత్వంతో మాట్లాడితే గానీ కాంట్రాక్టర్లకు న్యాయం జరగదు. కాగా ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశా నాయక్‌ను వివరణ కోరగా నీరు-చెట్టు బిల్లులు అప్‌లోడ్‌కు సంబం ధించి సీఎఫ్ఎంఎస్ హెడ్ ఆగిపోయిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయాన్ని మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సీఎఫ్ఎంస్ హెడ్‌లు ఓపెన్ అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

- జూన్ వరకు పెళ్లిళ్లు
- కళకళలాడనున్న మార్కెట్
- కల్యాణ మండపాలకు డిమాండ్

మనుబోలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాఘమాసం వచ్చేసింది. పెళ్లి సందడి మొదలైంది. మాఘమాసంలో వివాహాలకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ సీజన్‌లో పెళ్లిళ్లు చేసుకునేందుకు వధూవరుల కుటుంబాలు ఆసక్తి చూపుతాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు పంటలు చేతికి వచ్చి విరామ సమయంగా ఉండటంతో వివాహాలకు అనువైన సమయంగా భావిస్తుంటారు. ఇప్పటికే ఈ మాసం ప్రారంభమై ఊపందుకున్న వివాహాల సీజన్ నాలుగు నెలల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. దీంతోపాటు ఇతర దుకాణాల్లో వ్యాపారాలు జోరందుకున్నాయి. దీంతో పట్టణాలు, పల్లెల్లో సందడి నెలకొంది. కల్యాణ మండపాలు, అలంకరణ, లైటింగ్, పూల అలంకరణలు, బ్యూటీషియన్, ఫొటో, వీడియో తదితర వాటికి గిరాకీ పెరిగింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మాఘమాసం ముందుగా రావడంతో ఫిబ్రవరిలోనే రికార్డుస్థాయిలో వివాహాలు జరగనున్నాయి. మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ, జ్యేష్ఠమాసం కొంతవరకు వివాహాల మహూర్తాలున్నాయి. వీటితోపాటు గృహప్రవేశాలు, కొత్త ఇంటి నిర్మాణాలకు శంకు స్థాప నలు, కొత్తగా నిర్మించిన ఆలయాల ప్రారంభోత్సవాలకు ఈ నాలుగు నెలల్లో మంచి మహూ ర్తాలు ఉన్నాయి.



శుభకార్యాలకు వేళాయే!

ముహూర్తాల తేదీలు ఇవే...

- ఫిబ్రవరి: 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23
- మార్చి: 1, 2, 7, 9, 12, 14, 15, 16
- ఏప్రిల్: 9, 10, 11, 12, 17, 18, 20, 23, 29, 30
- మే: 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22



అద్భుతమైన మహూర్తాలు

అన్ని శుభకార్యాలకు ఈ నెల నుంచి జూన్ 8వ తేదీ వరకు అద్భుతమైన శుభ మహూర్తాలు ఉన్నాయి. చాలా కాలం తరువాత వరుసగా నాలుగు నెలల పాటు ఇన్ని ముహూర్తాలు రావడం విశేషం. తరువాత ఆశ్వయుజ మాసంనుంచి మార్గశిరం వరకు చాలా మహూర్తాలు ఉన్నాయి. పై ముహూర్తాలు అందరికీ వర్తించవు. వారి వారి జాతకాలు ప్రకారం సరిచూసుకోవాలి.

- అవధానం జయసింహ శర్మ, వేదపండితుడు

ఊరంతా సిమెంట్ రోడ్ల నిర్మాణం

- మూడు దశాబ్దాల కల నెరవేరిన వేళ
- రూ.35లక్షల ఉపాధి నిధులతో 12 సీసీరోడ్ల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గమళ్లపాలెం వాసులు

జలదంకి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో గమళ్లపాలెం గ్రామం జలదంకి పంచాయతీలో ఉంది. ఈ గ్రామంలో వందకు పైగా కుటుంబాలున్నాయి. అందరూ బీసీ సామాజిక వర్గానికి చెంది గౌడ కులస్థులే. గత 30ఏళ్లుగా వీరు అంతర్గత వీధులు బాగు చేయాలని చేయని పోరాటం లేదు. అందుకోసం వీరు గ్రామం నుండి మండలకేంద్రం వరకు, అక్కడి నుంచి కావలి ఆర్డీఓ కార్యాలయంకు పాదయాత్ర కూడా చేశారు. జలదంకి బస్టాండ్‌లో నిరసనదీక్షలు అనేకమార్లు చేపట్టారు. అయినా వారి కోరిక నెరవేరలేదు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంకు వచ్చిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు గ్రామస్థులు తమ బాధలు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే అయిన వెంటనే చేయిస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట మేరకు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.35లక్షల ఉపాధి నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టారు. పనులు చేపట్టిన 15రోజుల వ్యవధిలోనే 12రోడ్ల నిర్మాణం పూర్తి చేయించడంతో గ్రామస్థులు ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థుల తరపున ధన్యవాదాలు



ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుని సీసీ రోడ్లు వేయించారు. గతంలో ఏ ఎమ్మెల్యే కూడా ఇలా ఇచ్చినమాట నిలబెట్టుకోలేదు. ఇపుడు ఇబ్బందులన్నీ తీరాయి. సీఎం, డిప్యూటీ సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు గ్రామం తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నా.

- మాతిన సుబ్బరత్తమ్మ, గమళ్లపాలెం



గమళ్లపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఎమ్మెల్యే అంటే సురేష్‌లా ఉండాలి



మా ఎమ్మెల్యే మాట చెప్పాడంటే చేయకుండా మానడు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను హామీలుగా వదిలేయకుండా డైరీ రాసుకుని దాని ప్రకారం చెప్పిన పనులన్నీ వరుసగా చేస్తున్నాడు. జలదంకి మండలం అభివృద్ధిలో నియోజకవర్గంలోనే మొట్టమొదటి స్థానంలో నిలబెడుతున్నాడు. గమళ్లపాలెం ప్రజలు ఎంతో కాలంగా పడుతున్న ఇబ్బందులు తీర్చడం ఆనందంగా ఉంది.

- పీ.మధుమోహన్‌రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్

వర్షం వస్తే వెన్నులో వణుకు వచ్చేది..



వర్షాకాలంలో గ్రామంలోని వీధులన్నీ వర్షపు నీరు మురుగునీటి నిల్వతో దుర్గంధంగా ఉండేవి. వర్షాలు వస్తున్నాయంటే మాకు వెన్నులో వణుకు పుట్టేది. వీధుల జలమయంతో ఇంట్లోంచి నుండి బయటకు వచ్చేవాళ్లం కాదు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మా పాలిట దేవుడు. ఆయన చొరవతో మా గ్రామంలో రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించారు. 15రోజుల్లో రోడ్లన్నీ వేయించాడు. చాలా ఆనందంగా ఉంది.

- సూరం పుష్పమ్మ, గమళ్లపాలెం

ఆలయాల్లో రథసప్తమి పూజలు

కావలి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదిన వేడుకలు మంగళవారం పట్టణంలో వైభవంగా జరిగాయి. బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, ముసునూరు హనుమత్ క్షేత్రం, కచ్చేరిమిట్ట వెంకటేశ్వరస్వామి ఆలయం, వెంగళరావునగర్‌లోని సూర్య భగవాన్ ఆలయాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

● బృందావనం కాలనీలో..

హౌసింగ్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో స్వామి వారు సప్త వాహనాల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సూర్యప్రభ వాహన సేవలతో ప్రారంభమై చిన్నశేషన, గరుడ, హనుమంత వాహన సేవలు నిర్వహించారు. మధ్యాహ్నం 1గంటకు చక్రస్నానం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటలకు చంద్రప్రభ వాహన సేవలతో రథసప్తమి మహోత్సవం ముగిసింది. రథసప్తమి అన్నదాన కమిటీఆధ్వ ర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

● అల్లూరు: స్థానిక గీతాశ్రమంలో జరిగిన వేడుకలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో నిర్వహించిన హోమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, మోమిడి మాధవరావు, ఏలూరు మధురెడ్డి, ఆదిలక్ష్మమ్మ, శకుతలమ్మ, దగదర్తి నాయకులు కొండపనాయుడు పాల్గొన్నారు.

● కొండాపురం: మండల ప్రజలు, భక్తులు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. జిల్లేడు ఆకులతో తలంటుస్నానం చేసి చక్కెరతో పొంగళిపెట్టి చిక్కుడు ఆకులలో స్వామివారికి నైవేద్యం పెట్టారు. రథ సప్తమితో వేసవికాలం ఆరంభమై ఎండ తీవ్రత నుండి తమన కాపాడాలంటూ భక్తులు వేడుకోవడం ఈపండుగ ఆనవాయితీ అని చెప్పారు.

● వాడవాడలా వేడుకలు

ఉదయగిరి: మండలంలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకొని పంచామృతాభిషేకాలు, ఆకు, కుంకుమ పూజలు నిర్వహించారు. గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, కుర్రపల్లి, లింగాలదొన, అయ్యవారిపల్లి, చెరువుపల్లిలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

● అనంతసాగరం: వరికుంటపాడు కోదండరామస్వామి ఆలయంలో వేడుకలను నిర్వహించి స్వామిని ఊరేగింపు చేపట్టారు.



కావలి: గరుడ వాహనంపై శ్రీవారు



ఉదయగిరి: గండిపాళెం అభయాంజనేయస్వామి ఆలయంలో..



అల్లూరు : పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి



అనంతసాగరం : కోదండరాముడి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రతి పంచాయతీకి మోడల్ ప్రైమరీ స్కూల్

● పీవీ రమణయ్య, ఎంఈవో-2



ఉలవపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశ పెట్టిన జీవో నెంబరు 117 ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి నూతన విద్యావ్యవస్థకు శ్రీకారం చుట్టబోతుందని ఎంఈవో-2 పీవీ రమణయ్య తెలిపారు.

? విద్యావ్యవస్థలో చేపట్టనున్న చర్యలేవీ.

! రాబోవు విద్యా సంవత్సరంలో 3,4,5 తరగతి పిల్లల కోసం ప్రతి పంచాయితీలో మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయనుంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు క్లాస్ టీచర్‌ని నియమించేలా ఆలోచనలు చేస్తుంది.

? ఏకోపాధ్యాయ పాఠశాలలెన్ని ఉన్నాయి.

! మండలంలో 53ప్రాథమిక, 2యూపీ స్కూళ్లు ఉన్నాయి. అందులో ఏకోపాధ్యాయ పాఠశాలలు 14ఉన్నాయి. 117జీవో రద్దుతో తిరిగి ఆ పాఠశాలకు తరగతుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ పెరుగుంది.

? హాజరుశాతం పెరిగేలా చర్యలేవి.

! ప్రవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నడిపేందుకు మెరుగైన వసతులు కల్పిస్తాం. తల్లిదండ్రుల భాగసామ్యంతో మెగా పేరెంట్స్ డే, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, అవసరమైన 9రకాల వస్తువుల ఉచిత కిట్ బ్యాగ్ ఇస్తున్నాం.

? 10 ఉత్తీర్ణతశాతం పెరగనుందా.

! 10వ తరగతి విద్యార్థులకు గత నెల నుంచి 100 రోజులపాటు స్టడీ క్లాసులు నిర్వహిస్తున్నాం. వారికి ఎస్‌సీఈఆర్టీ స్టడీ మెటీరియ ల్స్ పంపిణీ చేశాం. ఈ ఏడాది నుంచి ఎంఈవోలకు కూడా స్టడీ క్లాసులు నిర్వహణ పర్యవేక్షించమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



కలిగిరి: అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది



కందుకూరు: వాహనదారులతో మాట్లాడుతున్న ఆర్టీవో



బిట్రగుంట: మాట్లాడుతున్న కావలి ఏఎంవీఐ కరుణాకరన్

కందుకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీవో టీవీఎస్.లక్ష్మీ ఆధ్వర్యంలో అధికారులు స్థానిక పామూరురోడ్డు జంక్షన్‌లో ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ విధిగా ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనం నడిపినా, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడిపిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ సీహెచ్ రాంబాబు, నెల్లూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవీఐ బి. గోపినాయక్ పాల్గొన్నారు.

● బిట్రగుంట: కోవూరుపల్లి ఆరోగ్య కేంద్ర సిబ్బందికి ఆర్టీవో అధికారులు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకరన్, లక్ష్మీ భాయ్‌లు హెల్మెట్ ధారణపై వివరించారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ స్వరూపరాణి వైద్యులు రాజశేఖర్, సీహెచ్‌వో సులోచన, పీహెచ్‌ఎన్ ఎఫ్ఎస్ మేరీ, విక్టోరియా రాణి ఉన్నారు.

● కలిగిరి: ప్రమాదం జరిగినపుడు తక్షణం బాధితుడికి అందించే ప్రథమ చికిత్సతో ప్రాణరక్షణకు తోడ్పడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రవాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్‌కుమార్, సీహెచ్ఓ సాయిలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సంగం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జెండాదిబ్బ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎస్ఐ రాజేష్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసాలకు పాల్పడుతున్నారు.. వాటి నుంచి ఎలా రక్షణ పొందాలని వివరించారు. ఎవరైనా సైబర్‌మోసాలకు గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: అధునాతన టెక్నాలజీతో సైబర్ నేరాలకు తెగబడే విధానాన్ని స్టేట్ బ్యాంక్ మేనేజర్ నరేష్‌బాబు తెలిపారు. కాకర్లవారిపాలెం, వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్‌లో కళాజాతా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన లావాదేవీలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వచ్చే ఐవీఆర్ కాల్స్‌కు స్పందించకపోడం ఉత్తమం అన్నారు. అనుమానం వస్తే తక్షణమే సంబంధిత బ్యాంక్ బ్రాంచ్, బ్యాంకు హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేయాలని మేనేజర్ నరేష్‌బాబు తెలిపారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు

కందుకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేజీబీవీ, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కేజీబీవీలపై తనకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్న ఆయన ప్రత్యక్షంగా చూసి బాగుందనటం వెనుక ఆయన పర్యటన లీకు అవటమే కారణమన్న అభిప్రాయం వ్యక్తమైంది.

మామిడిలో పూత, పిందె దశ కీలకం

ఉలవపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కందుకూరు కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ సైంటిస్ట్ ప్రసాద్‌బాబు మంగళవారం చాగొల్లు మామిడి రైతులకు మండల ఉద్యానఅధికారి జ్యోతి ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. మామిడి సాగులో పూత.. పిందె దశ ఎంతో కీలకం అని సస్యరక్షణ పద్ధతులు పాటించి సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంతరం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ అండ్ పీడీ ఏపీఎంఐపీ శ్రీనివాసులు, పెరియవరం సీనియర్ సైంటిస్ట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

● కలిగిరి : పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కృష్ణారెడ్డిపాలెం, శెట్టిపాలెం, ఆదిమూర్తిపురం, తూర్పుజంగాలపల్లిలో మంగళవారం బోర్డు అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు మహేష్‌కుమార్, శివకుమార్, ఐటీసీ, జీపీఐ కంపెనీ ప్రతినిధులు వెంకట్రావు, ఉన్నం శ్రీనివాసరావ పాల్గొన్నారు.

● మర్రిపాడు: డీసీపల్లి వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ జాలయనగరం, నెల్లూరుపాలెం, రావులకొల్లు, డీసీపల్లి గ్రామాల్లో పొగాకు పంటలను, క్యూరింగ్‌ను పరిశీలించారు. రైతులు అనుమతికి మించి పొగాకు పండించటమేకాక ఇప్పటికీ కూడా నాట్లు వేస్తుండడంతో నష్టపోయేందుకు అవకాశం ఉందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):కోళ్ల వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ తలవాపు, నల్లబడడం, మేత తినకపోడం లక్షణాలు కనిపిస్తే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గ్రామాల అభివృద్ధి

ఉదయగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో అన్నిరంగాల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ ప్రవేశపెట్టిన పథకాలను మారుమూల గ్రామాలకు అందేలా పని చేయాలన్నారు. బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆవుల రోశయ్య, చల్లా సుబ్బరత్నం, కార్తీక్, ఖాజానాయబ్ రసూల్, శానంపూడి నరసయ్య, రాంనరేష్, షాజహాన్ పాల్గొన్నారు.

భూమి ఒకటే.. ఇద్దరికి పట్టాలు, భూరికార్డులు

- లింగసముద్రం నుంచే ఎక్కువ అర్జీలు
- కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



సమస్య వింటున్న సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

లింగసముద్రం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒకే భూమికి ఇద్దరికి పట్టాలు, రికార్డులు ఉండటం, అలాగే రికార్డుల్లో కూడా వేర్వేరు పేర్లు ఉండటం లాంటి డూప్లికెట్ అర్జీలు వస్తున్నాయని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక తహీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసి తహసీల్దార్ సీతామహాలక్ష్మి, వీఆర్‌ఓలు, సర్వేయర్లను పలు రెవెన్యూ సమస్యల గురించి ప్రశ్నించారు. కందుకూరులో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఈ మండలం నుంచే ఎక్కువగా ఇలాంటి డూప్లికెట్ అర్జీలు వస్తున్నాయని, అధికారులు జాగ్రత్తగా రికార్డులు, భూములను పరిశీలించి ధృవపత్రాలు ఇవ్వాలన్నారు. అలాగే వీఆర్.కోటలో జరిగే రీసర్వే గురించి వీఆర్‌ఓలు, సర్వేయర్లతో మాట్లాడారు. పొలంలో ఎవరుంటే వారి పేర్లను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఎలాంటి తేడాలు రాకుండా సర్వే చేయాలన్నారు. ఈ సందర్భంగా ముత్యాలపాడు ఒట్టిగుంట రమణయ్య సబ్ కలెక్టర్‌తో మాట్లాడారు. తన తన బంధువు శ్రీనివాసులుకు చెందిన 3ఎకరాలకు పైగా ఉన్న మామిడి తోట ఉందని దాన్ని పెదపవని మాల్యాద్రి 3ఏళ్ల కిందట తన భార్య, కుమారుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని విన్నవించారు. లింగసముద్రంకు చెందిన మరొకరు కూడా ఇలాంటి సమస్యనే ఆమె దృష్టికి తెచ్చారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ రమణయ్య పాల్గొన్నారు.

గీత కులాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కావలి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత కులాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన కావలి, బోగోలు, జలదంకి మండలాల గీతకులస్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు మాట్లాడారు. మద్యం దుకాణాలపై ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తూ లైసెన్స్ ఫీజులో 50శాతం రాయితీ ఇస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జిల్లాకు 18మద్యం షాపులు వచ్చాయన్నారు. ఆసక్తి ఉన్నవారు మద్యం దుకాణాల కోసం బుధవారం సాయంత్రం 5గంటలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్నూలు హైకోర్టు బెంచ్‌లో నెల్లూరును చేర్చొద్దు

కందుకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఏర్పాటు చేయనున్న హైకోర్టు బెంచ్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలను చేర్చటం సమంజసం కాదని ఈ రెండు జిల్లాలను అమరావతి హైకోర్టు పరిధిలోనే ఉంచాలని కందుకూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులునాయుడు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సిద్ధం కావటం హర్షించదగ్గ పరిణామం అని పేర్కొన్నారు. అయితే కర్నూలు బెంచ్ పరిధిలోకి ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కలపటం ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. కందుకూరు నుంచి కర్నూలుకు 300 కిలోమీటర్ల దూరం ఉందని, అదే అమరావతి హైకోర్టుకు కేవలం 180 కిలో మీటర్లు మాత్రమే అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణం పునరాలోచన చేసి ఈ రెండు జిల్లాలను కర్నూలు బెంచ్ నుంచి మినహాయించాలని కోరారు.

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల్‌లో వెలసిన అబ్దుల్ వహబ్ సాహెబ్ గంధమహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. గంధమహోత్సవంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయొచ్చు



రోగిని పరిశీలిస్తున్న డాక్టర్ మాశిలామణి

వింజమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక మాశిలామణి వైద్యశాలలో మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత డీఎంహెచ్‌వో మాశిలామణి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేసి మాట్లాడారు. కేన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవడం సమాజానికి చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, హబ్సిబా, మల్లికార్జున్, శాలిని, కీర్తన, సుజిత్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి:అప్పసముద్రం హెల్త్ క్లీనిక్ కేంద్రంలో వైద్యాధికారి వినీత అవగాహన కల్పించారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. ఇందులో భాగంగా తమ సిబ్బంది ఇంటింటిని సందర్శించి కేన్సర్ సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొనారు. అనంతరం సీహెచ్‌సీ పాత భవనంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈనెల 10న జరిగే డీవార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● కావలి: ఆధునిక జీవనశైలితో వస్తున్న క్యాన్సర్‌ను జయిద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత తెలిపారు. స్థానిక కార్యాలయంలో క్యాన్సర్‌ను జయిద్దాం అంటూ ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మద్యం, పొగ తాగటం, ఆహారపదార్థాలలో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, అధిక బరువు, కాలుష్యం, రేడియేషన్ తదితరాలు క్యాన్సర్‌కు కారకాలన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, రెండో పట్టణ ఎస్ఐ కరీంలు పాల్గొని అవగాహన కల్పించారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

వింజమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోనూ, మండలంలోని గ్రామాల్లోనూ విచ్చలవిడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజుఅధికారులు చూసీచూడనట్లు ఉండడంతో మద్యం వ్యాపారం బాగా విస్తరిస్తోంది. గ్రామాల్లో బెల్ట్ షాపులు వల్ల ప్రజలపై ఆర్థిక భారంపడుతున్నది. అంతేకాక పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. గ్రామాల్లోని ఆలయాలు పాఠశాలలు, బస్‌షెల్టర్లు మందుబాబుల అడ్డాగా మారాయి. అలాగే పట్టణంలో అధిక ధరలకు మద్యం అమ్ముతూ ఆదాయం పొందుతున్నాడు. గ్రామాల్లో బెల్టు షాపుల వల్ల గొడవలు జరుగుతున్నాయని గ్రామీణులు అంటున్నారు. గత ప్రభుత్వంలో కంటే ఈ ప్రభుత్వంలోనే ఎక్కువ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని మండల వాసులు అంటున్నారు. వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

భోజనం ప్లేట్ల అందజేత

కొండాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాయిపేట పంచాయతీ ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని 70మంది విద్యార్థులకు మంగళవారం లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తాటికొండ నవీన్, సాగునీటి సంఘ అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్‌లు భోజనప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కాంగ్రెస్ మండల మాజీ కన్వీనర్ తాటికొండ రామమూర్తినాయుడు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలక్రిష్ణయ, యుగంధర్, మల్లికార్జున, వల్లూరు వెంకటేశ్వర్లు, అరుణ, అనుసూయమ్మ పాల్గొన్నారు.

పనులు ప్రారంభించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లోని కూలీలకు అవగాహన కల్పించి ఉపాధి పనులు ప్రారంభించాలని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతికూలీకి రోజుకు రూ.300 వేతనం తగ్గకుండా వేతనం వచ్చేలా చూడాలన్నారు. శ్రమశక్తి సంఘాలను త్వరతగతిన ఎంపిక చేయాలన్నారు. ఈ నెల 15వ లోపు మంజూరైన 24 గోకులం షెడ్లు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ బాబూరావు, ఏపీఓ ఉమామహేష్ జేఈ వంశీకృష్ణ, టీఏలు ప్రసాద్, మాలకొండయ్య, నాగార్జున అశోక్ పాల్గొన్నారు.

స్థల వివాదంపై విచారణ

బిట్రగుంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జువ్వలదిన్నె పంచాయతీ వడ్డిపాలెంలో ప్రార్థన మందిర వివాదంపై మంగళవారం కావలి రూరల్ సీఐ పాపారావు, తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం విచారణ చేపట్టారు. మందిర ప్రాంతంలో నూతన నిర్మాణాలు చేపట్టకుండా ప్రార్థనలు చేసుకోవచ్చని తెలిపారు. .

ప్రతిభా పోటీలతోనే సృజనాత్మకత

కావలి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా పోటీలతోనే సృజనాత్మక తెలుస్తుందని అగ్నిమాపక శాఖ అధికారి రామ్‌సిద్ధార్థ తెలిపారు. మంగళవారం రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వశాంతి హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు గణిత ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. బహుమతి ప్రధానోత్సవంలో ఆయన పాల్గొని విజేతలకు నగదుతో పాటు మెమోంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. విశ్రాంత అధ్యాపకులు పీఎస్ ప్రసాద్ రత్నమ్మ ఫౌండేషన్‌తో పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

మెమో జారీకి ఆదేశం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):మాలకొండ అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి, సూపర్‌వైజర్ సునీతకు మెమో జారీ చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్టకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌భాస్కర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన కేంద్రంను తనిఖీ సమయంలో పిల్లల హాజరు రిజిస్టరులో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి చర్యలకు ఆదేశించారు.

ఎంఈవో-2కి సన్మానం

అనంతసాగరం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):మండల ఎంఈవో-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి జిల్లా ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా నెల్లూరులోని టౌన్ హాలులో మంగళవారం ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ ప్రైవేటు విద్యాసంఘం అధ్యక్షుడు తులసీ ప్రసాద్ చేతులు మీదుగా ప్రభాకర్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందించి ఘనంగా సన్మానించారు.

భవిష్యత్ కోసమే పోరాటం

కావలి టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఫీజు రీయింబర్స్‌పై పోరాటం అని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ముసునూరు స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. బుధవారం చేపట్టనున్న ధర్నా పార్టీ నిర్ణయం మేరకు వాయిదా పడిందని, తదుపరి తేదీని ప్రకటిస్తామన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

సీతారామపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బసినేనిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బసినేనిపల్లి, అయ్యవారిపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రైమరీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఎంఈవో మస్తాన్‌వలి అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో గుణాత్మక విద్యను పెంపొందించుట, మోడల్ ప్రైమరీ స్కూళ్ల అభివృద్ధి పరచుట, ఎస్‌ఎంసి సభ్యుల ఆమోదం మేరకు ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చేందుకు పేరెంట్స్ కమిటీ సభ్యుల సలహాలపై చర్చించారు.

హద్దు రాళ్ల తొలగింపు

కావలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తుమ్మలపెంట రోడ్డు, కొనదిన్నె గిజనకాలనీ ప్రాంతాల్లోని అనధికార లే అవుట్లను అధికారులు గుర్తించి సరిహద్దు రాళ్లు, కాలువలను ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పనులు జరిగాయి.

